

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 286

శుక్రవారం 6-1-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఫేజ్ 1 ప్రారంభం

G SQUARE EPITOME
INTEGRATED
CITY

ఎన్నో లాభాలు, మరెన్నో ప్రయోజనాలు

- 1242 ఎకరాల అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ సిటీలో 368 ఎకరాల ప్రీమియం ప్లాట్లు
- హైదరాబాదులోనే అతి పెద్ద క్లబ్‌హౌస్ - 5.65 ఎకరాలలో
- 24 ప్రత్యేకమైన పార్కులు
- పార్కులు, స్పోర్ట్స్ అకాడమీ, మాల్, స్కూల్, కాలేజ్ ఉన్న ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటీ
- పూర్తిగా అభివృద్ధి చెందిన మౌలిక సదుపాయాలు - బ్లాక్ టాప్ రోడ్లు, స్ట్రీట్ లైట్స్, అండర్ గ్రౌండ్ EB, వాటర్ & డ్రైనేజ్
- ఖచ్చితమైన, వేగవంతమైన విలువ పెరుగుదల

140+ ప్రపంచ స్థాయి సౌకర్యాలున్న ప్రీమియం విల్లా ప్లాట్ కమ్యూనిటీ

పార్క్ 1 - గ్యాదరింగ్ పార్క్
1. అవుట్‌డోర్ పార్టీ లాన్
2. బార్బెక్యూ కార్నర్
3. అల్ ఫ్రెస్కో
4. డిజె కన్సోల్
5. డాన్స్ ఫ్లోర్
6. గ్రాఫిటీ కార్నర్
7. ఆంఫీథియేటర్
8. బాన్‌ఫైర్ పిట్
9. సీటింగ్ పెవిలియన్
10. సక్రెడ్ వాల్ ఆర్ట్
11. లోటస్ పాండ్
12. హామక్ గార్డెన్
13. కన్వెన్షన్ కియోస్క్
14. అవుట్‌డోర్ థియేటర్
15. అవుట్‌డోర్ జిమ్
16. HIIT వర్కవుట్ జోన్
17. ఆక్యుపంచర్ వాక్
18. అవుట్‌డోర్ ఏరోబిక్స్
19. యోగా కబానాస్
20. ప్రాణ హీలింగ్ సెంటర్
21. చెస్ గార్డెన్
22. పెద్దల ఉయ్యాల పార్క్
23. ధ్యాన కేంద్రం
24. లాఫింగ్ పార్క్

పార్క్ 2 - పిల్లల పార్క్
25. పిల్లల ఉయ్యాల
26. పిల్లల సీ-సా
27. పిల్లల స్లైడ్
28. పిల్లల మంకీ బార్స్
29. పిల్లల డూడుల్ కార్నర్
30. పిల్లల స్ప్లాష్ ప్యాడ్
31. పిల్లల జంగిల్ జిమ్
32. పిల్లల మెర్రీ-గో-రౌండ్
33. గార్డెన్ వాక్
34. గాగా బాల్ పిట్
35. పిల్లల టాట్ లాట్
36. పిల్లల హాప్‌స్కాచ్
37. పిల్లల ప్లే కాసిల్
38. పిల్లల నెట్
39. పిల్లల ఇంటరాక్టివ్ వాటర్ జెట్స్
40. పిల్లల ట్రాంపోలిన్ పార్క్
41. పిల్లల రాక్ క్లైంబింగ్ వాల్
42. పిల్లల రోప్ బ్రిడ్జ్
43. పిల్లల జిప్‌లైన్
44. పిల్లల స్ప్లాష్ పాండ్
45. పిల్లల సైక్లింగ్ ట్రాక్

పార్క్ 3 - టాడ్లర్ పార్క్
46. ఇసుక పిట్ (ప్లే జోన్)
47. టాడ్లర్ ప్లే జోన్
48. టాడ్లర్ స్వింగ్
49. టాడ్లర్ స్ప్రింగ్ రైడర్
50. టాడ్లర్ టాట్ లాట్

పార్క్ 4 - స్పోర్ట్స్ పార్క్
51. జాగింగ్ ట్రాక్
52. క్రికెట్ నెట్ ప్రాక్టీస్
53. మల్టీపర్పస్ గ్రౌండ్
54. రిఫ్రెష్మెంట్ కియోస్క్
55. త్రోబాల్
56. టెన్నిస్ కోర్ట్
57. కబడ్డీ కోర్ట్
58. బాస్కెట్‌బాల్ కోర్ట్
59. బ్యాడ్మింటన్ కోర్ట్
60. ఫుట్బాల్ కోర్ట్
61. వ్యూయింగ్ గ్యాలరీ
62. వాలీబాల్ కోర్ట్
63. బీచ్ వాలీబాల్
64. అవుట్‌డోర్ టేబుల్ టెన్నిస్
65. లాంగ్ జంప్ పిట్
66. పెద్దల స్కేటింగ్ ఎరీనా
67. పిల్లల స్కేటింగ్ ఎరీనా

పార్క్ 5 - పెద్దల పార్క్
68. రిఫ్లెక్షన్ పాండ్
69. పెద్దల లాన్ బౌల్
70. పెద్దల క్రోకెట్
71. గజిబో
72. రిఫ్లెక్సాలజీ పాత్‌వే
73. సీనియర్ సిటిజెన్ ఫిట్‌నెస్ స్టేషన్
74. పెద్దల ఉయ్యాల పార్క్
75. పార్క్ 6 – ఏకోలాజికల్ పాండ్

పార్క్ 7 - అరైవల్ గార్డెన్-01
76. పిల్లల మేజ్
77. గజిబో
78. గార్డెన్ వాక్
79. పెబ్బల్ గార్డెన్

పార్క్ 8 - గార్డెన్ ఆఫ్ ఎపిటోమ్
80. ఎపిటోమ్ స్కల్ప్చర్
81. సీటింగ్ (గ్రూప్ సైటింగ్)
82. పామ్ కోర్ట్

పార్క్ 9 - అరైవల్ గార్డెన్-02
83. వెల్కమ్ పాండ్
84. రెస్టింగ్ పెవిలియన్
85. ఫ్లమేరియా గ్రోవ్

పార్క్ 10 - పెట్ పార్క్
86. పెట్ ప్లే ఏరియా
87. పెట్ స్ప్లాష్ పాండ్
88. పెట్ హర్డిల్ ట్రాక్

పార్క్ 11 - మినీ గోల్ఫ్ పార్క్
89. మినీ గోల్ఫ్ పార్క్
90. ఆటగాళ్ల కబానాలు

91. పార్క్ 12 - మల్టీపర్పస్ పార్క్ - 1
    పార్క్ 14 - మల్టీపర్పస్ పార్క్ - 2
92. పార్క్ 13 - లీజర్ పార్క్ - 1
    పార్క్ 23 - లీజర్ పార్క్ - 2
93. పార్క్ 15 - మ్యానిక్యూర్ గార్డెన్ - 1
    పార్క్ 22 - మ్యానిక్యూర్ గార్డెన్ - 2
94. పార్క్ 16 - ఫెర్న్ గార్డెన్
95. పార్క్ 17 - ఆరోమా గార్డెన్
96. పార్క్ 18 - గార్డెన్ ఆఫ్ టైం
97. పార్క్ 19 - హెర్బల్ గార్డెన్
98. పార్క్ 20 - ఫ్లవర్ గార్డెన్
99. పార్క్ 21 - స్కల్ప్చర్ గార్డెన్
100. పార్క్ 24 - ట్రాంక్విల్ పార్క్

క్లబ్ హౌస్
101. వాటర్ కాస్కేడ్ ఫీచర్
102. బగ్గీ కార్ స్టేషన్
103. ఫౌంటెన్ ఆఫ్ లైట్
104. కెఫిటేరియా
105. టీవి లాంజ్
106. వాల్ అక్వేరియం
107. ఫార్మసీ
108. బ్యూటీ సెలూన్
109. లాండ్రోమాట
110. రేషెల్ బార్
111. జిమ్
112. ఏరోబిక్స్
113. జుంబా స్టూడియో
114. TRX ట్రైనింగ్
115. ఫిజియోథెరపీ హెల్త్ కార్నర్
116. స్టీమ్ రూమ్
117. సౌనా రూమ్
118. జాకుజీ
119. మసాజ్ రూమ్
120. క్యారమ్
121. చెస్
122. టేబుల్ టెన్నిస్
123. బిలియర్డ్స్
124. స్క్వాష్ కోర్ట్
125. రాకెట్‌బాల్ కోర్ట్
126. క్రెష్
127. పిల్లల గ్రంథాలయం
128. పిల్లల అమ్యూజ్మెంట్ ఆర్కేడ్
129. పిల్లల బాల్ పూల్ & క్యూబ్ పిట్
130. టాడ్లర్ రూమ్
131. పిల్లల ఆర్చరీ / గన్ షూటింగ్ రూమ్
132. బాంక్వెట్ హాల్
133. ప్రైవేట్ ఈవెంట్ / డైనింగ్ / మీటింగ్ హాల్
134. గెస్ట్ సూట్స్
135. మినీ థియేటర్
136. గ్రంథాలయం
137. రీడింగ్ లాంజ్
138. స్కై గేజింగ్ డెక్
139. VR గేమింగ్ హాల్
140. స్విమ్మింగ్ పూల్
141. పిల్లల పూల్
142. డెక్ లాంజ్
143. పూల్‌సైడ్ కబానాస్
144. హెలిప్యాడ్

TS RERA NO : P02000003057

*T&C APPLY









ప్లాట్ ధర ₹48 లక్షల* నుండి మొదలు (267 - 533 SQ.YD.)

G SQUARE EPITOME ప్రారంభ ధర	G SQUARE EPITOME ప్రత్యేక ఆఫర్
~~₹19,500/ SQ.YD.~~	₹17,999/ SQ.YD. (మొదటి 20 బుకింగ్స్‌కు మాత్రమే)



గత కొన్ని సంవత్సరాలలో పెరిగిన విలువ

GACHIBOWLI		VIJAYAWADA HIGHWAY (PROJECTED)	
2013	₹9,500 / SQ.YD.	2023	₹18,000 / SQ.YD.
2023	₹2,30,000 / SQ.YD.	2027	₹72,000 / SQ.YD.

LOCATION MAP



సైట్ విసిట్‌కై క్యాబ్ సౌకర్యం కలదు

89392 68000

www.gsquarehousing.com

Scan Code for Brochure

G SQUARE EPITOME
YOUR PLOT. YOUR HOME. YOUR WAY.


'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 286

శుక్రవారం 6-1-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సినిమా అంటే దేవాలయం..

ఉత్తమ దర్శకుడిగా రాజమౌళి 'న్యూయార్క్ ఫిలిమ్ క్రిటిక్స్ సర్కిల్' అవార్డును అందుకున్నారు. ఆర్ఆర్ఆర్‌కు ఈ అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందని రాజమౌళి చెప్పారు. తన దృష్టిలో సినిమా అంటే ఒక దేవాలయమన్నారు.


- వివరాలు 14లో ▶



జన భాగస్వామ్యంతోనే...

దేశంలో జల సంరక్షణకు ప్రభుత్వం తీసుకొనే చర్యలే సరిపోవని, ప్రజలందరి భాగస్వామ్యం అవసరమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

- వివరాలు 6లో ▶



'వచ్చే జనవరి 1కి రామ మందిరం'

అయోధ్యలో శ్రీరామ మందిరం 2024 జనవరి ఒకటో తేదీ నాటికి సిద్ధమవుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు.

- వివరాలు 6లో ▶



ఆక్రమణల తొలగింపుపై సుప్రీం స్టే

ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో 29 ఎకరాల రైల్వే భూమిలో ఉన్న ఆక్రమణల తొలగింపుపై సుప్రీంకోర్టు స్టే విధించింది.

- వివరాలు 6లో ▶



బీజింగ్‌లో కోవిడ్ బీభత్సం

బీజింగ్‌లో కోవిడ్ బాధితులు ఆస్పత్రులకు పోటెత్తుతున్నారు. చుయాంగ్‌లియూ ఆస్పత్రిలో పడకలన్నీ వృద్ధులతో నిండిపోయాయి.

- వివరాలు 6లో ▶

భూమిని మింగే ప్లానొద్దు

కామారెడ్డి ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌పై రైతుల నిరసన.. కలెక్టరేట్ ముట్టడి.. ఉద్రిక్తత

రైతులు, పోలీసులకు గాయాలు.. నేడు కామారెడ్డి బంద్‌కు పిలుపు

మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం పెద్దయెత్తున ర్యాలీ నిర్వహించిన కామారెడ్డి జిల్లాకు చెందిన పలు గ్రామాల రైతులు.. కలెక్టరేట్ ముట్టడికి యత్నించడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు అడ్డుకోవడంతో జరిగిన తోపులాటలో ఐదుగురు రైతులు గాయపడ్డారు. ఒకదశలో కలెక్టరేట్ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. ఇంత జరిగినా కలెక్టర్ బయటకు వచ్చి తమ గోడు వినలేదని ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు అక్కడే బైఠాయించారు.

బారికేడ్లను తోసుకుంటూ కలెక్టరేట్‌లోకి చొచ్చుకువెళ్తున్న రైతులు



అసలేం జరిగిందంటే..

సమస్య ఏమిటి?

కామారెడ్డి పట్టణంలో చుట్టుపక్కల గ్రామాలను విలీనం నేపథ్యంలో పురపాలక శాఖ నెల క్రితం మాస్టర్‌ప్లాన్ ముసాయిదా విడుదల చేసింది. ఇందులో ఒక ఇండస్ట్రియల్ జోన్‌ను, అలాగే 100 అడుగుల రోడ్డు నిర్మాణాన్ని ప్రతిపాదించింది. ఇండస్ట్రియల్ జోన్‌లో ఇల్చిపూర్, అడ్లూర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, పేక్రియాల్ రైతులు పంట భూములు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.

రైతు ఆత్మహత్యతో ఉద్రిక్తం

రైతులు రైతు ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలనే డిమాండ్‌తో నెలరోజులుగా ఆందోళన చేస్తున్నారు. బుధవారం ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడటంతో ఆందోళనలు తీవ్రరూపం దాల్చింది.

కలెక్టరేట్ ముట్టడికి యత్నం

రైతులు గురువారం భారీయెత్తున రైతుకుటుంబ సమేత ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్‌కు చేరుకున్న రైతులు కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఆ ప్రాంతం రణరంగంగా మారింది.

పోలీసులతో రైతుల తోపులాట..

కలెక్టరేట్ ముట్టడి క్రమంలో రైతులు బారికేడ్లను ఎత్తిపడేశారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో నాలుగు సార్లు తోపులాట జరిగింది. దీంతో పాటు పోలీసులు ముళ్ల కంచె అడ్డుగా పెట్టడంతో ఐదుగురు రైతులు గాయపడ్డారు.

ముసాయిదా ఫైనల్ కాలేదు

ఇది మాస్టర్‌ప్లాన్ ముసాయిదా మాత్రమే. ఫైనల్ కాలేదు. అభ్యంతరాలు ఉంటే రైతులు చెప్పాలి. పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం. ధరణి పోర్టల్ లో రైతుల పేరిట ఉన్న భూములు తీసుకోవడం లేదు.

– కలెక్టర్ జితేష్ వి పాటిల్

- వివరాలు 2లో ▶



మాస్టర్‌ప్లాన్ ప్రజలకు అనుకూలంగా ఉండాలి..

మాస్టర్ ప్లాన్ ప్రజలకు అనుకూలంగా ఉండాలి.. వ్యతిరేకంగా ఉండొద్దు. కామారెడ్డి రైతులు, ప్రజల వినతులను, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటాం. అభ్యంతరాలుంటే ముసాయిదా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేస్తాం. భూమి పోతుందని ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు పత్రికల్లో చూశా.. ఈ ప్రభుత్వానికి రైతులను ఇబ్బంది పెట్టే ఆలోచన లేదు.

- మంత్రి కేటీఆర్

2లో

వార్డుకొక పురపాలక అధికారి

- దేశంలో ఎక్కడా లేని విధంగా ఏర్పాటుచేస్తాం
- ఇప్పటిదాకా రూ.16వేల కోట్లతో పుర ప్రగతి
- హైదరాబాద్ మినహా పట్టణాల్లో జరిగిన అభివృద్ధి ఇది
- ఇతర రాష్ట్రాలను చూస్తే మన అభివృద్ధి ఏంటో తెలుస్తుంది
- ఏటా ఫిబ్రవరి 24న పట్టణ ప్రగతి దినోత్సవం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పట్టణాల సమగ్ర అభివృద్ధికి ఎనిమిదేళ్లుగా నిబద్ధతతో కృషి చేస్తున్నట్లు పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు తెలిపారు. 2014లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు హైదరాబాద్ మినహా ఇతర పట్టణాల్లో రూ. 16వేల కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. కేటీఆర్ అన్ని పురపాలికల మున్సిపల్ కమిషనర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లతో గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. పురపాలక శాఖలోని

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రం నుంచి మరో కేంద్రమంత్రి?

రేసులో సంజయ్, అర్వింద్, బాపూరావు, లక్ష్మణ్

తదుపరి విస్తరణలో చోటు దక్కుతుందనే ప్రచారం

- సంజయ్‌కు మంత్రి పదవి ఇస్తే.. రాష్ట్ర అధ్యక్షుడిగా మరో ముఖ్యనేతకు పగ్గాలు
- జాతీయ, రాష్ట్రస్థాయిలో సంస్థాగతంగా మార్పులు జరుగుతాయని పార్టీలో ప్రచారం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీ నేతలకు జాతీయస్థాయిలో మరో కీలక పదవి లభించనుందా ? ఈ ప్రశ్నకు ఢిల్లీ పార్టీ వర్గాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. 2024 ఏప్రిల్‌లో లోక్‌సభ ఎన్నికలతో పాటు, ఈ ఏడాది 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశాలున్నట్టు చెబుతున్నారు. ప్రస్తుతం జాతీయస్థాయిలో రాజకీయ మార్పులు చేర్పులు వేగంగా చోటుచేసుకుంటున్నాయి. ఈ కీలక పరిణామాల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో సంస్థాగతంగా కూడా కీలక మార్పులు జరిగే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ నెల 16, 17 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న పార్టీ జాతీయకార్యవర్గ భేటీలో పలు అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయని అంటున్నారు. కేంద్రమంత్రివర్గ విస్తరణతో పాటు ఈ ఏడాది ఎన్నికలు జరగాల్సిన కొన్ని రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షుల మార్పు కూడా జరగొచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కీలకంగా మారిన తెలంగాణ...

ప్రస్తుతమున్న పరిస్థితుల్లో కర్ణాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికలకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. తెలంగాణలో అధికారంలోకి రావడంతోపాటు మధ్యప్రదేశ్, కర్ణాటకలలో అధికారాన్ని నిలబెట్టుకోవడం, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్‌ను ఓడించడం అనేది బీజేపీకి కీలకంగా మారింది. గతంలో బీజేపీ ఎప్పుడూ గెలవని, రెండోస్థానంలో నిలిచిన, మిత్రపక్షాలకు కేటాయించిన 160 ఎంపీ సీట్లను జాతీయనాయకత్వం గుర్తించింది. 2024 ఎన్నికల్లో వీటిలో గణనీయమైన సంఖ్యలో సీట్లు గెలవాలనే లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళికను ఇప్పటికే బీజేపీ అమలు చేయడం మొదలుపెట్టింది. వచ్చే లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో... ఇప్పటికే కేంద్రమంత్రిగా ఉన్న


మిగతా 8వ పేజీలో ▶



పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన కఠిన నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేస్తూ కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశం ఉద్రిక్తతకు దారితీసింది. అభ్యర్థులు రెండు వర్గాలుగా చీలిపోయారు. సర్ది చెప్పినా వినకపోవడంతో పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. - 7లో

న్యూస్‌రీల్

సీబీఐకి వద్దు.. లేదు అప్పగించాల్సిందే



'ఎమ్మెల్యేలకు ఎర' కేసులో హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. సీబీఐకి కేసును అప్పగించాల్సిన అవసరం లేదని ప్రభుత్వ న్యాయవాది.. లేదు అప్పగించాల్సిందేనని నిందితుల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు.

- వివరాలు 2లో ▶

రాష్ట్రానికి 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డుల పంట



స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ (ఎస్ఎస్‌జీ) ఫోర్ స్టార్ రేటింగుల్లో.. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలు మొదటి మూడు అవార్డులు సాధించాయి. 3 స్టార్, 2 స్టార్ రేటింగ్స్‌లోనూ తెలంగాణ పల్లెలు సత్తాచాటాయి.

- వివరాలు 7లో ▶

వచ్చే వారం ఎంసెట్ షెడ్యూల్



తెలంగాణ ఎంసెట్ షెడ్యూల్ వచ్చే వారం వెలువడనుంది. మే మొదటి వారంలో పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. ఫలితాలను జూన్ మొదటి వారంలో ప్రకటించి, సెప్టెంబర్ కల్లా సీట్ల భర్తీ చేపట్టాలని భావిస్తున్నారు.

- వివరాలు 7లో ▶

2,99,74,919 మంది ఓటర్లు



రాష్ట్రంలో సాధారణ ఓటర్లు 2,99,74,919 మంది ఉన్నారు. అందులో 1,50,74,919 పురుషులు, 1,49,24,718 మంది మహిళలు, 1,951 థర్డ్ జెండర్లు. కొత్తగా ఓటర్ల జాబితాలో చోటు పొందిన యువ ఓటర్లు 2,78,650 మంది ఉన్నారు.

- వివరాలు 8లో ▶



రైతులతో చర్చించండి

- కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌పై రేవంత్‌రెడ్డి
- సీఎం కేసీఆర్‌కు లేఖ

2లో



ప్రభుత్వ మూర్ఖత్వానికి రైతు బలయ్యాడు

రైతులతో చర్చించి మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు చేయాలి: బండి

విదేశీ వర్సిటీలకు మరింత స్వేచ్ఛ

భారత్‌లో క్యాంపస్‌ల ఏర్పాటుకు తొలిసారిగా అనుమతి

- విదేశీ విశ్వవిద్యాలయాలకు భారత ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది. తొలిసారిగా అవి భారత్‌లో సొంతంగా క్యాంపస్‌లు నెలకొల్పేందుకు, అడ్మిషన్ల విధానం, ఫీజుల విషయంలో సొంత నిర్ణయాలు తీసుకునేందుకు వెసులుబాటు కల్పించనుంది. అయితే సదరు వర్సిటీల్లో ఆన్‌లైన్, దూర విద్య కోర్సులకు అనుమతి ఇవ్వబోమని యూజీసీ చైర్‌పర్సన్ ఎం.జగదీశ్ కుమార్ చెప్పారు.

- వివరాలు 6లో ▶

హెచ్1బీ వీసా ఫీజుల బాదుడు

- కొత్త ప్రతిపాదనలు ముందుకు తెచ్చిన అమెరికా
- వీసా ఎదురుచూపులు తగ్గించేందుకు కృషి: నెడ్‌ప్రైస్

- 6లో ▶

ఇదంజగత్



అమ్మానాన్నకు చెప్పొద్దు ప్లీజ్!

- ఆరేళ్ల కేన్సర్ బాధిత బాలుడి అభ్యర్థన
- బాలుడి పరిణతికి విస్తుపోయిన వైద్యుడు
- చివరి రోజులు సంతోషంగా గడిపేలా చూడండంటూ సూచన
- ఇటీవలే మృతి చెందిన బాలుడు
- ట్విట్టర్‌లో జ్ఞాపకాలు పంచుకున్న డాక్టర్ సుధీర్



సాక్షి, హైదరాబాద్: కొన్ని వ్యాధులతో మరణం తప్పదని తెలిసినా ఆ విషయం బాధితులకు తెలియకూడదని కుటుంబీకులు, ఒక్కోసారి తమవారికి తెలియకూడదని బాధితులూ అనుకోవడం సహజమే. అయితే తాను చనిపోతానని తన తల్లిదండ్రులకు తెలీకూడదని ఓ ఆరేళ్ల చిన్నారి అనుకోవడమే ఆశ్చర్యం. మనసును మెలిపెట్టేస్తున్న ఉదంతం. నగరానికి చెందిన న్యూరాలజిస్ట్ డాక్టర్ సుధీర్ చిన్నారి పేషెంట్‌తో తన జ్ఞాపకాలను సోషల్ మీడియాలో పంచుకుని నెటిజనుల మనసుల్ని ద్రవింపజేశారు. సాక్షితో తన అనుభవాలనుపంచుకున్నారు.

ఏకాంతంగా మాట్లాడాలన్నాడు..

'మను (పేరు మార్చాం)కి ఫిట్స్ వస్తున్నాయని ఓ ఆంకాలజిస్ట్ నా దగ్గరకు రిఫర్ చేశారు. అతని మెడికల్ రికార్డులు చూశాక మను మెదడుకు ఎడమ వైపు గ్లియోబ్లాస్టోమా మల్టీఫార్మ్ గ్రేడ్ 4 కేన్సర్‌తో బాధపడుతున్నాడని, దాని కారణంగా చిన్నారి కుడి చేయి, కాలు పక్షవాతానికి గురయ్యాయని తెలిసింది. ఏడెనిమిది నెలల క్రితం నా క్లినిక్‌లో మను తల్లిదండ్రులైన యువ జంటను కలిశాను. తమ బిడ్డ మనుకి క్యాన్సర్ ఉందని అయితే ఆ విషయం తనకి ఎట్టి పరిస్థితుల్లోనూ

మిగతా 7వ పేజీలో ▶

ఐప్యాడ్‌లో చదివి...

'ఐప్యాడ్‌లో గూగుల్ సెర్చ్ చేసి నా వ్యాధి గురించి చదివా. నేను 6 నెలలే జీవిస్తానని తెలుసు, కానీ తట్టుకోలేరని నా తల్లిదండ్రులతో ఈ విషయం చెప్పలేదు. వారికి నేనంటే చాలా ఇష్టం దయచేసి వారితో చెప్పకండి..' అన్న ఆ ఆరేళ్ల బాలుడి మాటలు విని కొన్ని క్షణాలు మాట్లాడలేకపోయా. తర్వాత సరే అని అన్నా. అయితే ఆ విషయం అప్పటికే తల్లిదండ్రులకు తెలుసు కాబట్టి.. వారికి మా మధ్య జరిగిన సంభాషణ సారాంశాన్ని వివరించా. వారు కూడా కొద్దిసేపు నిర్ఘాంతపోయారు. తర్వాత బాలుడి ఇష్టాఇష్టాలను తెలుసుకుని తీర్చడం ముఖ్యమని వారికి హితవు చెప్పా. ఆ తర్వాత కొన్ని నెలల దాకా ఆ జంట నన్ను కలవలేదు.

క్లుప్తంగా...

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో నేడు కేటీఆర్ పర్యటన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఐటీ, పురపాలక శాఖల మంత్రి కె.తారక రామారావు గురువారం విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటించనున్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10:50 గంటలకు హుజూర్‌నగర్‌కు చేరుకుంటారు. మార్కెట్ వద్ద ఈఎస్‌ఐ ఆసుపత్రిని ప్రారంభించి, రామస్వామి గట్టు కాలనీలో డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలిస్తారు. హుజూర్‌నగర్, నేరేడుచర్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. హుజూర్‌నగర్ రింగ్‌రోడ్డు నిర్మాణ పనులకు, ఆ తరువాత నేరేడుచర్ల బస్తీ దవాఖానా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం బహిరంగసభలో పాల్గొంటారు. 2 గంటలకు హుజూర్‌నగర్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 2:30 గంటలకు నల్లగొండ జిల్లాలోని చండూరు పట్టణానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించి 3 గంటలకు గట్టుప్పల్ మండల కేంద్రానికి చేరుకుంటారు. అక్కడ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రారంభిస్తారు. గట్టుప్పల్‌లో రూ.2 కోట్లతో నిర్మించనున్న సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. చండూరులో సీసీ రోడ్లతోపాటు డ్రైనేజీ పనులకు, వెజ్–నాన్‌వెజ్ మార్కెట్, మున్సిపల్ బిల్డింగ్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

జాతీయ పార్కులకు కొత్త లోగోలు

Mahavir Harina Vanasthali National Park | Mrugavani National Park Telangana State

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మహావీర్ హరిణ వనస్థలి జాతీయ ఉద్యానవనం,, మృగవాని నేషనల్ పార్కులకు కొత్త లోగోలను అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ లోగోల్లో ఆయా జాతీయపార్కుల్లో అంతర్భాగంగా ఉన్న అంశాలను ప్రస్తావించడం సహా, పర్యావరణ పరిరక్షణ, పార్కుల సంరక్షణ ఆవశ్యకతను సందేశం రూపంలో పొందుపరిచారు. గురువారం అరణ్య భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ లోగోలను మంత్రి విడుదల చేశారు. కార్యక్రమంలో పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియల్, హైదరాబాద్ చీఫ్ కన్జర్వేటర్ సైదులు, రంగారెడ్డి జిల్లా డీఎఫ్‌వో జాదవ్ రాహుల్ కిషన్ పాల్గొన్నారు.

గోవాకు విమాన సర్వీసులు ప్రారంభం

శంషాబాద్: గోవాలోని మనోహర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి.. శంషాబాద్ విమానాశ్రయం నుంచి గురువారం రెండు కొత్త విమాన సర్వీసులను ప్రారంభించారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ 6ఈ–6145 విమాన సర్వీసు 179 మంది ప్రయాణికులతో ఉదయం 7.40 గంటలకు ఇక్కడి నుంచి బయల్దేరింది. గోఫస్ట్ ఎయిర్‌లైన్స్ కూడా డైలీ విమాన సర్వీసును ప్రారంభించింది. ఉత్తర గోవా పెర్నెం తాలూకాలోని మోపాలో 2,132 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని గత డిసెంబరు నెలలో భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించడం తెలిసిందే. హైదరాబాద్, గోవా మధ్య పర్యాటకానికి ఈ సర్వీసులు దోహదం చేస్తాయని ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్‌ఫణీకర్ పేర్కొన్నారు. త్వరలో ఆకాశ్ ఎయిర్‌లైన్స్ కూడా మరో విమాన సర్వీసును గోవాకు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

యూఎస్ కాన్సులేట్ వీసా అప్లికేషన్ సెంటర్ చిరునామా మార్పు

సాక్షి, హైదరాబాద్: వీసా దరఖాస్తుల కేంద్రం చిరునామాను ఈనెల 8వ తేదీ నుంచి మారుస్తున్నట్లు హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ తెలిపింది. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా కొత్త చిరునామా వివరాలను వెల్లడించింది. మాదాపూర్‌లోని హైటెక్ సిటీ మెట్రోస్టేషన్ దిగువ కాంకోర్స్‌లో వీసా దరఖాస్తుల కేంద్రం కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపింది. 8వ తేదీ నుంచి గల షెడ్యూల్ అపాయింట్‌మెంట్లు, డాక్యుమెంట్ల సమర్పణ, పాస్‌పోర్టు సేకరణ కోసం వచ్చే అభ్యర్థులు కొత్త చిరునామాకు రావాలని కాన్సులేట్ సూచించింది.

కొత్తగా 8 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గురువారం 5,093 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో ఎనిమిది మంది వైరస్ బారినపడ్డారు. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి ఆరుగురు కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 62 మంది ఐసోలేషన్ లేదా చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. కాగా, రాష్ట్రంలో గురువారం 4245 మందికి కరోనా వ్యాక్సిన్లు వేశారు. వారిలో బూస్టర్ డోసు 3,504 మందికి వేయగా, రెండో డోసు 459 మంది, మొదటి డోసు 282 మందికి వేసినట్లు ఆయన తెలిపారు.



గురువారం కామారెడ్డిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న రైతుల కుటుంబ సభ్యులు



రైతులను బారికేడ్లతో అడ్డుకుంటున్న పోలీసులు

భూమిని మింగే ప్లానొద్దు

కామారెడ్డిలో కుటుంబాలతో కలిసి రైతుల ర్యాలీ

- ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌పై తీవ్ర నిరసన
- రద్దు చేయాలని డిమాండ్.. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. తీవ్ర ఉద్రిక్తత
- కలెక్టర్ దిష్టిబొమ్మకు రైతుల వినతిపత్రం.. నేడు కామారెడ్డి బంద్‌కు పిలుపు
- నెలరోజులుగా కొనసాగుతున్న రైతన్నల ఆందోళనలు



రైతులతో తోపులాటలో కిందపడిపోయిన కానిస్టేబుల్



గాయపడ్డ రామేశ్వరపల్లి రైతు సంతోష్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ మాస్టర్‌ప్లాన్ ముసాయిదా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ముసాయిదాకు వ్యతిరేకంగా నెల రోజులుగా ఆందోళన చేస్తున్న రైతులు గురువారం తమ కుటుంబ సభ్యులతో కలిసి 'రైతు కుటుంబ సమేత ర్యాలీ'చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించారు. రైతులు భారీగా తరలివస్తుండటంతో పోలీసులు పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు. అయితే పోలీసులను దాటుకుని రైతులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకువెళ్లేందుకు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తోపులాటలో ఐదుగురు రైతులు గాయపడటంతో వారిని ఆస్పత్రికి తరలించారు. కాగా ఏఎస్పీ అనోన్య, డీఎస్పీ సోమనాథం తమతో దురుసుగా మాట్లాడారంటూ రైతులు మండిపడ్డారు. కొందరు రైతులు, మహిళా రైతులు.. పోలీసులపైకి చెప్పులు విసిరారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు ధర్నా కార్యక్రమం కొనసాగింది. కలెక్టర్ జితేష్ వి పాటిల్ బయటకు వచ్చి తమ గోడు వినాలని, వెంటనే మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కలెక్టర్ బయటకు రాకపోవడంతో ఆయన తీరుపై మండిపడ్డారు. కలెక్టర్ వచ్చేదాకా అక్కడి నుంచి కదిలేది లేదని రోడ్డుపై బైఠాయించారు. అక్కడే వంటావార్పు నిర్వహించి భోజనాలు చేశారు. దీంతో కలెక్టరేట్‌లోకి రాకపోకలు నిలిచిపోయాయి. చీకటి పడుతుండగా టెంట్‌లు, కార్పెట్‌లు వేసుకుని.. ఎంత రాత్రైనా కలెక్టర్ వచ్చే వరకు కదలబోమంటూ బైఠాయించారు. రైతులకు బీజేపీ నేతలు వెంకటరమణారెడ్డి, రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు సుభాష్‌రెడ్డి, జమునా రాథోడ్, టీజేఎస్ నేత నిజ్జన రమేష్ తదితరులు మద్దతు పలికి ధర్నాలో పాల్గొన్నారు. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి రైతులకు సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. ఐదుగురు లేదా పది మంది రైతులు కలెక్టర్ వద్దకు వెళ్లి వినతిపత్రం ఇవ్వాలని చెప్పారు. అయినా రైతులు వినలేదు. కలెక్టర్ వచ్చి స్వయంగా తమకు హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. రాత్రి 8 గంటల తర్వాత కూడా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బయటకు రాకపోవడంతో ఆయన దిష్టిబొమ్మకు వినతిపత్రం సమర్పించారు. మహిళలు కలెక్టర్ దిష్టిబొమ్మపై ఏడు దోసిళ్ల మట్టిని విసిరారు. అనంతరం రైతులు ఆందోళన విరమించారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంతో పాటు నియోజకవర్గం బంద్‌కు రైతు ఐక్యకార్యాచరణ కమిటీ పిలుపునిచ్చింది.

సర్పంచ్ భర్తపై దాడి

రైతులు ర్యాలీ నిర్వహిస్తుండగా ఇందిరాచౌక్ వద్ద అడ్లూర్ ఎల్లారెడ్డి సర్పంచ్ జానకి భర్త పైడి జనార్దన్ వారికి కన్పించారు. దీంతో కొందరు మహిళా రైతులు ఆయనపై దాడి చేశారు. ప్లకార్డులు, కర్రలతో చితకబాదారు. నెల రోజులుగా రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పించుకుని పరుగులు పెట్టిన జనార్దన్ పక్కనే ఉన్న ఓ దుకాణంలోకి వెళ్లి దాక్కున్నారు. పోలీసులు ఆందోళనకారులను అడ్డుకుని శాంతింపజేశారు.

కేటీఆర్ స్పందించాలి
ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు రైతులకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఇండస్ట్రియల్ జోన్‌లోకి మారుతున్న 2,500 ఎకరాల రైతుల భూములను వదిలేయాలని డిమాండ్ చేశారు. పుష్కలంగా పంటలు పండే భూములను ఇండస్ట్రియల్ జోన్‌గా మార్చుతారా? అని ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ స్పందించి రైతులకు న్యాయం చేయాలన్నారు. వేలాది మంది రైతులు కలెక్టరేట్‌కు వస్తే వినతిపత్రం స్వీకరించకపోగా, రైతు ఉద్యమాన్ని హేళన చేసిన కలెక్టర్‌కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కాగా రైతుల ఉద్యమానికి సంఘీభావం తెలపడానికి కామారెడ్డికి వస్తున్న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను పోలీసులు 44 నంబర్ జాతీయ రహదారిపై పట్టణ శివారులో అడ్డుకున్నారు.

గుంట భూమి పోయినా పోటీ చేయను: ఎమ్మెల్యే సురేందర్

మాస్టర్‌ప్లాన్‌లో రైతులకు సంబంధించి గుంట భూమి పోయినా తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం రైతులకు మేలు చేసే ప్రభుత్వమని ఆయన అన్నారు. మాస్టర్‌ప్లాన్‌లో ఎవరి భూమీ పోకుండా మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తానని చెప్పారు. కొందరు నాయకులు అనవసరంగా రైతులను రెచ్చగొట్టి రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు.

వార్డుకొక పురపాలక అధికారి

▶ మొదటి పేజీ తరువాయి

ఉద్యోగాల భర్తీ ప్రక్రియ సైతం త్వరలోనే పూర్తి అవుతుందని చెప్పారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వార్డుకొక పురపాలక అధికారిని రాష్ట్రంలో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. పట్టణాల అభివృద్ధి కోసం చిన్న రాష్ట్రంగా ఉన్న తెలంగాణ ఇంత భారీగా నిధులను కేటాయించడం గొప్ప విషయమని, దేశంలో మరే రాష్ట్రం తెలంగాణ తరహాలో నిధులు కేటాయించలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని రాజకీయ విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలు, కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. కేంద్రం నిర్వహించే సర్వేల్లో ఉత్తమ గ్రామపంచాయతీలు, పట్టణాలు, జిల్లాలన్నీ తెలంగాణలోనే ఉంటున్నాయని చెప్పారు. తెలంగాణలో ఎంత అభివృద్ధి జరిగిందో తెలుసుకోవాలంటే ఇతర రాష్ట్రాలను పరిశీలించి రావాలని సూచించారు. అప్పుడే తెలంగాణలో జరిగిన మౌలిక వసతుల కల్పన స్పష్టంగా అర్థమవుతుందని కేటీఆర్ పేర్కొన్నారు.

సంస్కరణలతో కూడిన అభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వం వినూత్నమైన ఆలోచనలతో ముందుకు పోవడం వల్లనే అద్భుత ఫలితాలు సాధించినట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. పట్టణాలకు అవసరమైన నిధులు ఇవ్వడంతోపాటు విప్లవాత్మకమైన సంస్కరణలను తెచ్చినట్లు చెప్పారు. మున్సిపల్ చట్టం, టీఎస్–బీపాస్ వంటి చట్టాలన్నీ అందులో భాగమేనన్నారు. టీఎస్–బీపాస్ అమలు తీరు, ప్రజల నుంచి వస్తున్న ఫీడ్‌బ్యాక్‌పై అదనపు కలెక్టర్లు సమీక్ష నిర్వహించాలని సూచించారు. ప్రతి పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, మిషన్ భగీరథ, వైకుంఠధామాలు, అధునాతన ధోబీ ఘాట్లు, డంపు యార్డుల బయోమైనింగ్, మానవ వ్యర్థాల శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు, మాస్టర్ ప్లాన్ల తయారీ, డిజిటల్ డోర్ నంబర్ కేటాయింపు వంటి అంశాలను అధికారులు రోజువారీ అజెండాలో పొందుపరుచుకోవాలని ఆదేశించారు. ఏటా ఫిబ్రవరి 24న పట్టణ ప్రగతి దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉత్తమ పనితీరు కనబర్చిన అధికారులకు ఆరోజు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

మాస్టర్‌ప్లాన్ ప్రజలకు అనుకూలంగా ఉండాలి

అధికారులకు కేటీఆర్ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌పై ముసాయిదా మాత్రమే ఇచ్చారని, ప్రజల కోణంలోనే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని మునిసిపల్ శాఖ మంత్రి కె. తారక రామారావు స్పష్టం చేశారు. 'మాస్టర్ ప్లాన్ ప్రజలకు అనుకూలంగా ఉండాలి.. వ్యతిరేకంగా ఉండొద్దు' అని కేటీఆర్ అధికారులకు స్పష్టంచేశారు. కామారెడ్డి రైతులు, ప్రజల వినతులను, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించి చెప్పాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో పట్టణ ప్రగతి సదస్సుకు హాజరైన ఆయన కామారెడ్డిలో నెలకొన్న పరిస్థితుల గురించి ఆ జిల్లా అదనపు కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి అభ్యంతరాలు ఉంటే ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు చేయడం జరుగుతుందని కేటీఆర్ చెప్పారు. 500 ఎకరాలు ఇండస్ట్రియల్ జోన్‌కు పోతున్నాయని, రైతులు ఆందోళన చెందుతున్నారని, భూమి పోతుందని ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు పత్రికల్లో చూశానని తెలిపారు. ఈ ప్రభుత్వానికి రైతులను ఇబ్బంది పెట్టే ఆలోచన లేదని స్పష్టంచేశారు. నిర్మాణాత్మక నగరాలు, పట్టణాల అభివృద్ధి కోసమే మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు చెప్పారు.

13న పోలవరం బ్యాక్‌వాటర్‌పై సమావేశం

- నివేదికలతో రావాలని ప్రభావిత రాష్ట్రాలకు కేంద్ర జలశక్తి శాఖ సూచన
- ముంపు రక్షణ, పరిహారం, పునరావాసం కోరుతున్న తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: పోలవరం బ్యాక్ వాటర్ ముంపు ప్రభావంపై ఈ నెల 13న కేంద్ర జలశక్తి శాఖ ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో సమావేశం నిర్వహించనుంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై గతేడాది సెప్టెంబర్ 29న కేంద్ర జలశక్తి శాఖ చీఫ్ సెక్రటరీల స్థాయిలో సమావేశం నిర్వహించింది. ఆ తర్వాత సాంకేతికపరమైన అంశాలపై ముంపు ప్రభావిత రాష్ట్రాలతో చర్చలు, సంప్రదింపుల కోసం కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇప్పటికే సంబంధిత రాష్ట్రాలతో సమావేశం నిర్వహించి కేంద్ర జలశక్తి శాఖకు నివేదికను సమర్పించింది. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై తెలంగాణ సైతం కేంద్రానికి లేఖ రాయగా, సీడబ్ల్యూసీ నుంచి బదులు వచ్చింది. సీడబ్ల్యూసీ సమాధానాలపై ఏమైనా అభ్యంతరాలుంటే 13న నిర్వహించే సమావేశంలో నివేదికతో హాజరు కావాలని ఆయా రాష్ట్రాలను కేంద్ర జలశక్తి శాఖ కోరింది. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపిన అనంతరం పోలవరం బ్యాక్‌వాటర్ ముంపు నివారణకు తీసుకోవాల్సిన చర్యల విషయంలో జలశక్తి శాఖ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

35 ఉపనదులు గోదావరిలో కలవకుండా అడ్డుగా..

పోలవరం ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 150 అడుగుల మేరకు నీళ్లను నిల్వ చేస్తే తెలంగాణలో 891 ఎకరాలు ముంపునకు గురి అవుతాయని, బాధిత రైతులకు పునరావాసం, పరిహారం కల్పించాలని తెలంగాణ కోరుతోంది. పినపాక, భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, మణుగూరు, అశ్వాపురం మండలాల్లోని 35 ఉపనదులు గోదావరిలో కలవకుండా పోలవరం బ్యాక్‌వాటర్ అడ్డుగా మారిందని తెలంగాణ ఆరోపిస్తోంది.

రైతులతో చర్చించండి

- కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌పై రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ



సాక్షి, హైదరాబాద్: గ్రామసభలు పెట్టి రైతులతో చర్చించకుండా, రైతుల అభిప్రాయాలు తెలుసుకోకుండా కామారెడ్డి మున్సిపాలిటీ మాస్టర్‌ప్లాన్‌ను ఎలా అమలు చేస్తారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ ప్లాన్ ముసాయిదాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి, అడ్లూరు, ఎల్లారెడ్డి గ్రామాల ప్రజలు నెల రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకుని రైతుల ఆందోళనను విరమించుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన బహిరంగ లేఖ రాశారు.

నష్టానికి మంత్రి కేటీఆర్‌దే బాధ్యత

'కామారెడ్డి మాస్టర్ ప్లాన్ విషయంలో రైతులు చేస్తున్న ఆందోళనలకు కాంగ్రెస్ మద్దతు ప్రకటిస్తోంది. పయ్యావుల రాములు అనే రైతు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమైన విషయం. రైతుల పొలాలను పారిశ్రామికవాడల కింద గుర్తించడం వల్ల కొద్దిమొత్తంలో భూములు ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నష్టానికి మున్సిపల్, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ పూర్తిగా బాధ్యత వహించాలి. తమ ప్రాణ సమానమైన భూములను కాపాడుకునేందుకు కలెక్టర్ వద్దకు వస్తే రైతులతో మాట్లాడేందుకు కూడా నిరాకరించడం పాలకుల్లో ఉన్న నియంత ధోరణికి పరాకాష్ట. ఆత్మహత్య చేసుకున్న రాములు కుటుంబానికి కోటి రూపాయల పరిహారం అందజేసి ఆదుకోండి. కామారెడ్డి మాస్టర్ ప్లాన్ ముసాయిదాను రైతుల ముందు పెట్టి వారితో చర్చించి వారి మద్దతుతోనే అమలు చేయండి..'అని రేవంత్ డిమాండ్ చేశారు.

ప్రభుత్వ మూర్ఖత్వానికి రైతు బలయ్యాడు

రైతులతో చర్చించి మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు చేయాలి: బండి



సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి జిల్లా కేంద్రం మాస్టర్ ప్లాన్ విషయంలో ప్రభుత్వ మూర్ఖ వైఖరికి ఒక రైతు బలి కావడం బాధాకరమని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ పేర్కొన్నారు. రైతు పయ్యావుల రాములుది ప్రభుత్వ హత్యే అని ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. వెంటనే ఆ జిల్లా కలెక్టర్, రాష్ట్ర మంత్రులు రైతులతో చర్చించి మాస్టర్ ప్లాన్‌లోని ఇండస్ట్రియల్ జోన్, గ్రీన్ జోన్లలో అవసరమైన మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి పోలీసు రిక్రూట్‌మెంట్ పరీక్షా నిబంధనలను సవరించాలని మరో ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎంకు విజ్ఞప్తి చేసేందుకు వెళుతున్న బీజేవైఎం కార్యకర్తలు, పోలీసు పరీక్ష అభ్యర్థులను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించా..

తెలంగాణ సుభిక్షంగా ఉండాలని శ్రీ శారదా మాత అమ్మవారిని ప్రార్థించినట్టు బండి సంజయ్ తెలిపారు. గురువారం శృంగేరి శ్రీ శారదా పీఠంలో శ్రీ శ్రీ శ్రీ విధుశేఖర భారతీ జగద్గురువులను, శారదా మాతను తన సతీమణి అపర్ణతో కలిసి సంజయ్ దర్శించుకున్నారు. సనాతన ధర్మ పరిరక్షణలో ముందుండాలని సంజయ్‌కు జగద్గురువు సూచించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మూర్తి, రాజన్న సిరిసిల్ల జిల్లా వేద పాఠశాలకు చెందిన రాధాకృష్ణ శర్మ ఉన్నారు.

సీబీఐకి వద్దు.. లేదు అప్పగించాల్సిందే

- ఎమ్మెల్యేలకు ఎర కేసులో ప్రభుత్వ అప్పీల్‌పై సుదీర్ఘ వాదనలు
- సిట్ పారదర్శకంగా దర్యాప్తు చేస్తోందన్న దుష్యంత్ దవే
- సీబీఐకి అప్పగిస్తే సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుందని వెల్లడి
- ద్విసభ్య ధర్మాసనానికి విచారణ పరిధి లేదన్న డీవీ సీతారాం మూర్తి



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేలకు ఎర కేసులో హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. సీబీఐకి కేసును అప్పగించాల్సిన అవసరం లేదని ప్రభుత్వ న్యాయవాది.. లేదు అప్పగించాల్సిందేనని నిందితుల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేలకు ఎర కేసును సీబీఐకి అప్పగిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కొట్టివేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం అప్పీలు దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే.. నిందితులు నందుకుమార్, రామచంద్రభారతి, సింహయాజీ తరఫున సీనియర్ న్యాయవాది డీవీ సీతారాం మూర్తి వాదనలు వినిపించారు. నాలుగు గంటలకు పైగా వాదనలు సాగాయి.

సీఎం ప్రెస్‌మీట్ పెట్టిన నాటికే మీడియాలో వివరాలు..

'నిందితులు సింగిల్ జడ్జి వద్ద దాఖలు చేసిన పిటిషన్లలో ఎందులోనూ ముఖ్యమంత్రి ప్రతివాది కాదు. నవంబర్ 3వ తేదీన సీఎం ప్రెస్‌మీట్ పెట్టిన నాటికే కేసుకు సంబంధించిన వివరాలన్నీ మీడియాలో బహిర్గతమయ్యాయి. అన్ని వివరాలతో కూడిన ఎఫ్ఐఆర్‌ను పోలీసులు కిందికోర్టుకు సమర్పించారు. కొత్తగా సీఎం మీడియాకు వివరాలు వెల్లడించింది ఏమీ లేదు. బీజేపీ పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను పడగొట్టింది. ఈ క్రమంలో తన పార్టీనీ సంక్షోభంలోకి నెడుతున్నారని తెలుసుకుని, ఆ పార్టీ అధ్యక్షుడిగా ప్రజలకు వాస్తవాలను తెలియజేసే హక్కు సీఎంకు కచ్చితంగా ఉంటుంది. అయినా ఈ వివరాల సీడీలను తెలంగాణ హైకోర్టు సీజేకు, ఇతర హైకోర్టుల సీజేలకు పంపడం తప్పిదమేనని క్షమాపణ కూడా చెప్పాం. సీఎం ప్రెస్‌మీట్‌కు, సిట్ విచారణకు లింక్ పెట్టడం సరికాదు. సీబీఐ, ఈడీ లాంటి సంస్థలు దర్యాప్తు చేసినా వివరాలు మీడియాకు తెలుస్తున్నాయి. ఇందులో సిట్‌ను తప్పుబట్టాల్సిందేమీ లేదు. సిట్ బృందం పారదర్శకంగా దర్యాప్తు చేస్తోంది.

కోరుకున్న సంస్థతో విచారణ చేయించుకోజాలరు..

సుప్రీంకోర్టు కూడా సిట్ దర్యాప్తును అడ్డుకోలేదు. నిందితులను బలవంతంగా ఫామ్‌హౌస్‌కు ఎవరూ తీసుకురాలేదు. వారంతట వారే వచ్చారు. ట్రాప్‌లో పట్టుబడ్డారు. మూడు గంటలపాటు ఎమ్మెల్యేలతో సంభాషించారు. జాతీయ స్థాయి నాయకులతో దిగిన ఫొటోలను పరిశీలిస్తే వారు సామాన్యులు కాదని తెలుస్తోంది. ఆర్టికల్ 20 ప్రకారం నిందితులకు హక్కులున్నా.. కోరుకున్న దర్యాప్తు సంస్థతో విచారణ చేయించుకోజాలరు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూలిస్తే వారి ఓటుకు విలువేముంటుంది? ఎనిమిదేళ్లలో దేశవ్యాప్తంగా ఒక్క బీజేపీ నేతపై కూడా సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు జరగలేదు. అవినీతిని రూపుమాపుతామని వచ్చిన బీజేపీ.. ప్రతిపక్షాలను అంతమొందిస్తోంది. పారదర్శకంగా సిట్ చేస్తున్న దర్యాప్తును సరైన కారణం చూపకుండా సీబీఐకి బదిలీ చేస్తే వారి విధులను హరించడమే అవుతుంది. సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుంది. వీటిని పరిగణనలోకి తీసుకుని సిట్ దర్యాప్తును అడ్డుకోవద్దు.. కేసును సీబీఐకి అప్పగించవద్దు..'అంటూ దవే వాదించారు.

సుప్రీంకోర్టులో అప్పీల్ చేయాలి

'కేసు దర్యాప్తు, ప్రొసీడింగ్స్ అంతా క్రిమినల్ చట్ట ప్రకారమే సాగాయి. సింగిల్ జడ్జి కూడా ఆ మేరకే విచారణ జరిపి తీర్పు వెలువరించారు. కనుక అప్పీల్‌పై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు లేదు. కావాలంటే సుప్రీంకోర్టును ఆశ్రయించాలి. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాకే సిట్ పారదర్శకంగా దర్యాప్తు చేయలేదని భావించిన సింగిల్ జడ్జి ఆ బాధ్యతను సీబీఐకి అప్పగించాలని ఆదేశించారు. ప్రభుత్వం, ఇతరులు దాఖలు చేసిన అప్పీల్ చెల్లదు కనుక కొట్టివేయాలి. సీబీఐకి అప్పగించాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోవద్దు..'సీతారాం మూర్తి కోరారు. శుక్రవారం వాదనలు కొనసాగనున్నాయి.

క్లుప్తంగా...

ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది ఈశాన్య రాష్ట్రాల్లో జరగనున్న శాసనసభ ఎన్నికల నిర్వహణ, బందోబస్తు అంశాలపై కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా గురువారం వివిధ రాష్ట్రాల డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ నుంచి డీజీపీ అంజనీకుమార్, శాంతిభద్రతల అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్, బెటాలియన్స్ అడిషనల్ డీజీ అభిలాష బిస్త్ పాల్గొన్నారు. సున్నిత ప్రాంతాలైన మేఘాలయ, నాగాలాండ్, త్రిపురల్లో సాఫీగా ఎన్నికల నిర్వహణకు అదనపు పోలీస్ బలగాలు అవసరమని హోం శాఖ కార్యదర్శి భల్లా తెలిపారు. ఈ మేరకు ఏ రాష్ట్రం నుంచి ఎంత మేర బలగాలను ఎన్నికల విధులకు వినియోగించుకునే అవకాశాలున్నాయన్న అంశంపై చర్చించారు.

పోలీసు అధికారుల పనితీరుపై డీజీపీ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: పోలీస్ అధికారులకు నిర్దేశించిన ఫంక్షనల్ వర్టికల్స్ పనితీరును సాంకేతికంగా విశ్లేషించి, గణాంకాలుగా మార్చి, గ్రేడింగ్ ఇచ్చి ప్రోత్సహించేందుకు డీజీపీ అంజనీకుమార్ గురువారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు వ్యవస్థ పనితీరు మరింత సమర్థంగా సాగేందుకు ఉద్దేశించిన ఈ అంశంపై వివిధ స్థాయిల అధికారులతో చర్చించారు. తెలంగాణా పోలీస్ శాఖలో అమల్లో ఉన్న సంస్థాగత నిర్మాణం, ఫంక్షనల్ వర్టికల్స్ అంశాలపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విభాగం అధికారులతో సమీక్షించారు. పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించే వివిధ స్థాయిల అధికారులు తమకు ప్రత్యేకంగా కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించే అంశంలో డీజీపీ కార్యాలయంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సమీక్షించాలని అంజనీ కుమార్ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ ప్రధాన ధ్యేయంగా ప్రతి ఒక్క పోలీస్ అధికారి పని చేసేలా.. పోలీస్ శాఖపై ప్రతి ఒక్కరిలో నమ్మకం కుదిరేలా.. మరింత అంకిత భావంతో పనిచేసేలా విశ్లేషించాలని డీజీపీ ఆదేశించారు.

డ్రగ్స్ కేసులో మోహిత్‌కు కస్టడీ

చంచల్‌గూడ: గోవా డ్రగ్స్ కేసులో 4 రోజులుగా చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మోహిత్ అగర్వాల్‌కు కోర్టు ఒకరోజు పోలీసు కస్టడీ విధించింది. ఈ కేసుకు సంబంధించి హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఇటీవల ఇద్దరు నిందితులను అరెస్టు చేయడం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం రాంగోపాల్‌పేట పోలీసులు మోహిత్‌ను జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్నారు.

త్వరలో ఆర్టీసీ 'జీవా'జలం!

- తొలుత బస్టాండ్లలో, ఆ తర్వాత సాధారణ దుకాణాల్లో అందుబాటులో
- వారం పదిరోజుల్లో విడుదల
- ఏడాదికి రూ.25 కోట్ల ఆదాయం పొందే ప్లాన్



సాక్షి, హైదరాబాద్: సొంతంగా మంచి నీటిని తయారు చేసి బస్టాండ్లలో విక్రయించడంతోపాటు మార్కెట్‌లోకి కూడా విడుదల చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఆకట్టుకునే రీతిలో మంచినీటి సీసా డిజైన్‌ను రూపొందించింది. దీనికి ప్రకాశం, కాంతి అన్న అర్థంలో వినియోగించే జీవా (జెడ్ఐవీఏ) అన్న పేరును ఖరారు చేసింది. దీనికి జీవం అన్న మరో అర్థం కూడా ఉండటం విశేషం. 'స్ప్రింగ్ ఆఫ్ లైఫ్'అన్న ట్యాగ్‌ను దీనికి జతచేసింది. మరో వారం పది రోజుల్లో ఈ బ్రాండ్ మంచినీటిని ఆర్టీసీ విడుదల చేస్తోంది. తొలుత అన్ని ఆర్టీసీ బస్టాండ్లలో వీటిని అందుబాటులో ఉంచుతారు. ఆ తర్వాత క్రమంగా విస్తరించాలని నిర్ణయించింది.

నకిలీలను నియంత్రించి..

ఆర్టీసీ బస్టాండ్లలో ఉండే దుకాణాల్లో మంచినీటి సీసాల విక్రయం విరివిగా సాగుతుంది. అదే వేసవిలో అయితే వాటి వినియోగం చాలా ఎక్కువ. దీంతో దుకాణదారులు రూ.20కి విక్రయించాల్సిన లీటరు నీటి సీసాను రూ.25–30కి అమ్ముతుంటారు. బ్రాండెడ్ పేర్లను పోలిన 'నకిలీ'కంపెనీ నీళ్లు విక్రయిస్తుంటారు. ఇటీవలే వీటిని నియంత్రించిన ఆర్టీసీ ఇప్పుడు బ్రాండెడ్, ఐఎస్ఐ అధీకృత లోకల్ కంపెనీ నీళ్లు మాత్రమే అందుబాటులో ఉండేలా చేయగలిగింది. ఈ తరుణంలోనే తనే సొంతంగా నీటి విక్రయాలను ప్రారంభించాలన్న ఆలోచనను సాకారం చేసుకుంటోంది.

పేటెంట్ కోసం దరఖాస్తు

ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ప్రయాణికులకు ఉచితంగా అరలీటరు నీటి సీసాలను అందిస్తోంది. ఇందుకోసం ఓ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇక కార్యాలయాలు, ఇతర అవసరాలకు కూడా భారీగా ప్యాకేజ్డ్ నీటిని కొంటోంది. ఇందుకు సాలీనా రూ.5.15 కోట్ల ఖర్చును చూపుతోంది. ఇంత భారీ ఖర్చును తనే పెట్టుబడిగా మార్చుకుంటే సొంతంగా నీటిని మార్కెట్‌లోకి తేవచ్చన్న యోచనతో రెండు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ కంపెనీలు ఆకర్షణీయ సీసాల్లో నాణ్యమైన నీటిని నింపి ఆర్టీసీకి అందజేస్తాయి. వాటిని ఆర్టీసీ మార్కెటింగ్ చేసుకుంటుంది. ఇలా ఇతర కంపెనీల ధరలతో సమంగా లీటరు నీటికి రూ.20 ధరను ఖరారు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు ఉచితంగా అందించేందుకు అర లీటరు సీసాలను అందుబాటులో ఉంచుతారు. బస్టాండ్లలోని దుకాణాల్లో మాత్రం లీటరు పరిమాణంలోని నీటి సీసాలను ఉంచుతారు. కాగా జీవా పేరుతో తెస్తున్న ఈ బాటిళ్లకు 'స్ప్రింగ్ ఆఫ్ లైఫ్'అన్న ట్యాగ్‌లను పెట్టింది. పేరుకు, బాటిల్ డిజైన్‌కు ఆర్టీసీ పేటెంట్ కోసం దరఖాస్తు చేసినట్టు తెలిసింది. ఆర్టీసీ బస్టాండ్లతోపాటు మార్కెట్‌లోనూ ఈ సీసాలను అందుబాటులోకి తేవాలని సంస్థ నిర్ణయించింది. ఇప్పుడు ఒప్పందం మేరకు వేరే కంపెనీ నీటిని కొనేందుకు చేస్తున్న రూ.5 కోట్ల ఖర్చును లేకుండా చేసుకోవటంతోపాటు సాలీనా కనీసం రూ.20 నుంచి రూ.25 కోట్ల వరకు ఆదాయం పొందాలని భావిస్తోంది.

వెలుగుల్లో ఎస్టీపీపీ మరో రికార్డు

- తాజాగా పీఎల్ఎఫ్‌లో దేశంలోనే మొదటి స్థానం
- 250 థర్మల్ విద్యుత్ ప్లాంట్లను వెనక్కి నెట్టి ముందు వరుసలోకి
- సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ హర్షం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు (ఎస్టీపీపీ) మరో రికార్డు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఎంపిక చేసిన అత్యుత్తమ 250 థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో 7,219 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి, 91.15 శాతం పీఎల్ఎఫ్ (ప్లాంటు లోడ్ ఫ్యాక్టర్)తో దేశంలోనే మొదటి స్థానంలో ఈ ప్లాంట్ నిలిచింది. అంతేకాక ఈ ఏడాదిలోనే వరుసగా రెండుసార్లు ఈ స్థానాన్ని అందుకుంది. 250కి పైగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఎన్టీపీసీ, అదానీ, టాటా, రిలయన్స్, జిందాల్ తదితర పేరు మోసిన సంస్థలను వెనక్కి నెట్టి మరీ జైపూర్ ప్లాంట్ ముందు వరుసలో నిలిచింది. జైపూర్ ప్లాంట్ రికార్డులపై సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.శ్రీధర్ గురువారం హర్షం వ్యక్తం చేశారు.

ఆరేళ్లలో అద్భుత ప్రగతి

సింగరేణి సంస్థ బొగ్గు వెలికి తీయడం, రవాణా, అమ్మకాలకే పరిమితి కాకుండా సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి విక్రయించాలని జైపూర్‌లో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పింది. 2016 ఆగస్టులో ఈ ప్లాంట్ ప్రారంభం కాగా, గత ఆరేళ్లలో అత్యుత్తమ ప్రతిభతో దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తూ వస్తోంది. రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీరుస్తూ ఇతర ప్రాంతాలకు కూడా సరఫరా చేస్తోంది. ఇప్పటివరకు 52,328 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించింది. రాష్ట్రం వినియోగిస్తున్న విద్యుత్‌లో 12 శాతం ఇక్కడి నుంచే అందుతోంది. సింగరేణికి ఏటా సగటున రూ.400 కోట్ల లాభాలు తెచ్చిపెడుతోంది. ఈ ప్లాంట్‌లో రెండు యూనిట్లు సమర్థంగా పని చేస్తున్నాయి. రెండో యూనిట్ ఇప్పటికి 10 సార్లు, మొదటి యూనిట్ ఎనిమిది సార్లు పీఎల్ఎఫ్ దాటింది. మొత్తంగా ఈ ప్లాంట్ నాలుగుసార్లు వంద శాతంపైబడి పీఎల్ఎఫ్ రికార్డు చేసింది. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ మేరకు రూ.6,800 కోట్లతో మరో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ ఇక్కడే ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. బొగ్గు మండించగా వెలువడిన బూడిద నిర్వహణ, నీటి వినియోగం, ఎనర్జీ ఎఫీషియెన్సీలోనూ అద్భుత ప్రతిభ చూపుతూ ఈ ప్లాంట్ పలు జాతీయ అవార్డులు అందుకుంది.

పాలు ఎందుకు ఇవ్వడం లేదు?

- సాక్షి కథనంపై స్పందించిన మంత్రి సత్యవతి రాథోడ్
- యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమాధికారులకు ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరా నిలిచిపోయిన నేపథ్యంలో 'మూడు నెలలుగా పాలు లేవ్' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనంపై రాష్ట్ర గిరిజన, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ స్పందించారు. గురువారం ఉదయం ఆ శాఖ ఉన్నతాధికారులతో ఆమె ప్రత్యేకంగా సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మూడు నెలలుగా పాల సరఫరా నిలిచినందుకు గల కారణాలపై ఆరా తీశారు. పాల పంపిణీ నిలిచిపోవడంతో పిల్లలకు పౌష్టికలోపాలను అధిగమించే కార్యక్రమం నీరుగారుతుందని చెబుతూ.. తక్షణమే పాల సరఫరా పునరుద్ధరించాలని ఆమె ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, టెండరు ఖరారు, కాంట్రాక్టరు ఎంపిక అయ్యే వరకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అందుకే పాలు సరఫరా చేయలేకపోయాం... కేఎంఎఫ్ వివరణ

ఊహించని పరిణామాలు చోటుచేసుకోవడం వల్లే అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు పంపిణీ నిలిచిపోయిందని కర్ణాటక కోఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్(కేఎంఎఫ్) లిమిటెడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరా కాంట్రాక్టు దక్కించుకున్న తమ సంస్థ గతేడాది సెప్టెంబర్ నెల వరకు పూర్తిస్థాయిలో పక్కాగా సరఫరా చేసినట్లు వివరించింది. గతేడాది సెప్టెంబర్‌తో కాంట్రాక్టు ముగిసిందని, కానీ రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక ఆదేశాలతో పాల పంపిణీ కొనసాగించాలని నిర్ణయించినట్లు వివరించింది. కానీ పాడి పశువులు పెద్ద సంఖ్యలో లంపిస్కిన్ వ్యాధి బారిన పడడంతో పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోయిందని, దానికితోడు గత నవంబర్, డిసెంబర్‌లలో తీవ్ర వర్షాలు కురవడంతో పాల రవాణా పడిపోయిందని, దీంతో పాల కేంద్రాలకు కోటా రాలేదని వివరించింది. త్వరలోనే పాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని కేఎంఎఫ్ వివరించింది.

బీసీలకు బర్లు, గొర్లు కాదు, బడులు కావాలె

బీసీల పోరుగర్జన మహాసభలో జాజుల శ్రీనివాస్‌గౌడ్



బీసీల పోరుగర్జన మహాసభలో అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్ (హైదరాబాద్): రాష్ట్రంలో పన్నెండు లక్షల మంది పేద విద్యార్థులు చదువుకోవడానికి స్కాలర్ షిప్‌లు, ఫీజులు ఇవ్వాలని అడుగుతుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం గొర్లను, బర్లను ఇస్తూ బీసీలను మళ్లీ కులవృత్తులకే పరిమితం చేయాలని చూస్తోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. బీసీ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో 'పాలమూరు నుంచి పట్నం వరకు'పేరిట డిసెంబర్ రెండో తేదీన చేపట్టిన బీసీల పోరుయాత్ర గురువారం ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చేరుకుంది. ఈ సందర్భంగా కొత్తపేటలోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో నిర్వహించిన బీసీల పోరుగర్జన మహాసభలో ఆయన మాట్లాడారు. గత మూడున్నరేళ్లుగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వడంలేదని, స్కాలర్‌షిప్‌లు, మెస్‌చార్జీలు పెరిగిన ధరల ప్రకారం పెంచడం లేదని విచారం వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు దొడ్డు బియ్యంతో నాసిరకం భోజనం పెడుతున్నారని, ఆసరా పింఛన్‌దారులకు రూ.2016 రూపాయలు ఇస్తుండగా, హాస్టల్ విద్యార్థులకేమో రూ.1,500 ఇస్తున్నారని అన్నారు. బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కేంద్ర అధ్యక్షుడు తాటికొండ విక్రంగౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బైరు రవికృష్ణ గౌడ్, బీసీ మహిళ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మణిమంజరి, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యాంకుర్మ, బీసీ విద్యార్థి సంఘం నాయకులు స్వామిగౌడ్, పాలకూరి కిరణ్, ఎస్.దుర్గయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన అవకాశాలివ్వాలి: ఆర్.కృష్ణయ్య



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్: ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని కులాలు, సామాజిక వర్గాలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ తదితర రంగాల్లో అవకాశాలు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బీసీలందరూ ఏకమై రాజ్యాధికారం కోసం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గురువారం బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గడిచిన 75 ఏళ్లలో ఏ రంగంలోనూ బీసీలకు కనీస వాటా కూడా లభించలేదని విమర్శించారు. ఏపీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అన్ని రంగాలలో జనాభా ప్రకారం వాటా ఇచ్చారని, రాజకీయ రంగంలో బీసీలకు 50 శాతం వాటాను అన్ని స్థాయిల్లో కల్పించారన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభా గణనలో బీసీ కులగణన చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ సంస్థలో బీసీ రిజర్వేషన్‌లను 34 శాతం నుంచి 52 శాతానికి పెంచాలని కోరారు. ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జకృష్ణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి నరసింహగౌడ్, బీసీ వి ద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆయనే నవ్విస్తున్నాడు, ఆయనే ఏడిపిస్తున్నాడు.
ఆయనే జీవితాన్ని ప్రసాదించాడు. విడిచే ఒక బిందువు
ద్వారా ఆడామగల జంటను ఆయనే సృష్టించాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, జనవరి, 6

ఐటీ పరిధిలో ఆట

ఆన్‌లైన్ గేమింగ్‌లో అతి పెద్ద మార్కెట్ అయిన మనం ఎట్టకేలకు కళ్ళు తెరిచి, కష్టనష్టాలను నియంత్రించే పనిలో పడ్డాం. ఆన్‌లైన్ గేమింగ్‌ను ఐటీ నిబంధనల కిందకు తెస్తూ, కొన్ని ముసాయిదా సవరణలను కేంద్ర ఐటీ శాఖ సోమవారం విడుదల చేసింది. ఆన్‌లైన్ గేమ్స్ అన్నీ భారత చట్టాలకు అనుగుణంగా ఉండేలా, వాడకందార్లకు హాని కలగకుండా కాపాడేందుకే ఈ చర్యలని సర్కారు మాట. ముసాయిదాలో స్వీయ నియంత్రణ వ్యవస్థను ప్రతిపాదించిన మంత్రి, భవిష్యత్తులో గేమింగ్ కంటెంట్‌ను సైతం నియంత్రించే అవకాశం ఉందని చెప్పడం గమనార్హం.

సాధారణంగా ఆన్‌లైన్ గేమింగ్ 3 రకాలు. ఒకటి – 1990లలో వీడియో పార్లర్లలోని ఆటల్లాగా ఇప్పుడు ఆన్‌లైన్‌లో వ్యవస్థీకృతంగా ఆడే 'ఇ–స్పోర్ట్స్'. రెండోది – వేర్వేరు జట్లలోని నిజజీవిత ఆటగాళ్ళను ఒక జట్టుగా ఎంచుకొని, పాయింట్ల కోసం ఆన్‌లైన్‌లో ఆడే 'ఫ్యాంటసీ గేమ్స్'. మూడోది – మానసిక, శారీరక నైపుణ్యంపై, లేదంటే పాచికలాట లాంటి సంభావ్యతపై ఆధారపడ్డ ఆన్‌లైన్ సరదా ఆటలు. సంభావ్యతపై ఆధారపడ్డ ఆటల్ని డబ్బులకు ఆడితే జూదం. ఇదీ స్థూలమైన లెక్క. తాజా ప్రతిపాదనల్లో 'ఆన్‌లైన్ ఆట'ను నిర్వచించడమే కాక, ఆపరేటర్లు నియమ నిబంధనలన్నీ వాడకందారుకు ముందే చెప్పాలంటూ పారదర్శకతకు ప్రయత్నించడం బాగుంది. అలాగే సమయం దాటి ఆడుతుంటే, అది ఓ వ్యసనంగా మారకుండా హెచ్చరిక సందేశాలు పంపాలనడమూ భేష్.

కేంద్ర చట్టం పరిధిలోకి ఆన్‌లైన్ ఆటల్ని తీసుకొస్తున్న పాలకుల చొరవను స్వాగతిస్తూనే, లోపాలనూ నిపుణులు వేలెత్తి చూపుతున్నారు. గతంలో ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ 'ఐటీ చట్టం–2000' పరిధిలోది కాదు. తాజాగా ఐటీ శాఖను ఆన్‌లైన్ గేమింగ్ చూసే కేంద్ర మంత్రిత్వ శాఖగా నియమించారు. అది జరిగిన వారానికే ఈ కొత్త ముసాయిదా సవరణలు తెచ్చారు. నిజానికి, ఆన్‌లైన్ గేమింగ్ ఏ శాఖ కిందకు వస్తుందనే పాలనాపరమైన స్పష్టత ఇవ్వడం వరకు ఓకే కానీ, ఆ అధికారాన్ని సదరు శాఖ వినియోగించాలంటే పార్లమెంట్‌లో చట్టం చేయాలి. ఆ పని చేయకుండానే ఐటీ చట్టం నియంత్రణ పరిధిలోకే ఆన్‌లైన్ గేమింగ్‌ను తెస్తూ, ఐటీ నిబంధనలు చెయ్యడం విడ్డూరం.

అలాగే, ఈ సరికొత్త ముసాయిదా సవరణలపై ఈ నెల 17 లోగా ప్రజలు సలహాలు, సూచనలివ్వాలని కోరారు. కానీ, ఈ సంప్రతింపుల ప్రక్రియలో వచ్చిన అభిప్రాయాలను ప్రజా క్షేత్రంలో ఉంచట్లేదు. ఇటీవల 'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్ –2022'లోనూ ఐటీ శాఖ ఇదే పని చేసింది. దీనివల్ల ఈ విధాన నిర్ణయంలో ప్రభుత్వ చర్యల పట్ల ప్రజల్లో ఏ మేరకు నమ్మకం ఉంటుందంటే సందేహమే. ముందుగా ఎలాంటి చర్చ, శ్వేతపత్రం లేకుండానే, కనీసం ప్రభుత్వ ఆలోచన ఏమిటో చెప్పకుండానే కొత్త ముసాయిదా సవరణల్ని కేంద్రం తేవడం కొంత వివాదాస్పదమైంది.

భౌతికంగా అన్ని రకాల జూదం, పందాలపై దేశంలో గోవా, సిక్కిమ్, కేంద్రపాలిత డామన్ మినహా మిగతా రాష్ట్రాల్లో నిషేధం ఉంది. బ్రిటీష్ కాలపు బహిరంగ జూద చట్టం 1867 సహా, వివిధ రాష్ట్రాల చట్టాలున్నాయి. కొన్నిచోట్ల నైపుణ్య ఆధారిత ఆటలకూ షరతులున్నాయి. పాపులర్ ఆన్‌లైన్ ఆట లూడోలోనూ జూదం సాగుతోందని వివాదమైంది. ఇప్పుడు ఆన్‌లైన్ ఆటల్ని సైతం ఒక కేంద్ర చట్టం కిందకు తేవడంతో విదేశాల నుంచి నడిచే చట్టవిరుద్ధ, దేశవిద్రోహ జూద వేదికల ముప్పును అరికట్టవచ్చు. అయితే, పరిమాణం, రిస్క్‌తో సంబంధం లేకుండా ఆన్‌లైన్ ఆటల్ని అందించే సైట్లు, మొబైల్ యాప్‌లు (ఇంటర్మీడియరీలు) అన్నిటినీ ఒకే గాట కట్టడంపై పునరాలోచించాలి. అంతర్జాతీయ సంస్థలు తమ సేవల్ని భారత్‌లో ఆరంభించడానికి ఇక్కడ ఆఫీసర్లను పెట్టుకోవడం ఎంత ఆచరణాత్మకమో చెప్పలేం. డబ్బుతో జూదంపై మరింత కఠిన నిబంధనలుండాలని తమిళనాడు కోరుతోంది. మరి రాష్ట్రాలు అదనపు షరతులు పెట్టవచ్చేమో స్పష్టత లేదు.

నిజానికి, కరోనాలో మనం వినోదాన్ని ఆస్వాదించే విధానం మారిపోయింది. ఓటీటీ ఛానల్స్ విస్తరణతో పాటు ఆన్‌లైన్ గేమింగ్ బాగా పెరిగింది. ఆన్‌లైన్ ఆటలపై వెచ్చించే సగటు సమయం కోవిడ్ ముందుతో పోలిస్తే, 65 శాతం హెచ్చింది. ఏకంగా 43 కోట్ల మందికి పైగా ఈ వర్చ్యువల్ గేమింగ్‌పై సమయం వెచ్చిస్తున్నారని లెక్క. కరోనాతో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా టెక్నాలజీని వాడి, డిజిటల్ తెరను వీక్షించే వ్యవధి పెరగడం తిప్పలు తెచ్చింది. యువతరానికి ఆన్‌లైన్ ఆట ఓ వ్యసనమై, రోజూ 6 నుంచి 8 గంటలు వెచ్చిస్తున్నారు. చదువు, మానవ సంబంధాలు, చివరకు ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతున్నాయి. గతంలో పబ్‌జీ, బ్లూ వేల్ ఛాలెంజ్ లాంటి ఆన్‌లైన్ గేమ్స్ హింస, ఆత్మహత్యలను ప్రేరేపించేసరికి, వాటిని నిషేధించాల్సి వచ్చిన సంగతి మరిచిపోలేం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం గేమింగ్ వ్యసనాన్ని ఆరోగ్య సమస్యగా గుర్తించడం గమనార్హం. చైనా ఇప్పటికే ఈ ఆటల్ని 'మెదడుకు మత్తుమందు' అంటూ, 18 ఏళ్ళ లోపు పిల్లలు వారానికి 3 గంటలు మించి ఆడే వీల్లేకుండా చేసింది. భారత్‌లోనూ క్యాసినో లాగే ఆన్‌లైన్ ఆటల్లోనూ పిల్లలకు కనీస వయఃపరిమితి విధించవచ్చు. ముఖ్యంగా వీటి దుష్ఫలితాలపై తల్లితండ్రులు, అధ్యాపకులు పిల్లల్లో చైతన్యం తేవాలి. వచ్చే 2025 కల్లా 65.7 కోట్ల యూజర్లతో ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ రూ. 29 వేల కోట్లకు పైగా ఆదాయం తెస్తుంది. 15 వేల ఉద్యోగాలొస్తాయట. 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దే క్రమంలో ఆర్థిక అవకాశాలెన్ని ఉన్నా, ఈ ఆటలపై అదుపు లేకుంటే సామాజిక నష్టమూ ఎక్కువే. కాబట్టి పట్టువిడుపులతో పాలకుల నియంత్రణ చర్యలే శరణ్యం.

గమనించాల్సిన సైన్సు పరిణామాలు

విశ్లేషణ



దినేశ్ సి.శర్మ

కొత్త ఏడాదిలో శాస్త్ర విజ్ఞాన పరంగా చాలా అంశాలు ఆసక్తిగా నిలుస్తున్నాయి. కోవిడ్‌కు ముక్కు ద్వారా వేసుకునే టీకాతో పాటు, అధిక ఉష్ణోగ్రతల్లోనూ స్థిరంగా ఉండే టీకా రానున్నాయి. మొత్తంగానే కోవిడ్ పీడ విరగడైందని కూడా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించే అవకాశం ఉంది. సూర్యుడిని అధ్యయనం చేసేందుకు భారత్ తొలి ప్రయత్నంలో భాగంగా ఆదిత్య–ఎల్1ను ఈ ఏడాదే ప్రయోగించనున్నారు. 'ఇస్రో' ఈ ఏడాదిలోనే చంద్రయాన్–3ను కూడా ప్రయోగించనుంది. అణు విద్యుత్తు రంగంలో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు పని చేయనున్నాయి. డిజిటల్ పేమెంట్స్ పెరుగుతున్న నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ప్రవేశపెట్టనున్న డిజిటల్ రూపాయి ఒక చారిత్రక ఘట్టంగా నిలవనుంది.

కొత్త సంవత్సరంలో అప్పుడే నాలుగైదు రోజులు గడిచిపోయాయి. కాకపోతే ఫీలింగ్ మాత్రం గత ఏడాది జనవరి మాదిరిగానే ఉంది. ఒమిక్రాన్ వేరియంట్ ఆవిర్భావంతో కోవిడ్ ఇంకోసారి విజృంభిస్తుందేమో అన్న బెంగ గత ఏడాదిదైతే, కొత్త రూపాంతరంతో ఏం చిక్కు వస్తుందో అన్న భయం ఈసారి వెంటాడుతోంది. సమస్య కేవలం మనుషులకు మాత్రమే కాదు, ఆరోగ్య వ్యవస్థ మొత్తానికీ సవాలు విసరగలగటం ఆందోళనకరం. కాకపోతే దేశం ఇప్పటికే సంసిద్ధమై ఉన్న కారణంగా కొంచెం నింపాదిగా ఉండవచ్చు. అయితే ఈ ఏడాది ప్రశ్న కోవిడ్ ఇంకోసారి విజృంభిస్తుందా, లేదా? అన్నది కాదు. ఈ పీడ శాశ్వతంగా విరగడ అవుతుందా, కాదా? అన్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రియాసస్ మాత్రం కొంత ఆశావహంగానే ఉన్నారు. ఈ ఏడాది ఏదో ఒక సమయంలో కోవిడ్ శని వదిలిందని ప్రకటించే అవకాశమున్నట్లు చెబుతున్నారు. జనవరిలోనే జరిగే డబ్ల్యూహెచ్‌ఓ అత్యవసర కమిటీ సమావేశాల్లోనే ఈ అంశంపై చర్చ జరగనుంది.

వేడిలోనూ పనిచేసే టీకా

కోవిడ్–19 ప్రపంచానికి ముప్పు అన్న హెచ్చరికను డబ్ల్యూహెచ్‌ఓ తొలగించినప్పటికీ వైరస్‌తో ప్రమాదం లేదని అర్థం కాదు. ఇప్పటికే ఉన్న అనేకానేక శ్వాసకోశ సంబంధిత వ్యాధుల జాబితాలోకి ఇది కూడా చేరిపోయి అప్పుడప్పుడూ అక్కడక్కడా వచ్చిపోతూ ఉంటుంది. ఆరోగ్య వ్యవస్థలు మాత్రం నిత్యం ముంగాళ్లపై ఉండాల్సిన పరిస్థితి. అదే సమయంలో శాస్త్రవేత్తలు కొత్త టీకాలు, చికిత్సలను కనుక్కునే ప్రయత్నాల్లో ఉంటారు. భారత దేశంలో భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన నాసల్ వ్యాక్సీన్ (ముక్కు ద్వారా తీసుకునేది) అందరి దృష్టిలో ఉంది. అత్యవసర పరిస్థితుల్లో, బూస్టర్ డోసుగా వాడేందుకు ఈ టీకాకు అనుమతులు లభించాయి. ఈ టీకా వేయడం మొదలుపెడితే విస్తృత సమాచారం అందుబాటులోకి వస్తుంది. తద్వారా టీకా సామర్థ్యం ఏమిటన్నదీ తెలిసిపోతుంది.

ఈ ఏడాది గమనించాల్సిన ఇంకో కోవిడ్ వ్యాక్సీన్ వేడిని కూడా తట్టుకునే రకానిది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, బెంగళూరులోని స్టార్టప్ కంపెనీ మైన్‌వాక్స్ సంయుక్తంగా దీన్ని అభివృద్ధి చేస్తున్నాయి. ఇప్పటివరకూ జరిగిన అధ్యయనాల ప్రకారం... ఈ టీకా ఆల్ఫా, బీటా, గామా, డెల్టా రూపాంతరితాలను నాశనం చేయగల యాంటీబాడీలను తయారు చేయగలదని తేలింది. చండీగఢ్‌లోని సీఎస్ఐఆర్–ఐఎంటెక్‌తోపాటు, ఆస్ట్రేలియన్ సెంటర్ ఫర్ డిసీజ్ ప్రిపేర్డ్‌నెస్‌లలో ఈ టీకాను పరీక్షించారు. మానవ ప్రయోగాలు ఈ ఏడాది ప్రారంభం కావచ్చు. ఇప్పటివరకూ తయారైన టీకాలను రిఫ్రిజరేటర్లలో భద్రపరచాల్సిన అవసరముండగా... కొత్త టీకా అధిక ఉష్ణోగ్రతల్లోనూ స్థిరంగా ఉంటుంది. దీనివల్ల ఎంతో ప్రయోజనముంటుందన్నది తెలిసిన విషయమే.



ఆదిత్యుడి పైకి చూపు

ఈ ఏడాది శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అందరూ ఎదురు చూస్తున్న ప్రయోగాల్లో ఆదిత్య–ఎల్1 ముఖ్యమైందని చెప్పాలి. సూర్యుడిని అధ్యయనం చేసేందుకు భారత్ తొలి ప్రయత్నమిది. సుమారు 400 కిలోల బరువుండే ఈ ఉపగ్రహంలో స్వదేశీ పరిజ్ఞానంతో సిద్ధం చేసిన విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్‌ను ఏర్పాటు చేశారు. శ్రీహరికోట నుంచి ఈ ఏడాది తొలి త్రైమాసికంలోనే దీని ప్రయోగం జరిగే అవకాశం ఉంది. కరోనాగ్రాఫ్‌తోపాటు ఆదిత్య–ఎల్1లో ఇంకో ఆరు పేలోడ్స్ ఉంటాయి. భూమి, సూర్యుడి గురుత్వాకర్షణ శక్తులు శూన్యంగా ఉండే లగ్రానిగస్ పాయింట్ (ఎల్1)లో ఉంటూ ఈ ఉపగ్రహం సూర్యుడిని పరిశీలిస్తుంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ ఏడాదిలోనే చంద్రయాన్–3ను కూడా ప్రయోగించనుంది. చంద్రుడి ఉపరితలం పైకి సురక్షితంగా దిగడాన్ని పరీక్షించేందుకు చంద్రయాన్–2 ఉపయోగపడగా, తాజాగా చంద్రయాన్–3లో ఒక లాండర్, ఓ రోవర్ రెండూ ఉంటాయి. జీఎస్ఎల్వీ మార్క్–3 రాకెట్ ద్వారా వీటిని జాబిల్లిపైకి చేర్చనున్నారు.

మళ్లీ గగన్‌యాన్ మిస్?

ఇస్రో చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో గగన్‌యాన్ ఒకటి. అయితే అది ఈ ఏడాది కూడా డెడ్‌లైన్‌ను అందుకోకపోవచ్చు. 2018 ఆగస్టు 15న ప్రధాని నరేంద్ర మోదీ ''భరత మాత ముద్దుబిడ్డ ఒకరు 2022 లేదా అంతకంటే ముందుగానే భారతీయ రాకెట్‌లో అంతరిక్షంలోకి ఎగురుతారు'' అని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రి ఇటీవల లోక్‌సభలో ఒక ప్రకటన చేస్తూ, గగన్‌యాన్‌ను 2024 నాలుగో త్రైమాసికంలో ప్రయోగించే అవకాశం ఉన్నట్లు తెలపడం ప్రస్తావించాల్సిన అంశం. సిబ్బంది తప్పించుకునేందుకు అవసరమైన వ్యవస్థ, పారాషూట్ ఆధారంగా వేగాన్ని తగ్గించుకునేందుకు చేయాల్సిన ఏర్పాట్ల విషయంలో జాప్యం జరగడం వల్ల గగన్‌యాన్ మరోసారి వాయిదా పడింది. ఈ ప్రయోగాలు ఈ ఏడాది చివరిలో జరగవచ్చు. 2024 రెండో త్రైమాసికంలో సిబ్బంది లేకుండా ఒక ప్రయోగాన్ని నిర్వహించి ఆ తరువాత అసలు ప్రయోగం చేపట్టవచ్చు. గగన్‌యాన్‌లో పాల్గొనే వ్యోమగాముల ఎంపిక ఇప్పటికే జరిగిపోయింది. వీరు రష్యాలో తొలిదశ శిక్షణ పూర్తి చేసుకుని ప్రస్తుతం బెంగళూరులో ఇతర శిక్షణలు పొందుతున్నారు.

చిన్న అణు రియాక్టర్లకు సమయం?

ఈ ఏడాది దేశంలో అణు విద్యుత్తు రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లకు సంబంధించి కొంత కదలిక కనిపించవచ్చు. కాలుష్య రహిత విద్యుత్తును ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఏర్పడటం వల్ల, పైగా ఉక్రెయిన్ యుద్ధం పుణ్యమా అని ప్రపంచస్థాయిలో విద్యుత్తు రంగం తీరుతెన్నులు మారిపోయాయి. భారీస్థాయి అణు రియాక్టర్ల మాదిరిగా కాకుండా, 300 మెగావాట్ల సామర్థ్యమున్న ఈ స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లను ఫ్యాక్టరీల్లో తయారు చేసే సౌలభ్యం ఉంది. పెద్ద రియాక్టర్లనైతే విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేసే స్థలంలోనే అమర్చాల్సి ఉంటుంది. దీనివల్ల నిర్మాణానికి చాలా సమయం పట్టేస్తుంది. ఈ నేపథ్యంలోనే స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల తయారీలో ప్రైవేట్ కంపెనీలకూ అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది.

డిజిటల్ రూపాయి కూడా...

రిజర్వ్ బ్యాంక్ డిజిటల్ రూపాయిని అందుబాటులోకి తేనుండటం ఈ ఏడాది ఎదురు చూడాల్సిన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానపరమైన అంశాల్లో ఒకటి. దీంతోపాటు జన్యుమార్పిడి ఆవాల పంట క్షేత్ర ప్రయోగాలు, జీ20 అధ్యక్ష స్థానంలో భాగంగా చేపట్టనున్న సైన్స్ డిప్లొమసీ, కృత్రిమ మేధ రంగాల్లోని మార్పులనూ నిశితంగా చూడాల్సి ఉంటుంది. డిజిటల్ పేమెంట్స్ పెరిగిపోతున్న నేపథ్యంలో డిజిటల్ రూపాయి ఒక చారిత్రక ఘట్టంగా నిలవనుంది. భౌతిక రూపాయికున్నంత భద్రత, ఫీచర్లు, నమ్మకం డిజిటల్ రూపాయికీ ఉంటాయని ఆర్‌బీఐ చెబుతోంది. గోప్యత ఎంత వరకన్నది ఒక సందేహమే.

ఈ ఏడాది జరగనున్న జీ20 సమావేశాలు భారతదేశంలో జరుగుతున్న సైన్స్, టెక్నాలజీ ఇన్నొవేషన్లను ప్రపంచానికి పరిచయం చేసేందుకు చక్కటి అవకాశాల్ని కల్పిస్తున్నాయి. జీ20 సభ్యదేశాలన్నింటికీ మరింత దగ్గరయ్యేందుకు సైన్స్ డిప్లొమసీని ఉపయోగించుకోవాలి. ఇందులో భాగంగానే కోయంబత్తూరు, లక్షద్వీప్, అగర్తలా, ఇండోర్, రాంచీ, సిమ్లా, దయా, ఇటానగర్, దిబ్రూఘర్‌లలో శాటిలైట్ ఈవెంట్లు, సైన్స్ శాఖల మంత్రుల సమావేశాలు ఏర్పాటు చేశారు. అయితే... వీటిల్లో ఏ ఒక్కటీ సైన్సు, టెక్నాలజీలకు హబ్ అయిన బెంగళూరు, హైదరాబాద్, చెన్నై లేదా అహ్మదాబాద్‌లలో నిర్వహించకపోవడం ఆశ్చర్యకరమైన విషయం!

వ్యాసకర్త సైన్సు అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇదే పద్ధతి?



షారుఖ్ ఖాన్ నటించిన 'పఠాన్' సినిమాను వ్యతిరేకిస్తూ భజరంగ్ దళ్ కార్యకర్తలు అహ్మదాబాద్‌లోని ఒక మాల్‌లో పోస్టర్లు చించేశారని వార్త. మీకు ఒక సినిమా నచ్చకపోతే దాన్ని చూడటానికి వెళ్లకండి. కానీ ఇలాంటి గూండాగిరి ఏమాత్రం అంగీకార యోగ్యం కాదు.

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

మానవీయ మాట



హల్ద్వానీ (ఉత్తరాఖండ్) అంశంలో సుప్రీంకోర్టు 'నివాసుల హక్కులను పరిశీలించకుండా అత్యధిక జనాభాను తమ మూలాల నుంచి పెకిలించకూడదు' అని చెప్పింది. ఇది ఇండియా చట్టబద్ధంగా నడుస్తోందనీ, మానవీయ కోణం దాని మూలవిలువ అనీ స్పష్టంగా చాటింది.

– జఫర్ సరేశ్‌వాలా, మాజీ ఛాన్సలర్

పట్టించుకోవద్దా?



ఇస్లాం పేరుమీద తాలిబన్లు అందరు స్త్రీలు, బాలికలను పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఉద్యోగాల నుంచి నిషేధించారు. ఎందుకు ఇండియన్ ముస్లిం పర్సనల్ బోర్డు, ఇంకా ఇతర ఇస్లామిక్ పండితులు దీన్ని ఖండించలేదు? ఎందుకు? వాళ్లు తాలిబన్లతో అంగీకరిస్తారా?

– జావేద్ అఖ్తర్, గీత రచయిత

మార్చుకోలేం



బట్టలు ఎక్కువ స్థలం ఆక్రమించకుండా వాటిని ఎలా మడతపెట్టాలి అన్న విషయం మీద మీరు భూమ్మీద ఉన్న 500 వీడియోలు చూడవచ్చు. అయినాకూడా మీకు పదిహేనేళ్లు ఉన్నప్పుడు వాటిని ఎలా మడతపెట్టాలని మీ అమ్మ చెప్పిందో అలాగే మడతపెడుతుంటారు.

– పర్మీందర్ సింగ్, ఆంత్రప్రెన్యూర్

గెలవాలి



మీ మనసు అనేది ఒక సాధనం. దానికి గురువు ఎలా కావాలో నేర్చుకోండి, అంతేగానీ దానికి బానిస కావొద్దు.

– ఆంద్రూ టెయిట్, కిక్‌బాక్సర్

నోట్ల రద్దు ఫలితమేంటి?

2016 నవంబర్ 8న ప్రధాని ప్రకటించిన నోట్ల రద్దుపై వ్యాజ్యాలను విన్న అత్యున్నత న్యాయస్థానం ఆ ప్రక్రియలో ప్రభుత్వం పరిధి మీరడం లాంటిదేమీ లేదనీ, అంతా పద్ధతి ప్రకారమే జరిగిందనీ తీర్పు వెలువరించింది. నలుగురు న్యాయమూర్తులు ఇదే అభిప్రాయం వెలిబుచ్చగా, ఒక్కరు మాత్రం సరికాదంటూ విభేదించారు. న్యాయస్థానం మద్దతు ప్రభుత్వానికి కొంచెం ఊరట. ఒకవేళ ఆ ప్రక్రియని న్యాయస్థానం తప్పు పట్టి ఉన్నా వాస్తవంలో పెద్ద ప్రభావం ఏమీ ఉండేది కాదు గానీ ప్రభుత్వం వైపు నుండి తప్పు జరిగినట్లు భావన స్థిరపడి పోయేది. ఎప్పుడో జరిగిపోయిన నిర్ణయం.. పర్యవసానాలు కూడా అనుభవమైపోయాక అది, తప్పో ఒప్పో అన్నది కేవలం మేధోమథనం కోసమే.


అయినా విధాన పరమైన నిర్ణయాల్లో న్యాయస్థానం ఎటూ జోక్యం చేసు కోదు. అది దాని పరిధిలోని అంశం కాదు. పెద్ద నోట్ల రద్దు విషయంలో రిజర్వ్ బ్యాంకును సంప్రదించకుండా ఏకపక్షంగా, హఠాత్తుగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నది పిటిషనర్ల వాదన. అయితే ఆరు మాసాల ముందు నుండే సంప్రదింపుల ప్రక్రియ జరిగినట్లు, ప్రకటన వరకూ ఆ విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు ప్రభుత్వం చెప్పడంతో న్యాయస్థానం ఆ ప్రక్రియ చట్టబద్ధతను సమర్థించింది. ప్రభుత్వానికి ఆ హక్కు ఉందని తెలియజేసింది. ఒక న్యాయమూర్తి మాత్రం నోట్ల రద్దు ప్రతిపాదన రిజర్వు బ్యాంకు నుండి కాకుండా కేంద్రం నుండి రావడాన్నీ, ప్రకటించే ముందు పార్లమెంట్‌ను విశ్వాసంలోకి తీసుకోకపోవడాన్నీ తప్పు పట్టారు. వారి అభిప్రాయం కూడా గమనంలోకి తీసుకుని ప్రభుత్వం భవిష్యత్‌లో ఈ తరహా పెద్ద నిర్ణయాల్లో ఇలాంటి వైఖరి తీసుకోకుండా ఉంటే సబబుగా ఉంటుంది.

భిన్న వాదనల్ని పక్కకు పెట్టి నిష్పక్షపాతంగా చూస్తే పెద్ద నోట్ల రద్దు ప్రకటించక ముందు ప్రభుత్వం ఇంకొంత జాగ్రత్త వహించి అన్ని కోణాల్లో ఆలోచించి ఉంటే బాగుండేది. తీవ్రంగా నష్టపోయిన అసంఘటిత ఆర్థిక వ్యవస్థకు దెబ్బ తక్కువ తగిలేది. జనజీవనం, సామాన్యుల నగదు లావాదేవీలు కుదుపు నుండి తొందరగా కోలుకొనేవి. వెరసి ఆర్థిక వ్యవస్థకు లాభం జరిగేది. పెద్దనోట్ల రద్దు వల్ల ఒనగూడే ప్రయోజనాలు ఇవి అంటూ ప్రధాని ఏవైతే చెప్పారో (నల్లధనం తగ్గుదల, నకిలీ నోట్ల నివారణ, తీవ్రవాదులకు ఫండింగ్) వాటిలో ఎన్ని సాధ్యమయ్యాయో ఇప్పటికీ లెక్కలు లేవు. అధ్యయనం చేసి ఆ గణాంకాల్ని వెలికితీస్తే గానీ అసలు వాస్తవం బోధపడదు. నిర్ణయం చట్టబద్ధమే కావొచ్చు కానీ ఫలితం ఏమిటి అన్నది ప్రధానం. ఔషధం సరియైనదా, కాదా... సరియైనదే అయినా వికటించిందా, లేక అనుకున్న ప్రభావం చూపిందా అన్నదే గీటురాయి.

– డా॥ డి.వి.జి. శంకర రావు; మాజీ ఎంపీ, పార్వతీపురం
మొబైల్: 94408 36931

ఆ ఏడు పోతేమి ఈ ఏడు వస్తేమి

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

కొత్త యాడాదొచ్చింది. యాడాదే గాకుంట బోన్గిరి కెల్లి మా యాద్గిరి మామ గుడ్క ఇంటికొచ్చిండు. ఎప్పుడు మాట్లాడినా రాజకీయాల గురించే మాట్లాడ్తుంటడు. రామాయనం, బారతం గూడ రాజకీయాలే అంటడు. రామునికి కైక వెన్నుపోటు పొడ్వబట్కె పద్నాల్గేండ్లు అడ్విలల్ల దిర్గిండు. పార్టి ఫిరాయించ బట్కె విబీషనుడు లంకకు రాజైండు. వెన్నుపోటు, గోడదుంకుడు ఎప్పటి సందో ఉన్నయని జెప్తుంటడు. ఊరంత ఒక దిక్కైతె ఊసు కండ్లోడు ఒక దిక్కు. అందరు ఎడ్డెం అంటె గాయిన తెడ్డెం అంటడు.

''హ్యాపీ న్యూ ఇయర్ మామా'' అన్న. చిన్నగ నగిండు.

''కొత్త యాడాదిల సంతోసంతోని ఉండుమంటె ఎక్కిరిచ్చిన తీర్గ నవ్వుతవేందే?'' అని అడ్గిన.

''కొత్త క్యాలండర్ రాంగనే అంత యాడనన్న కొత్తగైతదార! సూర్యుడేమన్న కొత్తగున్నడా? మొగులు మీది కెల్లి చెంద్రుడు కిందికి దిగొచ్చిండా?''

''శానమంది మందు గొట్టింద్రు. డాన్స్ జేసింద్రు. కేకులు గోసింద్రు. అందరు జోష్ మీదుంటె నువ్వు హోష్ గురించి మాట్లాడ్తవేంది?''



''కొత్త యాడాదిని మనాయించె తందుకు నడి నాత్రి దన్క పబ్‌లను, బార్లను తెర్సి ఉంటెతందుకు పర్మిసన్ ఇచ్చింద్రు. తెలంగాన 215 కోట్ల మందు గొడ్తె ఆంద్రల 142 కోట్ల రూపాయల మందు గొట్టింద్రు. సర్కార్ ఎవ్వలితోని నడుస్తున్నదో ఎర్కైనార? మందుతోని నడుస్తున్నది.''

''వహవ్వా! క్యా ఖూబ్''

''తొమ్మిదేండ్లు చెంద్రబాబు ముక్యమంత్రి కుర్సి మీద గూసున్నడు. ఏడేండ్లు అపొజిషన్ లీడర్ కుర్సి మీద గూసోని రికార్డ్ బిటాయించిండు. ఆక్రి మోక ఇయ్యుంద్రి. మల్ల ముక్యమంత్రిని జెయ్యుంద్రి అన్కుంట జెనంను బత్మిలాడుతున్నడు. గిదేం కర్మ రాస్ట్రంకు అన్కుంట మీటింగ్‌లు బెట్టి పల్ల పల్ల ఏడుస్తున్నడు. గా నడ్మ కందుకూరుల సన్నటి బాటల మీటింగ్ బెట్టింద్రు. దాంతోని మెస్లెతందుకు గుడ్క జాగ లేక జెనం ఒగల మీద ఒగలు బడి తొమ్మిదిమంది సచ్చింద్రు. గిదే పెద్ద కర్మ రాస్ట్రంకు అయ్యింది. చెంద్రబాబు హన్మంతున్ని జెయ్యబోతె బోడ కోతి అయ్యింది. కొత్త యాడాది పస్టు తారీకు గుంటూర్ల టీడీపీ చెంద్రన్న కానుకలు పంచుడు ప్రోగ్రాం బెట్టింది. చెంద్రబాబు స్టేజి ఎక్కుతున్నప్పుడే గాదాని ఒక తంతె కూలింది. తంతెను బాగ జేసినంకనే గాయిన స్టేజ్ ఎక్కిండు. కానుకల కోసం ఆడోల్లు ఒగల నొగలు నూక్కున్నరు. కొందరు కింద బడ్డరు. కింద బడ్డోల్లను తొక్కుకుంట బోయింద్రు. దాంతోని ముగ్గురు ఆడోల్లు సచ్చింద్రు. పోయిన యాడాది ఆక్రిల చెంద్ర బాబు బెట్టిన మీటింగ్‌ల తొమ్మిది మంది సస్తె కొత్త యాడాదిల బెట్టిన మీటింగ్‌ల ముగ్గురు సచ్చింద్రు. గివన్ని జూస్తె పచ్చ మీటింగ్ల కర్మేంది రాస్ట్రంకు అని జెనం అన్కుంటున్నరు. కొత్త యాడాదొచ్చినా బాబు మారలే. గాయిన కర్మ మీటింగులు సుత మారలే''

''పప్పు లోకేశ్ సంగతేందే?''

''అందరు పాదయాత్ర జేస్తున్నరు. ఎన్కట మా నాయిన గుడ్క పాదయాత్ర జేసిండు. బారత్ జోడో అన్కుంట రాహుల్ గాంది గూడ పాదయాత్ర జేస్తున్నడు. ఇయ్యాల గాకున్నా రేపన్న ముక్యమంత్రిని గావాలంటె పాదయాత్ర జెయ్యాలె. నడిస్తినా అంటే తిన్నది అర్గతది. బొర్ర రాకుంట ఉంటుంది అని లోకేశ్ అన్కుండు. అయ్యగారి తాన్కి బోయిండు. మంచి మూర్తం బెట్టిచ్చుకుండు. 27 తారీకున కుప్పం కెల్లి ఇచ్చాపురం దాన్క పాదయాత్ర జేస్తనని జెప్పిండు. యువ గలం పేరు మీద 400 దినాలు 4,000 కిలోమీటర్లు పాదయాత్ర జేస్తనన్నడు. యెంబడి పస్సు బస్తలు గూడ గొంచ బోతనని జెప్పిండు. జెనం మీద పస్సు సల్లుకుంట పాదయాత్ర జేస్తనన్నడు. పాదయాత్ర జేస్కుంట టీడీపీని 'బలవంతం' జేస్తడు, గిదేందని అడ్గకురా గాయిన 'బలవంతం' అంటె 'బలోపేతం' అని అనుకుంటడు.''

''మామా! సలికాలం గూడ ఉబ్బరిస్తున్నదెందుకే?''

''కొత్త యాడా దొచ్చిందని సలి గూడ మందు గొట్టి గరమైందిరా. రేల్ గాడి సైమమయింది వొస్తరా'' అన్కుంట యాద్గిరి మామ ఊరికి బోయిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ ı 99591 50491

దక్షిణాదిలో బలపడుతోంది

అభిప్రాయం



రఘురామ్ పురిఘళ్ళ

దక్షిణాది రాష్ట్రాలపై భారతీయ జనతాపార్టీ దృష్టి అని తరచుగా మనం వింటున్నాం, వార్తలను చదువుతున్నాం. భారతీయ జనతాపార్టీ దక్షిణాది రాష్ట్రాల్లో కేవలం కర్ణాటక, పాండిచ్చేరిలో మాత్రమే అధికారంలో ఉంది. అయితే పాండిచ్చేరి చాలా చిన్న రాష్ట్రం. కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో బలం పెంచుకోవాలనీ, ఇక్కడ కూడా భారతీయ జనతాపార్టీ ప్రభుత్వాలను ఏర్పాటు చెయ్యాలనీ అనేక సంవత్సరాలుగా భాజపా అనుకుంటోంది.

కేరళ విషయానికి వస్తే 2019 ఎన్నికల్లో భాజపా గణనీయమైన ఓటు బ్యాంకును సంపాదించింది. అయితే సీట్ల విషయంలో ఆశించిన ఫలితాలు రాలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ఓట్ల శాతం పెంచుకోగలిగింది కానీ సీట్లు మాత్రం రాలేదు. ఇప్పుడు పట్టుదలగా 2024 ఎన్నికల కోసం గట్టి ప్రయత్నాల్లోనే ఉంది. రెండు బలమైన కూటములైన యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ మధ్య భాజపా ఈసారి తన సత్తా చాటాలని చూస్తోంది.



తమిళనాడు విషయానికి వస్తే 2019 పార్లమెంట్ ఎన్నికల్లో భంగపడినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో పుంజుకుని నాలుగు శాసనసభా స్థానాలను గెలుచుకొంది. ముగ్గురు మాజీ రాష్ట్ర అధ్యక్షులకు కేంద్రంలోనూ, ప్రభుత్వంలోనూ సముచిత స్థానం కల్పించింది. రాష్ట్ర పార్టీ పగ్గాలను ఐపీఎస్ అధికారీ, యువకుడూ అయిన అన్నామలైకు అప్పగించి పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది కేంద్ర నాయకత్వం. జయలలిత మరణానంతరం ఏఐఏడీఎంకే బలహీనపడటం తెలిసిందే. ఆ విధంగా ఏఐఏడీఎంకే స్థానాన్ని భాజపా భర్తీ చెయ్యాలని చూస్తోంది. 5 దశాబ్దాలుగా ప్రాంతీయ పార్టీలైన డీఎంకే, ఏఐఏడీఎంకేలు ఏలిన చోట జాతీయ పార్టీగా భాజపా... యువ రాష్ట్ర అధ్యక్షుడి నేతృత్వంలో తమిళనాడులో దూసుకెళుతోంది.

ఆంధ్రప్రదేశ్ విషయంలో రెండు ప్రాంతీయ పార్టీలయిన – వైసీపీ, టీడీపీల మధ్య ఎలాగైనా ఈసారి ఎన్నికల్లో తన సత్తా చాటాలని ప్రయత్నిస్తోంది. తెలంగాణ విషయానికి వస్తే గత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక స్థానాన్ని మాత్రమే గెలిచి నప్పటికీ 2019 పార్లమెంట్ ఎన్నికలలో టీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు షాక్ ఇచ్చి ఏకంగా 4 పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకొంది. ఆ తర్వాత జరిగిన రెండు ఉప ఎన్నికలలో మరో రెండు శాసనసభ స్థానాలను గెలిచి మొన్న మునుగోడులో టీఆర్ఎస్‌కు గట్టి సవాల్ విసిరింది.

కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి ఒక వైపు, యువ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ తన పాదయాత్రతో మరోవైపు కేసీఆర్‌కు చెమటలు పట్టిస్తున్నారు. మరోవైపు డా॥ కే. లక్ష్మణ్‌ను రాజ్యసభ సభ్యుడిగానూ, ఓబీసీల జాతీయ అధ్యక్షుడిగానూ చేశారు. డీకే అరుణ, ఎంపీ అరవింద్, ఈటెల రాజేందర్ లాంటి వారు ఈసారి ఎలాగైనా తెలంగాణలో కాషాయ జెండా ఎగురవెయ్యాలని తీవ్రంగా పనిచేస్తున్నారు.

మొత్తం మీద దక్షిణ భారతదేశంలో భారతీయ జనతా పార్టీ స్థిరమైన వేగంతో ముందుకు సాగు తోంది.

వ్యాసకర్త బీజేపీ సీనియర్ నాయకులు
raghuram.bjp@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** పౌర్ణమి రా.3.19 వరకు, తదుపరి బ.పాడ్యమి, **నక్షత్రం:** ఆరుద్ర రా.11.35 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** ఉ.6.32 నుండి 8.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.47 నుండి 9.30 వరకు తదుపరి ప.12.27 నుండి 1.11 వరకు, **అమృతఘడియలు:** ప.12.38 నుండి 2.23 వరకు; **రాహుకాలం :** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం :** ప.3.00 నుండి 4.30 వరకు; **సూర్యోదయం** 6.36 ; **సూర్యాస్తమయం** 5.36.

సీఎం కేసీఆర్‌కు 'సర్ ఛోటూ రామ్' అవార్డు

- మంత్రి నిరంజన్‌రెడ్డికి అవార్డును అందజేసిన అఖిల భారత రైతు సంఘం ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అఖిల భారత రైతు సంఘం ప్రతినిధులు 'సర్ ఛోటూ రామ్'అవార్డును ప్రకటించారు. పంజాబ్ రైతుల సంక్షేమ కోసం కృషిచేసిన సర్ ఛోటూ రామ్ పేరిట ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఈ అవార్డును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి అఖిల భారత రైతు సంఘం ప్రతినిధులు అందజేశారు. అఖిల భారత రైతు సంఘం అధ్యక్షుడు, సంయుక్త కిసాన్ మోర్చా సభ్యుడు సత్నాం సింగ్ బెహ్రూ, సంఘం సలహాదారులు సుఖ్‌జిందర్ సింగ్ కాకా, రచ్‌పాల్ సింగ్ ఖల్సా, మీడియా కార్యదర్శి అవతార్ సింగ్ దుండా తదితరులు మంత్రుల నివాస సముదాయంలో నిరంజన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో అతిపెద్దదైన వ్యవసాయ రంగాన్ని మార్చాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమన్నారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి పలువురు రైతులు చనిపోతే కేంద్ర ప్రభుత్వంలో చలనంలేదని, చనిపోయిన రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వాలన్న ఆలోచన తట్టలేదని నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, మూసీ రివర్ బోర్డు చైర్మన్ సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎవరీ సర్ ఛోటూ రామ్?: స్వాతంత్ర్యానికి పూర్వం వడ్డీ వ్యాపారుల చేతుల్లో నలిగిపోతున్న పంజాబ్ రైతుల శ్రేయస్సు దృష్ట్యా సర్ ఛోటూ రామ్ 1934లో పంజాబ్ రిలీఫ్ అప్పుల చట్టం, 1936లో పంజాబ్ రుణదాతల రక్షణచట్టం తేవడానికి కృషిచేశారు. తదనంతర కాలంలో ఈ చట్టాలు పంజాబ్ రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పులు తెచ్చాయి. ఆ తర్వాత హరితవిప్లవంతో స్వామినాథన్ పంజాబ్ రైతులను గణనీయంగా ప్రభావితం చేశారు. ఆ తర్వాత తమను అంతగా ప్రభావితం చేసిన వ్యక్తి కేసీఆరేనని పంజాబ్ రైతులు మంత్రితో అన్నారు.

కంటోన్మెంట్ విలీనంపై కమిటీ

- కేంద్రం కీలక నిర్ణయం
- నెల రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశం
- 9న కమిటీ తొలి సమావేశం జరిగే అవకాశం
- '500 మీటర్ల నిబంధన' అమలుపై ఆర్మీ ప్రతిపాదన


సంబురాలు చేసుకుంటున్న కంటోన్మెంట్ వికాస్ మంచ్ సభ్యులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని సివిలియన్ ప్రాంతాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రక్రియలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రతిపాదన దశలోనే ఉన్న ప్రతిపాదన విధి, విధానాల రూపకల్పనకు ఎనిమిది మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. నెల రోజుల్లోగా ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా విలీన ప్రక్రియ కొనసాగనుంది. రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ, అడిషనల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ చైర్మన్‌గా ఏర్పాటైన ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ వ్యవహరించనున్నారు. వీరిద్దరితో పాటు కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్, రక్షణ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ, తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ సెక్రెటరీ, డిఫెన్స్ ఎస్టేట్స్ అడిషనల్ డీజీ, ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ అడిషనల్ డీజీ, డిఫెన్స్ ఎస్టేట్స్ సదరన్ కమాండ్ డైరెక్టర్‌లు సభ్యులుగా ఉంటారు. ఫిబ్రవరి 4వ తేదీలోపు ఈ కమిటీ తన నివేదికను సమర్పించాల్సి ఉంటుంది.

ఎంఓడీ ప్రతిపాదనకు అనుగుణంగా..

కంటోన్మెంట్ పరిధిలోని సివిల్ ఏరియాలను ఆర్మీ నుంచి విడదీసి సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసుకోవాల్సిందిగా కోరుతూ గతేడాది మే 23న రక్షణ మంత్రిత్వ శాఖకు ఆర్మీ ప్రతిపాదన పంపింది. తదనుగుణంగా రక్షణ శాఖ తెలంగాణ ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరగా, సివిల్ ఏరియాలను తమ పరిధిలోనికి తీసుకునేందుకు తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ తన అంగీకారం తెలుపుతూ గత నెల 14న లేఖ రాసింది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.

9న తొలి సమావేశం

విలీనంపై ఏర్పాటైన కమిటీ తొలి సమావేశం ఈ నెల9న వీడియో కాన్ఫరెన్స్ పద్ధతిలో జరగనుంది. కంటోన్మెంట్ పరిధిలోని భూములు, స్థిర, చరాస్తులు, ఉద్యోగులు, పెన్షనర్‌లు, కంటోన్మెంట్ నిధులు, పౌర సేవలు, రోడ్లు, ట్రాఫిక్, రికార్డులు, స్టోర్ తదితర అన్ని రకాల బదలాయింపుపై రోడ్ మ్యాప్ రూపొందించనుంది. కమిటీ తొలి భేటీకి ముందే రక్షణ మంత్రిత్వ శాఖ ఓ కీలక ఆదేశాన్ని కమిటీ ముందు ఉంచనున్నట్లు తెలిసింది.

ఇప్పటికంటే కూడా కఠినమైన నిబంధనలు?

మిలటరీ శిక్షణ కేంద్రాలు, కార్యాలయాలు, స్థలాలకు 500 మీటర్ల పరిధిలో నిర్మాణాలకు సంబంధించి ఆంక్షలు అమల్లో ఉన్నాయి. ప్రస్తుతానికి జీహెచ్‌ఎంసీ పరిధిలోని నిర్మాణాల విషయంలో ఈ నిబంధనను అమలు చేస్తున్నారు. కంటోన్మెంట్‌లో మాత్రం మినహాయింపు ఉంది. తాజాగా కంటోన్మెంట్‌లోని సివిలియన్ ప్రాంతాలను జీహెచ్‌ఎంసీలో కలపనుండటంతో 500 మీటర్ల నిబంధనను ఇక్కడ కూడా అమలు చేస్తామంటూ ఆర్మీ ముందస్తుగానే ప్రకటించింది. దీనికి తోడు ఆర్మీ స్థావరాలకు 100 మీటర్ల పరిధిలో ఎలాంటి నిర్మాణాలను అనుమతించబోమని కూడా ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో కంటోన్మెంట్‌లోని పలు ప్రాంతాల్లో ఇప్పటికంటే కూడా కఠినమైన నిబంధనలు అమలయ్యే అవకాశముంది.

వికాస్ మంచ్ హర్షం.. బాణసంచా కాల్చి సంబురాలు

కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రక్రియలో భాగంగా కేంద్ర రక్షణ శాఖ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం పట్ల కంటోన్మెంట్ వికాస్ మంచ్ (సీవీఎం) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సీవీఎం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం ఏబెల్, సంకి రవీందర్ ఆధ్వర్యంలో పికెట్ చౌరస్తాలో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీవీఎం సభ్యులతో పాటు వివిధ పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

'కంటివెలుగు'పై అవగాహన కల్పించండి



సాక్షి, హైదరాబాద్/ ఏజీవర్సిటీ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం అమలుకోసం గ్రామాల్లో తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అధికారులకు సూచించారు. ఈనెల 18 నుంచి కంటి వెలుగు రెండో విడత ప్రారంభించనున్న నేపథ్యంలో గ్రామాలలో ఈ కార్యక్రమం తేదీలను తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గురువారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన ఈ పథకంపై ఏర్పాట్లను సమీక్షించారు.

ఎస్‌హెచ్‌జీల ఆదాయం పెంచడమే లక్ష్యం..

స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఆదాయ మార్గాలను పెంపొందించే లక్ష్యాన్ని మరువరాదని పీఆర్ 'సెర్ప్'సీఈవో సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. గురువారం వివిధ జిల్లాల అధికారుల ఓరియెంటేషన్ వర్క్ షాపులో ఆయన మాట్లాడారు. గత సీజన్‌లో ఖమ్మం జిల్లాలో ఎస్‌హెచ్‌జీ ద్వారా ప్రయోగాత్మకంగా ఎండుమిర్చి కొనుగోలు, మార్కెటింగ్ ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మంతో పాటు మహబూబాబాద్, వరంగల్, జనగామ, సూర్యాపేట జిల్లాలకు దీనిని విస్తరించనున్నట్లు వెల్లడించారు.

అంధత్వం అనుభవించా..: పువ్వాడ


కంటి వెలుగు బృందాలకు ట్యాబ్‌లు అందజేస్తున్న మంత్రి అజయ్, కలెక్టర్ అనుదీప్

చుంచుపల్లి: చూపు లేకపోతే ఏమీ చూడలేం.. ఏమీ చేయలేం.. ఆ బాధను స్వయంగా అనుభవించా.. అని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో గురువారం నిర్వహించిన కంటి వెలుగు సమీక్షలో ఆయన మాట్లాడారు. కంటిచూపు లేకపోతే ఎన్ని ఇబ్బందులు ఎదురవుతాయో తనకు అనుభవపూర్వకంగా తెలుసునని చెప్పారు. ప్రమాదంలో తన కళ్లకు ఐదారు శస్త్ర చికిత్సలు జరగడంతో దాదాపు ఏడు నెలల వరకు కంటి చూపు లేకుండా బాధపడ్డానని గుర్తు చేసుకున్నారు. అలా ఎవరూ ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ రూపకల్పన చేసిందే.. కంటి వెలుగు కార్యక్రమమని స్పష్టం చేశారు. ఈనెల 18 నుంచి చేపట్టబోయే రెండో విడత కార్యక్రమాన్ని సమష్టి కృషితో విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం కంటివెలుగు బృందాలకు మంత్రి ట్యాబ్‌లను అందజేశారు.

రాత్రి వేళల్లోనే మోటార్లు రన్!

- అధికారుల ప్రణాళికలు



కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో గత నెలలోనే ట్రయల్ రన్‌లు పూర్తి చేసిన ఇంజనీరింగ్ అధికారులు బుధవారం అర్ధరాత్రి రెండు మోటార్లతో ఎత్తిపోతలను పునఃప్రారంభించారు. గురువారం రెండో రోజు రాత్రి 9 గంటల నుంచి రామగుండం ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లక్ష్మీపంపుహౌస్‌లో 1, 2, 3 వరుస క్రమంలోని మోటార్లతో 6,600 క్యూసెక్కులు, పెద్దపల్లి జిల్లాలోని సరస్వతీ పంపుహౌస్‌లో 2 మోటార్లతో 6 వేల క్యూసెక్కులు, పార్వతీ బ్యారేజీలో రెండు మోటార్లతో 5,800 క్యూసెక్కులు తరలిస్తున్నట్లు ఈఎన్‌సీ తెలిపారు. కాగా, రాత్రే మోటార్లు నడిపిస్తే విద్యుత్ వినియోగం తగ్గుతుందని.. డిమాండ్ కూడా తక్కువగా ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రోజూ రాత్రి పూటనే మోటార్లు నడిపించడానికి ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించినట్లు ఈఎన్‌సీ తెలిపారు. ప్రస్తుతం గోదావరి, ప్రాణహిత నదుల ద్వారా 9 వేలకుపైగా క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజీలో 16.17 టీఎంసీల సామర్థ్యానికి 13.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సరస్వతీ బ్యారేజీలో 10.87 టీఎంసీ సామర్థ్యానికి 9.20 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. బ్యాక్‌వాటర్‌ను ఎత్తిపోయడానికి రాత్రిపూట అనుకూలంగా ఉండడంతో రాత్రి 9 గంటల నుంచి 10 మధ్య అరగంటకు ఒక్క మోటార్‌ను ఆన్ చేసి ఎత్తిపోతలను ప్రారంభించారు. వారి వెంట ఈఈ తిరుపతిరావు, డీఈఈ సూర్యప్రకాశ్, ఏఈఈలు భరత్, వంశీరెడ్డి, రాజేంద్రప్రసాద్‌లు ఉన్నారు.

దోపిడీ దొంగల బీభత్సం

- నార్సింగిలో ఓ వ్యక్తిని దారుణంగా చంపి.. మరో ఇద్దరిపై దాడి.. రూ.15వేలు దోపిడీ
- ట్రాన్స్‌జెండర్‌లకు బెదిరింపు
- పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులపై కూడా దాడి
- ఇద్దరు పోలీసులకు తీవ్రగాయాలు.. ఎట్టకేలకు అదుపులో నిందితులు


కిషోర్‌రెడ్డి


నిహారిక


శివరాజ్

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి ఇద్దరు దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. ముగ్గురిని కత్తులతో పొడవగా ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు గాయాలతో బయటపడ్డారు. మృతుడి బైక్‌ను చోరీ చేసి దానిపై పరారయ్యారు. పట్టుకునేందుకు వెళ్లిన ఇద్దరు పోలీసులపై ఆ ఇద్దరిలో ఓ నిందితుడు కత్తితో దాడి చేసి పరారవ్వగా.. ఆ పోలీసులు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. బుధవారం రాత్రి హైదర్‌షాకోట్‌కి చెందిన ట్రాన్స్‌జెండర్ నిహారిక(నరేష్) తన మిత్రులతో కలిసి నార్సింగి రక్త మైసమ్మ గుడి సమీపంలో కోకాపేటకు చెందిన తులసికుమార్ అనే వ్యక్తితో మాట్లాడుతుండగా.. అక్కడికి వచ్చిన ఇద్దరు దుండగులు తులసికుమార్‌ను కత్తితో పొడిచి అతడి నుంచి రూ.15వేలు లాక్కున్నారు. కత్తి దాడిలో అతని చేతి వేళ్లు తెగిపోయాయి. అక్కడే ఉన్న ట్రాన్స్‌జెండర్‌లను డబ్బుల కోసం డిమాండ్ చేశారు. దీంతో నిహారిక తన భర్త కిషోర్‌రెడ్డి(35)కి ఫోన్ చేసింది. దాంతో అతను తన మిత్రుడు శివరాజ్‌తో కలిసి అక్కడికి చేరుకున్నాడు. అప్పటికే తులసికుమార్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకున్నారు. ఈ లోగా నిందితులు అక్కడి నుంచి జారుకున్నారు.

ఆ తర్వాత దారి కాచి హత్య...

ఆ తర్వాత ఇద్దరు దుండగులు గంధంగూడ దారిలో కిషోర్‌రెడ్డి, అతని మిత్రుడు శివరాజ్‌లను అడ్డగించి కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన కిషోర్ అక్కడికక్కడే మృతి చెందగా శివరాజ్ స్వల్పగాయాలతో తప్పించుకున్నాడు. మృతుడు కిషోర్ ద్విచక్రవాహనం తీసుకుని వారు అక్కడి నుంచి పరారయ్యారు. కాగా, దుండగుల్లో ఒకతను సిక్కు వేషధారణలో ఉండగా మరొకతను మాస్క్ ధరించి ఉన్నాడని నిహారిక తెలిపారు. నిందితులను గుర్తించిన నార్సింగి పోలీసులు వారిపై కేసులు నమోదు చేశారు.

ఎస్‌ఓటి పోలీసులపై దాడి

జగద్గిరిగుట్ట: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్య కేసు నిందితుడు కరణ్‌సింగ్.. కూకట్‌పల్లి సిక్ బస్తీలోని భగవాన్‌సింగ్ అనే వ్యక్తి ఇంట్లో ఉన్నట్లు సమాచారం అందడంతో మాదాపూర్ ఎస్‌ఓటి పోలీసులు విజయ్, రాజు గురువారం మధ్యాహ్నం ఆ ఇంటిపై దాడి చేశారు. అప్పటికే పోలీసుల రాకను గమనించిన కరణ్ సింగ్ కత్తితో వారిపై దాడి చేసి పారిపోయాడు.. దాడిలో రాజు తలకు గాయం కావడంతో కూకట్‌పల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఛాతీపై తీవ్ర గాయాలైన విజయ్‌ను మాదాపూర్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై సమాచారం అందడంతో బాలానగర్ డీసీపీ సందీప్ గోనె, మాదాపూర్ ఎస్‌ఓటీ క్రైమ్ అడిషనల్ డీసీపీ నారాయణ, బాలానగర్ ఏసీపీ గంగారామ్, జగద్గిరిగుట్ట సీఐ సైదులు తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిందితుడి ఆచూకీ కోసం మూడు బృందాలను ఏర్పాటు చేశారు. కాగా గురువారం రాత్రికి నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వెన్నముద్ద కృష్ణుడిగా యాదాద్రీశుడు


వెన్నముద్ద కృష్ణుడి అలంకారంలో ఊరేగింపు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రాశస్త్యం కోసం నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం వెన్నముద్ద కృష్ణుడిగా.. రాత్రి వేళ కాళీయమర్ధనుడి అలంకారంలో శ్రీస్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మంగళ వాయిద్యాల మధ్య శ్రీస్వామి వారి సేవలను వైభవోపేతంగా ఊరేగించారు. అనంతరం అలంకార సేవలకు ఆచార్యులు హారతిచ్చి, శ్రీస్వామి వారి అలంకార విశిష్టతలను భక్తులకు వివరించారు.

చందనాల చీరకు వెండిపోగుల వందనం

- 90 గ్రాముల వెండితో పరిమళించే పట్టుచీర
- సిరిసిల్ల నేత కార్మికుడి అద్భుత సృష్టి


మగ్గంపై చీరను నేస్తున్న నల్ల విజయ్‌కుమార్. (ఇన్‌సెట్‌లో) చీర

సిరిసిల్ల: వెండిపోగులతో మెరిసిపోతోంది. పరిమళాలు వెదజల్లుతోంది. సిరిసిల్ల నేత కళాకారుడి చేయి మరో అద్భుతాన్ని సృష్టించింది.. వెండితో పరిమళించే సిరి చందనం పట్టుచీర సోయగాలొలుకుతోంది. అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నాలుగు దశాబ్దాల కిందటే నేసి ప్రపంచానికి సిరిసిల్ల చేనేత కళా వైభవాన్ని చాటిచెప్పిన నల్ల పరంధాములు తనయుడు నల్ల విజయ్‌కుమార్.. తాజాగా వెండిపోగులతో పరిమళించే పట్టు చీరను మగ్గంపై నేశాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తల్లి జ్యోతి వెండిపోగుల సిరిచందనం పట్టు చీరను ఆర్డర్ ఇచ్చారు. ఈ మేరకు విజయ్‌కుమార్ నెల పది రోజులపాటు శ్రమించి 90 గ్రాముల వెండితో పోగులను సిద్ధం చేసి, 27 రకాల పరిమళాలతో కూడిన నూలు పోగులతో పట్టు చీరను నేశాడు. 600 గ్రాముల బరువుతో, 48 ఇంచీల వెడల్పుతో ఐదున్నర మీటర్ల పొడవైన వెండిపోగుల చీరను సిద్ధం చేశాడు. కట్టుకోవడానికి వీలుగా ఉండే ఈ చీర తయారీకి రూ.45 వేలు ఖర్చయినట్లు నల్ల విజయ్‌కుమార్ తెలిపారు. చీరను కలెక్టర్ తల్లి జ్యోతికి అందజేస్తానని ఆయన గురువారం తెలిపారు.

క్లుప్తంగా...

హల్ద్వానీ రైల్వే భూముల్లో ఆక్రమణల తొలగింపుపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్ రాష్ట్రం హల్ద్వానీలోని రైల్వే శాఖకు చెందిన 29 ఎకరాల భూమిలోని ఆక్రమణల తొలగింపుపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ అంశాన్ని మానవీయ కోణంలో ఆలోచించాలని, 50 వేల మంది ప్రజలను ఒక్క రాత్రిలోనే ఖాళీ చేయించలేమని పేర్కొంది. సమస్యకు ఆచరణీయ పరిష్కారాన్ని కనుగొనాలని సూచించింది. సదరు భూమి తమదేనంటూ నివాసితులు వేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఏఎస్ ఓకాల ధర్మాసనం గురువారం విచారించింది. రైల్వే శాఖ అవసరాలను పరిగణనలోకి తీసుకుంటూనే ఆ భూమిలో ఉంటున్న వారి హక్కులను గుర్తించి, వారికి పునరావాసం కల్పించడానికి వీలుగా ఆచరణీయమైన ఏర్పాటు అవసరమని పేర్కొంది. ఆక్రమణలను వెంటనే తొలగించాలన్న ఉత్తరాఖండ్ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని ధర్మాసనం రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. వివాదాస్పద భూమిలో రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖలకు ఎంత భూమి ఉందో స్పష్టం చేయాలంది. ఈ అంశంపై తదుపరి విచారణను ఫిబ్రవరి 7వ తేదీకి వాయిదా వేసింది. హల్ద్వానీలోని బన్‌భూల్‌పురాలోని ఆక్రమిత రైల్వే జాగాలో ఉన్న నిర్మాణాలను వారం ముందుగా నోటీసులిచ్చి కూల్చివేయాలంటూ గత డిసెంబర్ 20వ తేదీన ఉత్తరాఖండ్ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. 1947లో దేశ విభజన సమయంలో పాక్‌కు వెళ్లిపోయిన వారి భూములను ప్రభుత్వం వేలం వేయగా తాము కొనుక్కున్నామంటూ నిర్వాసితులు వాదిస్తున్నారు. సదరు వివాదాస్పద భూమిలో ఉంటున్న 4,365 కుటుంబాల్లో 4 వేల ముస్లిం కుటుంబాలున్నాయని రైల్వే శాఖ అంటోంది.

వచ్చే జనవరి ఒకటికి రామ మందిరం సిద్ధం: షా

సబ్రూం(త్రిపుర): అయోధ్యలో శ్రీరామ మందిరం 2024 జనవరి ఒకటో తేదీ నాటికి సిద్ధమవుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. త్రిపురలోని సబ్రూంలో గురువారం ఆయన బీజేపీ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. గతంలో కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలు మందిరం అంశాన్ని కోర్టు పరిధిలోకి నెట్టివేశాయి. మోదీ ప్రధాని అయ్యాక సుప్రీం కోర్టు అనుమతించడంతో రామ మందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. 'రాహుల్ బాబా.. రామ మందిర నిర్మాణం 2024 జనవరి 1నాటికి సిద్ధమవుతుంది' అంటూ జోడో యాత్ర సాగిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్‌ని ఉద్దేశించి షా వ్యాఖ్యానించారు. 2024లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

ఢిల్లీ ఘటనలో మరో ఇద్దరి కోసం పోలీసుల గాలింపు

న్యూఢిల్లీ: ఢిల్లీలో అంజలీ సింగ్ అనే యువతిని కారుతో ఢీకొట్టి, లాక్కెళ్లిన ఘటనలో నిందితులను కాపాడేందుకు యత్నిస్తున్న ఇద్దరు వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. సీసీటీవీ ఫుటేజీ, కాల్ రికార్డులను బట్టి అశుతోష్, అంకుశ్ ఖన్నా అనే వారి ఆచూకీ కోసం వెదుకుతున్నారు. నిందితుల్లో ఒకరైన అమిత్ ఖన్నా సోదరుడే అంకుశ్ ఖన్నా. అమిత్ ఖన్నాను ఈ కేసు నుంచి బయట పడేసేందుకు వీరిద్దరూ ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, అంజలికి, నిందితులకు, ప్రత్యక్ష సాక్షులకు పరిచయం లేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. కంఝావాలా ఘటనలో నిందితులపై హత్యాభియోగాలు మోపాలంటూ వస్తున్న డిమాండ్లపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. అయితే ముందుగా, వారు ఉద్దేశపూర్వకంగా హత్యకు పాల్పడినట్లు నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కేసుపై ఏర్పాటైన 18 బృందాలు, అన్ని కోణాల్లో దర్యాప్తు సాగిస్తున్నాయని స్పెషల్ కమిషనర్ సాగర్ ప్రీత్ చెప్పారు.

విదేశీ ప్రయాణికుల్లో 11 రకాల ఒమిక్రాన్

న్యూఢిల్లీ: చైనాలో కోవిడ్ విజృంభణ నేపథ్యంలో అంతర్జాతీయ సర్వీసుల ద్వారా భారత్‌కు వస్తున్న విమాన, నౌకా ప్రయాణికులకు కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. అయితే డిసెంబర్ 24 నుంచి జనవరి మూడోతేదీ వరకు 19,227 మంది అంతర్జాతీయ ప్రయాణికుల నుంచి సేకరించిన శాంపిళ్లలో 124 శాంపిళ్లు కరోనా పాజిటివ్‌గా ఫలితాలొచ్చాయి. వీటిని జన్యుక్రమ విశ్లేషణకు పంపగా 40 శాంపిళ్ల ఫలితాలొచ్చాయి. వీటిలో 14 శాంపిళ్లలో ఎక్స్‌బీబీ రకం, మరోటి బీఎఫ్ 7.4.1 వేరియంట్ కరోనా వైరస్ బయటపడింది. ఇవి 11 రకాల ఒమిక్రాన్ ఉపవేరియంట్లు అని, భారత్‌లో గతంలోనూ వెలుగుచూశాయని, భయపడాల్సిన పనిలేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 24 నుంచి భారత సర్కార్ ప్రతీ అంతర్జాతీయ విమానంలో ర్యాండమ్‌గా 2 శాతం చొప్పున ప్రయాణికులకు ఆర్‌టీ-పీసీఆర్ టెస్ట్ చేస్తోంది. ఈ కాలంలో 124 మందికి పాజిటివ్ వచ్చింది.

ఒకే ఇంట్లో 8 మంది మృతి.. అందరికీ బుల్లెట్ గాయాలు

సాల్ట్‌లేక్ సిటీ: అమెరికాలోని ఉటాహ్ రాష్ట్రం ఈనాక్ పట్టణంలోని ఓ ఇంట్లో ఐదుగురు మైనర్లు సహా మొత్తం 8 మంది బుల్లెట్ గాయాలతో చనిపోయారు. వెల్ఫేర్ చెకింగ్ సందర్భంగా ఈ ఘోరం వెలుగులోకి వచ్చిందని పోలీసులు తెలిపారు. వారిని ఎవరు చంపారు? ఎందుకు చంపారు? వంటి వివరాలపై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై సాధారణ ప్రజానీకం ఎటువంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా వ్యక్తులు కొన్ని రోజులపాటు కనిపించకుండా ఉన్న సందర్భాల్లో పోలీసులు సంబంధిత ఇళ్లలో వెల్ఫేర్ చెక్ చేపడతారు.

జన భాగస్వామ్యంతోనే జల సంరక్షణ

కేవలం ప్రభుత్వ చర్యలే సరిపోవు



- ప్రజల్లో అవగాహన పెంచండి
- నీటి పంపకాలపై రాష్ట్రాలు దృష్టి పెట్టాలి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- భోపాల్‌లో రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రుల తొలి జాతీయ సదస్సు

న్యూఢిల్లీ: దేశంలో జల సంరక్షణ విషయంలో కేవలం ప్రభుత్వం తీసుకొనే చర్యలే సరిపోవని, ప్రజలందరి భాగసామ్యంతోనే అది సాధ్యమవుతుందని, ఆశించిన ఫలితాలు వస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. జల సంరక్షణ ఉద్యమంతో అనుసంధానమైతేనే ప్రజలకు ఇందులోని తీవ్రత, ప్రాధాన్యం తెలుస్తుందని అన్నారు. కార్యక్రమ ఉద్దేశం అర్థమైతే వారు దాన్ని సొంతం చేసుకుంటారని తెలిపారు. గురువారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో నిర్వహించిన రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రుల తొలి జాతీయ సదస్సును ఉద్దేశించి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, భాగస్వామ్యానికి నీరు ఒక కీలకాంశం కావాలని చెప్పారు. దేశంలో పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో నీటి పంపకాలపై ముందుగానే దృష్టి పెట్టాలని సూచించారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల మధ్య నడుమ దశాబ్దాలుగా జల వివాదాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

'వాటర్ విజన్-2047'

మన రాజ్యాంగ వ్యవస్థ ప్రకారం జలం అనేది రాష్ట్రాల పరిధిలోకి వస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ గుర్తుచేశారు. మనం నిర్దేశించుకున్న సమ్మిళిత లక్ష్యాల సాధనకు రాష్ట్రాలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే 25 ఏళ్లలో సాగించబోయే 'అమృతకాల' ప్రయాణంలో 'వాటర్ విజన్-2047' అనేది అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎక్కువ శాతం పనులు జల సంరక్షణ దిశగానే జరగాలని చెప్పారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మంత్రులకు సూచించారు. ప్రజలతోపాటు సామాజిక సంస్థలు, పౌర సంస్థలు సైతం జల సంరక్షణ ఉద్యమాల్లో పాలుపంచుకోవాలని కోరారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం అంటే దాని అర్థం ప్రభుత్వపరంగా పారదర్శకత తగ్గించడం కాదన్నారు. అలాగే మొత్తం బాధ్యతను ప్రజలపై మోపడం కాదని తేల్చిచెప్పారు. జల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడానికి స్థానికంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ప్రతి జిల్లాలో అమృత సరోవరాలు

ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో 75 అమృత సరోవరాలు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని నరేంద్ర మోదీ తెలియజేశారు. ఇప్పటికే 25,000 సరోవరాలు నిర్మించినట్లు చెప్పారు. ప్రతి సరోవరం కనీసం ఎకరం వైశాల్యంలో ఉంటుందని, ఇందులో 10,000 క్యూబిక్ మీటర్ల నీటిని నిల్వ చేయొచ్చని అన్నారు. జల సంరక్షణకు జియో-సెన్సింగ్, జియో-మ్యాపింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలు వాడుకోవాలని సూచించారు. టెక్నాలజీ-పరిశ్రమలు-స్టార్టప్‌లను అనుసంధాస్తే చక్కటి ఫలితాలు వస్తాయన్నారు. నమామి గంగా మిషన్ తరహాలో నదుల ప్రక్షాళనకు రాష్ట్రాలు సైతం నడుం బిగించాలని ప్రధానమంత్రి విన్నవించారు. నదుల, జల వనరులను కాపాడుకోవాలన్నారు. ప్రతి రాష్ట్రంలో చెత్త నిర్మూలన, మురుగునీటి శుద్ధి కోసం నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. తాజా నీటిని సంరక్షించుకోవడం, మురుగునీటిని శుద్ధి చేసి మళ్లీ వాడుకోవడం పర్యావరణానికి చాలా మేలు చేస్తుందని వివరించారు. 'ప్రైమ్ మినిస్టర్ అగ్రికల్చర్ ఇరిగేషన్ స్కీమ్' కింద 70 లక్షల హెక్టార్లకుపైగా భూమిని సూక్ష్మ సేద్యం పరిధిలోకి తీసుకొచ్చామని ప్రధాని మోదీ తెలిపారు.

కాలర్ పట్టుకొని తోశారు

- మేఘన్ విషయంలో ప్రిన్స్ విలియం నాపై చేయిచేసుకున్నారు
- ఆత్మకథ స్పేర్‌లో ప్రిన్స్ హ్యారీ సంచలన విషయాలు



లండన్: భార్య మేఘన్ ప్రేమ కోసం బ్రిటన్ రాచరిక భోగాలనే వదులుకున్న ప్రిన్స్ హ్యారీ త్వరలో విడుదల కానున్న తన ఆటోబయోగ్రఫీ ''స్పేర్'' పుస్తకంలో సంచలన విషయాలు వెల్లడించారు. భార్య మేఘన్ విషయంలో సోదరుడు ప్రిన్స్ విలియం తనపై చేయి చేసుకున్నారని చెప్పారు. 2019లో లండన్‌లో తమ నివాసంలో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణను తన ఆత్మకథలో వివరంగా రాసుకొచ్చారు. మేఘన్‌కు మద్దతుగా ఉన్నందుకు విలియమ్స్ తన కాలర్ పట్టుకొని కిందకి తోసేశారని, దీంతో తనకు గాయాలయ్యాయని హ్యారీ ఆ పుస్తకంలో రాసినట్టుగా అంతర్జాతీయ మీడియా కథనాలు ప్రచురించింది. అమెరికా నటి మేఘన్ మార్కెల్‌ను ప్రిన్స్ హ్యారీ ప్రేమించి పెళ్లి చేసుకోవడంతో రాచకుటుంబంలో విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. 'మేఘన్‌కు సభ్యత సంస్కారం లేవని, చాలా కఠినంగా వ్యవహరిస్తుందని విలియం మాటలు తూటాల్లా విసిరారు. దీంతో నేను కూడా విలియంపై అరిచాను. రెచ్చిపోయిన విలియం మెరుపు వేగంతో నా మీదకి వచ్చారు. నా కాలర్ పట్టుకొని తోశారు. నా మెడ గట్టిగా పట్టుకొని నేల మీదకి విసిరికొట్టారు. శునకాలకి ఆహారం పెట్టే ఒక గిన్నెపై నేను వెళ్లి పడ్డాను. దీంతో నా వీపు మీద గాయాలయ్యాయి'' అని రాసుకొచ్చారు. మేఘన్ రాకతో వచ్చిన విభేదాలకు, ఘర్షణలకు సంబంధించి విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఈ నెల 10న పుస్తకం విడుదల కానుంది. పుస్తకం విడుదలైతే రాచకుటుంబంలో ఈ పుస్తకం ఇంకెన్ని ప్రకంపనలు సృష్టిస్తుందా అన్న అనుమానాలున్నాయి.

మరో విమాన ప్రయాణికుడి అమానవీయ ఘటన

న్యూఢిల్లీ: నవంబర్ 26న విమానంలో వృద్ధ మహిళా ప్రయాణికురాలిపై ఓ తాగుబోతు మూత్ర విసర్జన చేసిన ఘటన మరువకముందే అదే తరహా మరో ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ఘటనలో మహిళా ప్రయాణికురాలి బ్లాంకెట్‌పై తాగుబోతు ప్రయాణికుడు మూత్ర విసర్జన చేశాడు. డిసెంబర్ ఆరో తేదీన పారిస్ నుంచి ఢిల్లీకి వస్తున్న ఎయిర్ ఇండియా విమానం(ఫ్లైట్ నంబర్ 142) మార్గమధ్యంలో ఉండగా ఈ అమానవీయ సంఘటన చోటుచేసుకుంది. విషయం తెల్సుకున్న విమాన పైలట్ వెంటనే ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయ ఏటీసీకి ఫిర్యాదుచేశారు. విమానం ఉదయం ల్యాండ్‌కాగానే అతడిని కేంద్ర పారిశ్రామిక భద్రతా (సీఐఎస్‌ఎఫ్)బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. అయితే, అతను వెంటనే లిఖితపూర్వకంగా మహిళా ప్రయాణికురాలికి క్షమాపణలు చెప్పడంతో అతడిని వదిలేశారు. ఇద్దరు ప్రయాణికుల మధ్య రాజీ కుదరడంతో ఈ వివాదం అంతటితో ముగిసిందని ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు.



ఇది బ్లూఫిన్ టూనా చేప. బరువు 212 కిలోలు. గురువారం జపాన్ రాజధాని టోక్యోలోని టొయొసు మార్కెట్‌లో జరిగిన ఈ సీజన్ ప్రారంభ వేలంలో రూ.2.25 కోట్లు పలికింది.

విదేశీ వర్సిటీలకు మరింత స్వేచ్ఛ

- భారత్‌లో క్యాంపస్ ఏర్పాటుకు తొలిసారిగా అనుమతి
- ప్రవేశాలు, ఫీజులు, నిధులు స్వదేశానికి తరలింపునకూ ఓకే
- ముసాయిదా నిబంధనలను వెల్లడించిన యూజీసీ



సాక్షి, హైదరాబాద్: విదేశీ విశ్వవిద్యాలయాలకు భారత ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది. తొలిసారిగా అవి భారత్‌లో సొంతంగా క్యాంపస్‌లు నెలకొల్పేందుకు, అడ్మిషన్ల విధానం, ఫీజుల విషయంలో సొంత నిర్ణయాలు తీసుకునేందుకు వెసులుబాటు కల్పించనుంది. నిధులను సొంత దేశాలకు బదిలీచేసేందుకు తదితర నిబంధనలకు సంబంధించిన ముసాయిదా ప్రతిని యూజీసీ విడుదలచేసింది. అయితే ఆ వర్సిటీలో భారతీయ క్యాంపస్‌లలో కోర్సులకు సంబంధించి ప్రత్యక్ష తరగతులను నిర్వహించాలి. ఆన్‌లైన్, దూర విద్యా కోర్సులకు అనుమతి ఇవ్వబోమని యూజీసీ చైర్‌పర్సన్ జగదీశ్ చెప్పారు. విదేశీ వర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థ(హెచ్‌ఈఐ)లు ఇక్కడ క్యాంపస్‌ల ఏర్పాటు అనుమతులను యూజీసీ నుంచి తీసుకోవాలి. సంబంధిత వర్గాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాక ఈ నెల చివరికల్లా తుది నిబంధనలను రూపొందిస్తారు. ముసాయిదా ప్రకారం విదేశీ వర్సిటీలు తమ కోర్సుల్లో విద్యార్థుల అడ్మిషన్లు, ఫీజులపై స్వీయనియంత్రణ కల్గిఉంటాయి.

నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా..

'నూతన జాతీయ విద్యావిధానంలో పేర్కొన్నట్లు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల స్థాయి విద్యాబోధన భారతీయ విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. విదేశీ వర్సిటీలతో అనువైన ఫీజుల్లోనే అంతర్జాతీయ విద్యార్హతలు మన విద్యార్థులకు దఖలు పడతాయి. వర్సిటీలు స్వదేశానికి పంపే నిధులకు ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్(ఫెమా) చట్టం ,1999 వర్తిస్తుంది. ఇవి తమ వార్షిక ఆడిట్ యూజీసీకి సమర్పిస్తారు' అని జగదీశ్ అన్నారు.

ర్యాంకులు పొందిన వాటికే..

అత్యున్నత ర్యాంక్ పొందిన వర్సిటీలకే భారత్‌లో క్యాంపస్‌ల ఏర్పాటుకు అవకాశమిస్తారు. అంటే ప్రపంచం మొత్తంలో 500 లోపు ర్యాంక్ లేదా సబ్జెక్ట్ వారీగా ర్యాంక్ లేదా స్వదేశంలో దిగ్గజ వర్సిటీలకే భారత్‌లో అవకాశం దక్కనుంది. తర్వాత వాటి దరఖాస్తుల పరిశీలనకు యూజీసీ స్థాయీ సంఘాన్ని ఏర్పాటుచేయనుంది. దేశంలో న్యాక్ గ్రేడ్ పొందిన దేశీ వర్సిటీల సమన్వయంతో ఈ వర్సిటీలు పనిచేసే వీలుంది. దరఖాస్తు చేసిన 45 రోజుల్లో అనుమతులు లభిస్తాయి. కమిషన్ సూచించిన సమయంలో క్యాంపస్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఫీజులు తదితర వివరాలను ప్రవేశాలకు 60 రోజుల ముందే వెల్లడించాలి. సరైన సంస్కరణలతో దేశీయ వర్సిటీలను బలోపేతం చేయాల్సిందిపోయి విదేశీ వర్సిటీలు తేవడం ఏంటని కొందరు విద్యావేత్తలు పెదవివిరిచారు. 'ప్రభుత్వ నూతన విద్యా విధానం ప్రకారం యూజీసీకే చరమగీతం పాడనున్నారు. అలాంటి యూజీసీ నేతృత్వంలో సంస్కరణలు తేవడం ఏంటి ?. గతంలో విదేశీ వర్సిటీల బిల్లును 2012-13 కాలంలో యూపీఏ సర్కార్ తెచ్చేందుకు సిద్ధమైంది. కానీ ఆనాడు దీనిని బీజేపీ, వామపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. రాజ్యసభ స్థాయీ సంఘం కూడా తప్పుబట్టింది. ఇప్పుడు అదే బీజేపీ ఇప్పుడు ఇలా విరుద్ధంగా వ్యవహరిస్తోంది' అని విద్యావేత్త, ఢిల్లీ యూనివర్సిటీ మహిళా ప్రొఫెసర్ అభా దేవ్ అన్నారు.

కేన్సర్‌ను 'కత్తి'లా పసిగట్టేస్తుంది..!

లండన్: బ్రిటన్ శాస్త్రవేత్తలు కొత్తగా అభివృద్ధి చేసిన ఇంటెలిజెంట్ సర్జికల్ నైఫ్ (ఐనైఫ్) గర్భాశయ కేన్సర్‌ను సెకండ్లలో పసిగట్టేస్తోంది. కేన్సర్ చికిత్సలను త్వరితగతిని అందించి ఎందరో మహిళల ప్రాణాలను కాపాడే అవకాశం ఐనైఫ్ ద్వారా వచ్చిందని లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీలో వైద్య నిపుణులు చెప్పారు. సాధారణంగా మహిళల్లో వచ్చే ఎండోమెట్రియల్ కేన్సర్‌ను గుర్తించడం ఆలస్యం అవడం వల్ల దుష్ప్రభావాలు అధికం. అయితే ఈ ఐనైఫ్‌తో సెకండ్లలో కేన్సర్‌ను గుర్తించగలుగుతున్నట్టు అధ్యయనంలో వెల్లడైంది. వివరాలను జర్నల్ కేన్సర్స్‌లో ప్రచురించారు. గర్భాశయ కేన్సర్‌తో బాధపడుతున్నట్టు అనుమానం ఉన్న 150 మంది మహిళల టిష్యూ శాంపిల్స్‌ను సర్జికల్ కత్తితో పరీక్షిస్తే సెకండ్లలోనే ఫలితాలు వచ్చాయి. ఇప్పటివరకు అనుసరిస్తున్న సాధారణ పద్ధతిలో చేసిన ఫలితాలతో పోల్చి చూస్తే 86% ఫలితాలు సరిగ్గా ఉన్నాయని ఆ అధ్యయనం వివరించింది.

రష్యా కాల్పుల విరమణ

కీవ్: ఉక్రెయిన్‌లో ఈ వారాంతంలో 36 గంటలపాటు కాల్పుల విరమణ పాటించాలని రష్యా అధినేత పుతిన్ తమ సైన్యానికి ఆదేశాలు జారీ చేశారు. ఉక్రెయిన్ భూభాగంలో ఎలాంటి దాడులు చేయొద్దని గురువారం పేర్కొన్నారు. రష్యాలో ఆర్థోడాక్స్ క్రిస్మస్ సెలవు నేపథ్యంలో పుతిన్ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. ప్రాచీన జూలియన్ క్యాలెండర్ ప్రకారం రష్యన్ ఆర్థోడాక్స్ చర్చి ఆధ్వర్యంలో ప్రతిఏటా జనవరి 7వ తేదీన క్రిస్టమస్ వేడుకలు జరుగుతాయి. ఉక్రెయిన్‌లోని కొందరు ఇదే రోజు క్రిస్మస్ జరుపుకుంటారు. కాగా, ఉక్రెయిన్‌తో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని పుతిన్ పునరుద్ఘాటించారు. కానీ, చర్చలు జరగాలంటే ఒక షరతు విధించారు. ఉక్రెయిన్ నుంచి తాము స్వాధీనం చేసుకున్న భూభాగాలను రష్యాకు చెందిన భూభాగాలుగానే జెలెన్‌స్కీ ప్రభుత్వం అంగీకరించాలని తేల్చిచెప్పారు. ఈ ఒక్క షరతుకు ఒప్పుకుంటే ఉక్రెయిన్‌తో చర్చలకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టంచేశారు. తూర్పు, దక్షిణ ఉక్రెయిన్‌లోని పలు కీలక ప్రాంతాలను రష్యా బలప్రయోగంతో ఆక్రమించుకున్న సంగతి తెలిసిందే. డొనెట్స్క్, లుహాన్స్క్, జపొరిఝూజియా, ఖేర్సన్‌లలో రష్యా సైన్యం పాగా వేసింది.

డిజిటల్ ఇండియా విజన్‌కు సహకరిస్తాం

- మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల హామీ
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ

న్యూఢిల్లీ: 'డిజిటల్ ఇండియా విజన్' సాకారం కావడానికి తమ వంతు సహకారం అందిస్తామని మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల హామీ ఇచ్చారు. గురువారం ఢిల్లీలో ప్రధాని మోదీతో ఆయన సమావేశమయ్యారు. పలు కీలక అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారు. ప్రధాని మోదీతో తన భేటీ చక్కగా జరిగిందని సత్య నాదెళ్ల వెల్లడించారు. డిజిటల్ ఇండియా విజన్ మొత్తం ప్రపంచానికి వెలుగును చూపుతుందని ఉద్ఘాటించారు. తర్వాత మోదీ ట్వీట్ చేశారు. దేశ యువత నూతన ఆలోచనలు భూగోళాన్ని ప్రభావితం చేయగలవని వివరించారు.

డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడులు

బెంగళూరు: భారత్‌లో డేటా సెంటర్ల ఏర్పాటు కోసం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నామని నాదెళ్ల తెలిపారు. తమ దారిలోనే ఇతర కంపెనీలు సైతం నడుస్తాయని, భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తాయని భావిస్తున్నట్లు వెల్లడించారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో 'ఫ్యూచర్ రెడీ టెక్నాలజీ సదస్సు'లో సత్య నాదెళ్ల పాల్గొన్నారు. అనంతరం మీడియాతో భారతదేశ టెక్నాలజీ స్టోరీ విస్తరించడానికి సహకరిస్తామని వ్యాఖ్యానించారు. టెక్నాలజీలో భారత్ అద్భుత విజయాలు సాధిస్తోందని ప్రశంసించారు. ఇది రాయాల్సిన, మాట్లాడుకోవాల్సిన చరిత్ర అని చెప్పారు.

బిర్యానీ.. సౌతిండియా 'టిఫిన్' కాదు: సత్య నాదెళ్ల

ఆధునిక కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత సాఫ్ట్‌వేర్‌తో పనిచేసే చాట్ రోబో 'చాట్‌జీపీటీ'లో తనకు ఎదురైన అనుభవాన్ని సత్య నాదెళ్ల వివరించారు. దక్షిణ భారతదేశంలో బాగా పేరున్న టిఫిన్ల గురించి తాను అడగ్గా.. ఇడ్లీ, దోశ, వడతోపాటు బిర్యానీ అంటూ చాట్ జీపీటీ బదులిచ్చిందని అన్నారు. తాను హైదరాబాదీనని, తన పరిజ్ఞానాన్ని తక్కువ అంచనా వేయొద్దని, బిర్యానీ అనేది టిఫిన్ కాదను తాను గట్టిగా చెప్పడంతో చాట్‌జీపీటీ క్షమాపణ కోరిందని వెల్లడించారు.

హెచ్1బీ వీసా ఫీజుల బాదుడు !

కొత్త ప్రతిపాదనలు ముందుకు తెచ్చిన అమెరికా



వాషింగ్టన్: హెచ్-1బీ వీసా దరఖాస్తు సహా అన్ని ఇమిగ్రేషన్ ఫీజుల మోత మోగించేందుకు అమెరికా సిద్ధమైంది. సంబంధిత ప్రతిపాదనలను అమెరికా ఇమిగ్రేషన్ విభాగం ప్రచురించింది. 460 డాలర్లుగా ఉన్న హెచ్-1బీ వీసా దరఖాస్తు ధరను ఏకంగా 780 డాలర్లకు పెంచాలని ప్రతిపాదించారు. వలసేతర వీసాల్లో భారతీయులు అధికంగా పొందే హెచ్-1బీ వీసా దరఖాస్తు ధరను భారీగా పెంచడంపై విమర్శలొస్తున్నాయి. మిగతా ఫీజులూ దాదాపు ఇలాగే భారీగా ఉన్నాయి. ఓ-1 దరఖాస్తు ధర 460 డాలర్ల నుంచి 1,055 డాలర్లకు పెంచనున్నారు. అంటే ఒక్కసారిగా 229 శాతం పెంపు అన్నమాట. ఎల్-1 ధరను 460 డాలర్ల నుంచి ఏకంగా 1,385 డాలర్లకు పెంచేయనున్నారు. అంటే ఏకంగా 332 శాతం పెరుగుదల. హెచ్-2బీ దరఖాస్తుల ధర 460 డాలర్ల నుంచి ఒకేసారి 1,080 డాలర్లకు చేరుకోనుంది. అయితే, ఇవి ప్రతిపాదనలు మాత్రమేనని మార్చి ఏడో తేదీలోపు వచ్చే ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ధరలు మారుస్తామని అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం వివరణ ఇచ్చింది. ఒకవేళ ఈ ఫీజులు అమలైతే అదనంగా తీసుకునే బయోమెట్రిక్ సేవల ఫీజును రద్దుచేస్తామని ప్రతిపాదించింది. 2016 ఏడాది నుంచి ఇప్పటివరకు ఫీజులు పెంచలేదని అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం వాదిస్తోంది.

వీసా ఎదురుచూపులు తగ్గించేందుకు కృషి

భారత్‌లో వీసా దరఖాస్తు దారులు ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా చేస్తామని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి నెడ్ ప్రైస్ చెప్పారు. సుదీర్ఘ కాలం వీసా కోసం ఎదురుచూస్తున్న వారి ఆందోళనను తాము అర్థం చేసుకుంటామన్నారు. వీసా దరఖాస్తుల పరిశీలనను చకచకా పూర్తి చేసేందుకుగాను విదేశాంగ శాఖ సిబ్బంది పెంచామన్నారు.

టోక్యోకు టాటా..!


- రాజధాని వీడే ప్రజలకి జపాన్ ప్రభుత్వం భారీ తాయిలాలు
- జనాభా అన్ని ప్రాంతాలకు విస్తరిస్తేనే అభివృద్ధి అంటున్న కిషిదా సర్కార్

రాజధాని పొమ్మంటోంది. తట్టాబుట్టా సర్దుకొని వెళ్లిపొమ్మంటోంది. జన ప్రభంజనం ఒక్కచోటే ఉంటే ఆ ఊరు తట్టుకోవడం కష్టం. అందుకే జపాన్ ప్రభుత్వం టోక్యోకు టాటా చెప్పేవారికి భారీగా తాయిలాలు ఆశ చూపిస్తోంది జపాన్ రాజధాని టోక్యోకు ఎందుకీ పరిస్థితి వచ్చింది...? డబ్బులిచ్చి మరీ జనాన్ని వెళ్లిపొమ్మని చెప్పడానికి కారణాలేంటి ?

జపాన్ రాజధాని విడిచి పెట్టి వెళ్లిపోవడానికి అక్కడ ప్రభుత్వం భారీ తాయిలాలు ప్రకటించింది. కుటుంబంలోని పిల్లలకి ఒక్కొక్కరికి 10 లక్షల యెన్ అంటే భారత్ కరెన్సీలో రూ. 6 లక్షలు ఇస్తామని ఆశ చూపిస్తోంది. జపాన్‌లో జనాభా దేశవ్యాప్తంగా సమానంగా విస్తరించలేదు. అక్కడ నగరాలు, పట్టణాలు జనంతో కిక్కిరిసిపోతూ ఉంటే గ్రామీణ ప్రాంతాలు, చిన్న పల్లెలు ఖాళీ అయిపోతున్నాయి. టోక్యో, ఒసాకా వంటి నగరాల్లో జనాభా అంతకంతకూ పెరిగిపోతోంది.అందుకే కుటుంబంలో ఒక్కో పిల్లకి 10 లక్షల యెన్‌లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జపాన్‌కు ఇదేమీ కొత్త కాదు. మూడేళ్ల క్రితం కూడా టోక్యోకి టాటా చెప్పండంటూ 3 లక్షల యెన్‌లు ప్రకటించింది. జనాలెవరూ రాజధాని వీడి వెళ్లడానికి ఇష్టపడ లేదు. దీంతో ఈ సారి ఇన్సెంటివ్‌ను భారీగా పెంచి 10 లక్షల యెన్‌లు చేసింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో వెళ్లేవారికి ఈ ఇన్సెంటివ్ లభిస్తుంది.

టోక్యో ఉక్కిరిబిక్కిరి

జపాన్‌లో నానాటికి జనాభా తగ్గిపోతోంది. 1973 నుంచి ఆ దేశంలో జననాల రేటు తగ్గుతూ వస్తోంది. 2020-21 సంవత్సరంలో రికార్డు స్థాయిలో 6,44,000 మంది తగ్గిపోయారు. 2022 సంవత్సరం జనవరి-సెప్టెంబర్ మధ్య జపాన్‌లో కొత్తగా 5,99,636 మంది జన్మించారు. ప్రస్తుతం జపాన్ జనాభా 12.50 కోట్లు కాగా టోక్యో జనాభా 1.5 కోట్లు. దేశంలో మొత్తం జనాభాలో ఇంచుమించు 10శాతం మంది రాజధానిలోనే నివసిస్తున్నారు.



ఈ నగరంలో జన సాంద్రత (చదరపు కి.మీ. నివసించేవారి సంఖ్య) 6,158గా ఉంది. జపాన్‌లో జనాభా తగ్గుతూ వస్తూ ఉంటే టోక్యోలో జనాభా గత దశాబ్దంలో 16% పెరిగింది. యువతీ యువకులు ఉపాధి అవకాశాల కోసం రాజధాని బాట పడుతున్నారు. దీంతో ఇసుక వేస్తే రాలనంత జనాభాతో టోక్యో ఊపిరి పీల్చుకోలేకపోతోంది. 2020 నాటికి జపాన్‌లో జనాభాలో 52% మంది మూడు అతి పెద్ద మెట్రోపాలిటన్ ప్రాంతాలైన టోక్యో, ఒసాకో, నగోయాలో నివసిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో 48% మంది ఉన్నారు.2050 నాటికి ఈ మూడు నగరాల్లోనే 57% మంది నివసిస్తారని, మిగిలిన ప్రాంతాల్లో 43% మంది ఉంటారని అంచనాలున్నాయి. దేశ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక కార్యకలాపాలన్నింటికీ టోక్యో కేంద్ర బిందువుగా ఉంది. దీంతో ఈ ప్రాంతంలో భూకంపం వచ్చే ముప్పు పెరిగిపోయిందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే జనాభా అన్ని ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ప్రభుత్వ ప్రయత్నాలు ఫలిస్తాయా ?

దేశంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలంటే జనాభా వికేంద్రీకరణ కూడా జరగాలని జపాన్ అధ్యక్షుడు ఫ్యూమియో కిషిదా భావిస్తున్నారు. అందుకే పల్లెలకు, ఇతర పట్టణాలకు కూడా ప్రజలు వెళ్లి స్థిరపడేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పల్లెల్లో కాలుష్యం లేని జీవనంపై ప్రత్యేకంగా వీడియోలు విడుదల చేస్తూ జనాన్ని ఆకర్షించే ప్రయత్నాలు ప్రభుత్వం చేస్తోంది. ప్రతీ ఒక్కరూ రాజధానిలో మకాం ఉంటే జరిగే అనర్థాల గురించి ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నం చేస్తోంది. పిల్లల సంరక్షణ, విద్య, ఆరోగ్యంతో పాటు నగరాల్లో ఉంటే సదుపాయాలన్నీ పల్లెల్లో కల్పిస్తోంది. ఏ ప్రాంతంలోనైనా జనం ఉంటేనే అభివృద్ధి జరుగుతుంది. కరోనా తర్వాత ఉద్యోగాలన్నీ వర్క్ ఫ్రమ్ హోమ్ ఎక్కువ కావడంతో టోక్యోలో ఉండాల్సిన పని లేదని, ఇతర చోట్లకు వెళ్లాలంది. 2019లో 71 కుటుంబాలు టోక్యోని వీడి వెళితే, 2021లో 1184 కుటుంబాలు ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. 2027 నాటికి ఏడాది 10 వేల కుటుంబాలు మకాం మారుస్తాయని అంచనాలు వేస్తోంది.

బీజింగ్‌లో కోవిడ్ బీభత్సం

బీజింగ్: కరోనా చైనాను చిదిమేస్తోంది. బీజింగ్‌లో కోవిడ్ రోగులు వెల్లువలా ఆస్పత్రులకు తరలివస్తున్నారు. నగరంలోని చుయాంగ్‌లియూ ఆస్పత్రిలో పరిస్థితే అక్కడి ఆరోగ్య అత్యవసర పరిస్థితికి దర్పణం పడుతోంది. ఆస్పత్రిలోని బెడ్లు అన్నీ కోవిడ్ వృద్ధ రోగులతో నిండిపోయాయి. అయినా రోగులు వస్తుండటంతో బంధువులు వేచి ఉండే గదుల్లో, కారిడార్‌లలో వైద్యం చేస్తున్నారు. ఉన్న అన్ని వీల్‌చైర్లలో రోగులు కూర్చొనే ఆక్సిజన్ వెంటిలేషన్‌తో శ్వాసిస్తున్నారు. మరింత అత్యవసర వైద్యసేవలు అవసరమైన రోగులకు చికిత్సచేయడంలో వైద్యులు, నర్సులు మునిగిపోయారు. జీరో కోవిడ్ పాలసీతో కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు శతథా ప్రయత్నించి చైనా చేతులెత్తేయడంతో దేశంలో వైద్యారోగ్య పరిస్థితి దయనీయంగా తయారైంది. అత్యవసరమైతే తప్ప సొంతూర్లకు రావొద్దని అక్కడి హునాన్‌ప్రావిన్స్‌లోని షావోయాంగ్ కౌంటీ, అన్‌హుయి ప్రావిన్స్‌లోని షాయూగ్జియాన్ కౌంటీలతోపాటు గన్సు ప్రావిన్స్‌లోని క్వింగ్‌యాంగ్ తదితర నగర పాలనాయంత్రాంగాలు ప్రజలను హెచ్చరించాయి. చైనాలో వైద్య అత్యయక స్థితిపై వాస్తవిక సమాచారం అందితే ఇతర దేశాలు సరైన విధంగా సమాయత్తం అయ్యేందుకు వీలుంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) అధ్యక్షుడు టెడ్రోస్ బుధవారం హితవుపలికారు.

క్లుప్తంగా...

కొత్త వైద్య కళాశాలలకు రూ.34.38 కోట్లు

సాక్షి, హైదరాబాద్: కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.34.38 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు గురువారం పాలనాపరమైన ఆమోదం తెలుపుతూ వైద్య, ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సిరిసిల్ల, కామారెడ్డి, వికారాబాద్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న కొత్త వైద్య కళాశాలల నిర్మాణానికి ఖర్చు చేయనున్నారు.

పలు కోర్సులకు నోటిఫికేషన్ విడుదల

సాక్షి, హైదరాబాద్: బ్యాచిలర్ ఆఫ్ నర్సింగ్ (బీఎస్సీ), పోస్టు బేసిక్ బ్యాచిలర్ ఆఫ్ నర్సింగ్ (పోస్ట్ బీఎస్సీ) బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపి (బీపీటీ) కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఎస్సీ కోర్సు నాలుగేళ్లు, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ కోర్సు రెండేళ్లు, బీపీటీ కోర్సుల సీట్ల ఖాళీల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచారని పేర్కొంది. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి ఈనెల 8వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చునని వివరించింది. మరిన్ని వివరాలకు www.knruhs.telangana.gov.in చూడాలని సూచించింది.

ఆయుష్ పీజీ వైద్య సీట్ల భర్తీకి దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఆయుష్ పీజీ వైద్య సీట్ల భర్తీకి కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏఐఏపీజీఈటీ-2022 పరీక్షలో అర్హత సాధించిన వారు దరఖాస్తుకు అర్హులని స్పష్టం చేసింది. పీజీ ఆయుర్వేదం, హోమియో, యునానీ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుండి శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఈనెల 13వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. అర్హత, మరింత సమాచారం కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలని విశ్వవిద్యాలయం సూచించింది.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల దరఖాస్తులకు గడువు 12

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య సంచాలకుల (డీఎంఈ) పరిధిలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తుల గడువును మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు పొడిగించింది. గురువారంతో దరఖాస్తుల గడువు ముగియనుండగా, ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు సభ్య కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు రిలయన్స్ శిక్షణ

శిక్షణ కాలంలో ఉపకార వేతనం
రిలయన్స్‌తో ఇంటర్ బోర్డ్ ఎంవోయూ



సాక్షి, హైదరాబాద్: ఇంటర్ విద్యార్థులకు వృత్తిపరమైన శిక్షణ కోసం రిలయన్స్, ఇంటర్ బోర్డ్ మధ్య గురువారం అవగాహన ఒప్పందం జరిగింది. ఇంటర్ ఒకేషనల్ కోర్సులు చదివేవారితోపాటు, రెగ్యులర్ విద్యార్థులూ ఆసక్తి ఉంటే ఇందులో చేరవచ్చని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ ప్రభుత్వ కాలేజీల ప్రిన్సిపల్స్‌కు సూచించారు. రిటైల్ మార్కెటింగ్‌లో ఆరునెలల కాల పరిమితితో రిలయన్స్ ఈ శిక్షణ నిర్వహిస్తుంది. ఆన్‌లైన్‌లో జరిగే ఈ శిక్షణకు ప్రిన్సిపాళ్ల ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్ బోర్డ్ సూచించింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తక్షణం ఉపాధి అందించే ఉద్దేశంతో ఒకేషనల్‌లో దీన్ని ప్రవేశపెట్టినట్టు అధికారులు తెలిపారు. శిక్షణ కాలంలో రిలయన్స్ నెలకు రూ.4వేల ఉపకార వేతనం ఇస్తుందని అధికారులు వివరించారు. మార్కెటింగ్‌లో మెళకువలు, వ్యాపార విధానాలు నేర్పడం ఈ కోర్సు ఉద్దేశమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చేరువలో మాల్స్, రిటైల్ మార్కెటింగ్ వ్యవస్థ చొచ్చుకొస్తున్న నేపథ్యంలో వాటికి అనుగుణంగా ఈ శిక్షణ ఇస్తారు.

నేడు, రేపు అర్చక పరీక్షలు

శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో పరీక్షా కేంద్రం

బంజారాహిల్స్: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 6, 7 తేదీల్లో అర్చక ఆగమ పరీక్షలు జరగనున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో అర్చక పరీక్షలు జరగగా తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. హైదరాబాద్ పరిధిలో పరీక్షా కేంద్రాన్ని శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. మొత్తం 260 మంది ఈ పరీక్షలు రాయనున్నారు. అర్చక పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులంతా సంప్రదాయ దుస్తులతో హాజరుకావాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. 40 ఏళ్ళ వయసు పైబడిన వారికి రాత పరీక్ష లేకుండా కేవలం మౌఖిక పరీక్ష మాత్రమే ఉంటుంది. అర్చక పరీక్షలు తెలుగు, సంస్కృతం, హిందీ భాషల్లో మాత్రమే రాయాల్సి ఉంటుందని ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావు లేదని సూచించారు.

సాధారణ స్థితిలోనే ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలోనే నమోదవుతున్నాయని, ఒకట్రెండు చోట్ల సాధారణం కంటే 2 డిగ్రీ సెల్సియస్ నుంచి 4 డిగ్రీ సెల్సియస్ మేర అధికంగా నమోదవుతున్నట్లు వివరించింది. గురువారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే గరిష్ట ఉష్ణోగ్రత భద్రాచలంలో 32.6 డిగ్రీ సెల్సి యస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 17.0 డిగ్రీ సెల్సియస్‌గా నమోదయ్యాయి. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో పొడివాతావరణమే ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	28.0	17.2	ఖమ్మం	32.0	21.0
భద్రాచలం	32.6	22.0	మహబూబ్‌నగర్	30.1	19.6
హకీంపేట్	27.8	18.6	మెదక్	30.6	17.0
దుండిగల్	29.0	19.2	నల్లగొండ	29.5	18.0
హనుమకొండ	29.0	20.0	నిజామాబాద్	30.0	20.0
హైదరాబాద్	28.8	19.9	రామగుండం	30.0	19.6

● ఉదయాన్నే ఇలా..



ఆదిలాబాద్ -హైదరాబాద్ నాలుగు వరుసల ప్రధాన రహదారి పొగమంచుతో కమ్ముకుంది. రోజూ మధ్యాహ్నం వరకు పొగమంచు ఉంటోంది. దీంతో దారి కనిపించక వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. గురువారం దేవాపూర్ చెక్‌పోస్ట్ వద్ద కన్పించిన దృశ్యమిది. -సాక్షి ఫోటోగ్రాఫర్, ఆదిలాబాద్

‘పోలీసులకు ఆరోగ్య రక్ష’

ప్రత్యేకంగా హెల్త్ ప్రొఫైల్ నిర్వహణ
- ప్రతీ ఉద్యోగికి ఏకీకృత నంబర్‌తో డిజిటల్ హెల్త్ కార్డు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయం
- సీపీలు, ఎస్పీల ఆధ్వర్యంలో పర్యవేక్షణ
- సిద్దిపేటలో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు



గురువారం సిద్దిపేట పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో రక్త పరీక్షల కోసం శాంపిల్స్ ఇస్తున్న పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, సిద్దిపేట: పోలీసుల ఆరోగ్యరికార్డులను రూపొందించాలని వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితులను ముందస్తుగానే తెలుసుకోవడం ద్వారా అవసరమైన సమయాల్లో వారికి మెరుగైన వైద్యం అందించడానికి వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా పోలీసు శాఖలో ప్రతీ ఉద్యోగి పేరు మీద ‘పోలీసులకు ఆరోగ్య రక్ష’ పేరిట ప్రత్యేక రికార్డు తయారు చేస్తారు. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచి, ఎప్పుడంటే అప్పుడు డౌన్‌లోడ్ చేసుకోవడానికి వీలుకల్పిస్తారు. ప్రతి వ్యక్తికి ఒక ఏకీకృత నంబర్ కేటాయిస్తారు. హెల్త్ ప్రొఫైల్ సేకరణ అనంతరం అందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు అందజేస్తారు. పోలీసుల బీపీ, షుగర్‌తోపాటు బ్లడ్ గ్రూప్, కిడ్నీ, కాలేయం పనితీరు, బ్లడ్ యూరియా, సీరమ్ క్రియేటినైన్, ఆల్కలైన్ ఫాస్పటేజ్, కొలెస్ట్రాల్, ఈసీజీ వంటి 57 రకాల పరీక్షలు చేస్తారు. వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ప్రతీ ఆరునెలలకు ఒకసారి ఇలాంటి పరీక్షలు చేస్తారు. అత్యవసర పరిస్థితుల్లో, లేదా ఏదైనా అనారోగ్యం వచ్చి డాక్టర్ వద్దకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఏకీకృత నంబర్ ఆధారంగా సంబంధిత వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే వీలుంటుంది. దీనివల్ల మెరుగైన వైద్యం చేయడానికి అవకాశంఉంటుంది. ఇలాంటి పరీక్షల వల్ల ఇప్పటివరకు అంతర్గతంగా ఉన్న చిన్నచిన్న అనారోగ్య సమస్యలు కూడా బయటపడే వీలుంటుందని చెపుతున్నారు. ఈ కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆయా జిల్లాల సీపీలు, ఎస్పీలు పర్యవేక్షిస్తారు. ఇటీవల హైదరాబాద్‌లోని వివిధ ఆస్పత్రుల్లో చాలా మంది యువ పోలీస్‌అధికారులు, ఉద్యోగులు పలు రకాల రోగాలతో చికిత్స పొందినట్లు వైద్య, ఆరోగ్య శాఖ గుర్తించింది. చాలా మంది పని ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నట్లు గమనించారు. కొందరు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో పోలీసు శాఖలో ఉద్యోగులకు ప్రత్యేకంగా హెల్త్ ప్రొఫైల్‌ను రూపొందించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

సిద్దిపేటలో పైలట్ ప్రాజెక్టు ప్రారంభం

గురువారం సిద్దిపేటలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు పైలట్ ప్రాజెక్టు కింద పోలీసుల హెల్త్ ప్రొఫైల్ సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో ఉన్నప్పుడు సమస్యలు బయటకు తెలియవని, కానీ వయసు పైపడిన తర్వాత వ్యాధులకు సంబంధించిన బాధలు తెలుస్తాయని, అందుకే ముందు జాగ్రత్త చర్యగా పోలీసులకు ఆరోగ్యరక్ష కార్యక్రమం చేపట్టామని వెల్లడించారు. పొలిటికల్, పోలీసులు, ప్రెస్.. ఈ మూడు వర్గాలు కలసి నిత్యం సమాజం కోసం శ్రమిస్తుంటాయని, బయట చూసేందుకు బాగానే ఉన్నా.. లోపల వారికి అనేక ఇబ్బందులు ఉంటాయని వివరించారు. బీపీ, షుగర్ లాంటి వ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దని, అశ్రద్ధ చేస్తే మూత్రపిండాలు, కాలేయం, గుండె దెబ్బతిని జీవితం ప్రమాదంలో పడుతుందని మంత్రి పోలీసులకు హితవు చెప్పారు. ఆరోగ్యకరమైన జీవనశైలితో సిద్దిపేట జిల్లా పోలీసులు రాష్ట్రానికి ఆదర్శంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ, సీపీ శ్వేత, డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్, రాష్ట్ర నర్సింగ్ కమిటీ సభ్యుడు పాల సాయిరాంలు పాల్గొన్నారు.

సాధారణ ప్రజలకూ హెల్త్ ప్రొఫైల్ తయారు..

తెలంగాణలో ఇప్పటికే వైద్య, ఆరోగ్య శాఖ హెల్త్ ప్రొఫైల్ విధానానికి శ్రీకారం చుట్టిన సంగతి విదితమే. ములుగు, సిరిసిల్ల జిల్లాల్లో ప్రజలకు ఆరోగ్య ప్రొఫైల్ చేపట్టారు. మిగిలిన జిల్లాల్లో తాత్కాలికంగా వాయిదా వేశారు.

జాతీయస్థాయి 4 స్టార్ రేటింగ్స్‌లో | మూడు తెలంగాణకే..

- రాష్ట్రానికి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డుల పంట!
- రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు దక్కిన గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: జాతీయస్థాయిలో తెలంగాణ సత్తా చాటింది. నాలుగు స్టార్ రేటింగుల్లో తెలంగాణ మొదటి మూడు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ (ఎస్ఎస్‌జీ) అవార్డులు సాధించింది. దీనికి సంబంధించి రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు ఈ అవార్డులు లభించాయి. వీటితోపాటు 3 స్టార్, 2 స్టార్ రేటింగ్స్‌లోనూ తెలంగాణ పల్లెలు టాప్‌ర్యాంక్‌లలో నిలిచి సత్తాచాటాయి. అచీవర్స్ 3 స్టార్ రేటింగ్‌లో సిద్దిపేట జిల్లా మొదటిస్థానంలో నిలువగా జగిత్యాల జిల్లా రెండోస్థానాన్ని, పెర్ఫార్మర్స్ 2 స్టార్ రేటింగ్స్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటిస్థానాన్ని సాధించింది. తాజాగా కేంద్రం ప్రకటించిన 4 స్టార్, 3 స్టార్, 2 స్టార్ రేటింగ్స్ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డులు రాష్ట్రానికి రావడంపట్ల పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లోని స్వచ్ఛత అంశాలను పరిగణనలోకి తీసుకొని జిల్లాలకు ర్యాంకులను స్టార్ రేటింగ్‌లవారీగా విడుదల చేసిందన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఈ అవార్డుల వివరాలను ప్రకటించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా అభినందించడంపట్ల మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఇందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

కేంద్రం వివక్ష ప్రదర్శిస్తున్నా...

తెలంగాణపట్ల కేంద్రం వివక్ష ప్రదర్శిస్తున్నా రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధులు రాకుండా అడ్డంకులు సృష్టిస్తున్నా జాతీయస్థాయిలో తెలంగాణ అవార్డులు పొందడం సీఎం కేసీఆర్ పనితీరుకు, తెలంగాణ అభివృద్ధికి నిదర్శనమని ఎర్రబెల్లి పేర్కొన్నారు. పచ్చదనం, పరిశుభ్రతలో తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే అనేక అవార్డులు, ప్రశంసలు అందుకుందని, ఈ పరంపర కొనసాగుతోందన్నారు. కేసీఆర్ మార్గదర్శకత్వంలో ఆరంభించిన పల్లెప్రగతితో గ్రామాల్లో గుణాత్మక మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని, పచ్చదనాన్ని పరిరక్షించాలని మంత్రి కోరారు.

వచ్చే వారం ఎంసెట్ షెడ్యూల్

- మే మొదటి వారంలో పరీక్షలు నిర్వహించే అవకాశం
- ఈ నెల 24 నుంచి జేఈఈ మెయిన్స్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్‌కు సంబంధించిన షెడ్యూల్ వచ్చే వారం వెలువడే వీలుంది. మే మొదటి వారంలో పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఎంసెట్ షెడ్యూల్ ఖరారుపై ఉన్నత విద్యా మండలి కసరత్తు ఇప్పటికే మొదలైంది. జేఈఈ మెయిన్స్ ఈ నెల 24 నుంచి మొదలవుతుంది. రెండో విడత జేఈఈ ఏప్రిల్ 2 నుంచి నిర్వహిస్తారు. ఇంటర్ పరీక్షలు మార్చిలో ముగుస్తాయి. ఇంటర్ పరీక్షలు పూర్తయిన తర్వాత 45 రోజుల పాటు ఎంసెట్ సన్నద్ధతకు సమయం ఇవ్వడం ఆనవాయితీ. దీన్ని దృష్టిలో ఉంచుకుని మే మొదటి వారంలో ఎంసెట్ నిర్వహించవచ్చని చెబుతున్నారు. ఫలితాలను జూన్ మొదటి వారంలో ప్రకటించి, సెప్టెంబర్ కల్లా సీట్ల భర్తీ చేపట్టాలని భావిస్తున్నారు. జేఈఈ మెయిన్స్ జనవరిలోనే నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎక్కువ మంది ఈ పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉండదు. ఇంటర్ సిలబస్ ఫిబ్రవరి నెల రెండో వారం వరకూ కొనసాగే వీలుంది. దీంతో ఎక్కువ మంది రాష్ట్ర ఎంసెట్‌పై ఆధారపడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది కూడా ఎంసెట్ రాసిన వారి సంఖ్య అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఐదు వేలు పెరిగింది. ఈసారి మరింత పెరుగుతుందనే అంచనాల్లో అధికారులున్నారు.

కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థుల | సమావేశంలో ఉద్రిక్తత

ప్రెస్‌క్లబ్‌లో బైఠాయించిన అభ్యర్థులు.. అరెస్టు చేసిన పోలీసులు



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బైఠాయించిన కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులు

పంజగుట్ట: పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన కఠిన నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేస్తూ కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అభ్యర్థులు రెండు వర్గాలుగా చీలిపోయారు. ఈ నెల 6న దున్నపోతులకు వినతిపత్రం, 7 కలెక్టరేట్‌ల ముందు ధర్నా, 9వ తేదీ చలో హైదరాబాద్ నిర్వహిద్దామని తీర్మానం చేసి కార్యాచరణ ప్రకారం వెళదామనగా కొందరు ప్రతిపాదించగా, మరికొందరు వ్యతిరేకిస్తూ సమస్యలు పరిష్కరించే వరకు ప్రెస్‌క్లబ్‌లోనే ఆమరణ నిరాహారదీక్షకు కుర్చున్నారు. పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి ఎంత సముదాయించినా వినకపోవడంతో రాత్రి 7:30 గంటల సమయంలో అభ్యర్థులను, వారికి మద్దతు పలికిన నేతలను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఆ 7 ప్రశ్నలకు మార్కులు కలపాలని...

పరుగుపందెంలో ఉత్తీర్ణత సాధించిన ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులందరికీ మెయిన్స్ పరీక్షకు అవకాశం కల్పించాలని, హైకోర్టు ఆదేశాల మేరకు 7 తప్పుడు ప్రశ్నలకు 7 మార్కులు కలపాలని, రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తూ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వీరికి మద్దతు పలికేందుకు తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు విమలక్క, సీపీఐ, సీపీఎం నేతలు బాలమల్లేష్, నర్సింగ్‌రావు హాజరయ్యారు. కోదండరామ్ మాట్లాడుతూ ఆర్మీ సెలక్షన్స్‌లో కూడా లేని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని నిబంధనలు తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామకాల్లో పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అభ్యర్థులు పాత పద్ధతిలోనే రిక్రూట్‌మెంట్ చేయమంటున్నారని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు వివిధ విద్యార్థి సంఘాల నేతలు కె.ధర్మేంద్ర, ఆనగంటి వెంకటేశ్, సలీంపాషా, డాక్టర్ వలీఖాద్రీ, కోట రమేశ్, అశోక్ రెడ్డి, రెహమాన్ పాల్గొన్నారు.

తుది పరీక్షకు టీఎస్‌ఎల్పీఆర్బీ సన్నద్ధం

ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: యూనిఫామ్ సర్వీసెస్ కొలువుల భర్తీలో భాగంగా తుది రాత పరీక్ష నిర్వహణపై తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి(టీఎస్‌ఎల్పీఆర్బీ) సన్నద్ధమవుతోంది. వివిధ విభాగాల్లోని కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు రాష్ట్ర వ్యాప్తంగా 11 ప్రాంతాల్లో నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలు గురువారం ముగిశాయి. ప్రాథమిక రాతపరీక్షలో ఉత్తీర్ణత సాధించినవారిలో దాదాపు 54 శాతం మంది దేహదారుఢ్య పరీక్షల్లో అర్హత సాధించినట్టు బోర్డు వర్గాల ద్వారా తెలిసింది. పూర్తిస్థాయిలో సాంకేతికత ఉపయోగించి నిర్వహించిన ఈ ఫిజికల్ ఈవెంట్లలో పొరపాట్లకు తావులేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే మార్చి 12 నుంచి తుది రాతపరీక్షలు నిర్వహించనున్నట్టు షెడ్యూల్ సైతం టీఎస్‌ఎల్పీఆర్బీ వెల్లడించిన విషయం తెలిసిందే. అందుకు తగినట్టుగా ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల తుది రాత పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రధానంగా చాలా విభాగాల్లో పోస్టులకు హైదరాబాద్‌లోనే పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేయనుండగా, పెద్దసంఖ్యలో అభ్యర్థులు పాల్గొనే కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించిన రాత పరీక్షను పది ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిర్వహించేందుకు బోర్డు అధికారులు సిద్ధమవుతున్నారు.

చేయూతనిచ్చేందుకు చేతులు కలిపాయి..

అంతరిక్ష రంగం స్టార్టప్‌ల కోసం ఇస్రో, మైక్రోసాఫ్ట్‌ల మధ్య ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: అంతరిక్ష రంగ స్టార్టప్ కంపెనీలకు చేయూతనిచ్చేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో), అంతర్జాతీయ ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లు చేతులు కలిపాయి. ఈ మేరకు ఇరు సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇస్రో ఎంపిక చేసిన అంతరిక్ష రంగ స్టార్టప్ కంపెనీలకు మైక్రోసాఫ్ట్ తన ఫౌండర్స్ హబ్‌లో స్థానం కల్పించడమే కాకుండా మైక్రోసాఫ్ట్ అభివృద్ధి చేసిన టెక్నాలజీ టూల్స్, ప్లాట్‌ఫామ్స్‌లను వాడుకునే వెసులుబాటు కలగజేయనుంది. ఆయా స్టార్టప్ కంపెనీల ఆలోచనలు అవి భారీ కంపెనీలుగా ఎదిగే వరకూ అవసరమైన సాయం చేస్తాయి. మరోవైపు దేశంలో అంతరిక్షరంగ స్టార్టప్‌ల ఏర్పాటును ప్రోత్సహించడం, ఔత్సాహికులు, సృజనశీలురను గుర్తించి వారి సామర్థ్యాలను ఉపయోగించుకోవాలన్న ఇస్రో లక్ష్యాన్ని అందుకునేందుకూ ఈ ఒప్పందం తోడ్పడనుంది. మైక్రోసాఫ్ట్ అజ్యూర్, గిట్‌హబ్ ఎంటర్‌ప్రైజ్, విజువల్ స్టూడియో ఎంటర్‌ప్రైజ్, మైక్రోసాఫ్ట్ 365లతోపాటు పవర్ బి.ఐ., డైనమిక్స్ 365 వంటి ఉత్పత్తులతో స్టార్టప్ కంపెనీలు తమ ఆలోచనలను ఆచరణలోకి తీసుకొచ్చే ప్రయత్నాలను వేగవంతం చేయవచ్చు.

ఉపగ్రహాల సమాచార విశ్లేషణకు ఉపయోగం

ఉపగ్రహాల నుంచి సేకరించిన విస్తృతమైన సమాచారాన్ని విశ్లేషించేందుకు మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులు ఎంతో ఉపయోగపడతాయని, కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్‌లతోపాటు డీప్ లెర్నింగ్‌లు కూడా అందుబాటులో ఉంటున్నందున వాటితో అంతరిక్ష రంగ స్టార్టప్ కంపెనీలకు ఎంతోమేలు జరుగుతుందని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. మైక్రోసాఫ్ట్ ఫర్ స్టార్టప్స్ ఫౌండర్స్ హబ్ అనే ప్లాట్‌ఫాం అటు కంపెనీలను, ఇటు టెక్నాలజీ సొల్యూషన్స్ ఇచ్చేవారిని ఒక వేదికపైకి తెచ్చేందుకు ఏర్పాటైందని, దీని వల్ల జాతీయ అంతరిక్ష కార్యక్రమాలకు మంచిమద్దతు లభిస్తుందని అన్నారు. ఔత్సాహికులతో కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నామని, ఈ సహకారం భారత ఆర్థికవ్యవస్థకు ఊతమివ్వాలని ఆశిస్తున్నామని తెలిపారు. ఇరుసంస్థల మధ్య అవగాహన ఒప్పంద కుదిరిన సందర్భంగా మైక్రోసాఫ్ట్ ఇండియా అధ్యక్షుడు అనంత్ మహేశ్వరి మాట్లాడుతూ ‘‘దేశ అంతరిక్ష ప్రయోగ సామర్థ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంలో స్టార్టప్‌లు కీలకపాత్ర పోషిస్తున్నాయి. దీన్ని మరింత వేగవంతం చేసేందుకు ఇస్రోతో చేసుకున్న ఒప్పందం సహకరిస్తుంది’’అని తెలిపారు.

తగ్గిన తలసరి కోటా

ఆహార భద్రత కార్డులపై ఇస్తున్న బియ్యంలో కోత
- కొన్నినెలలుగా పంపిణీ చేస్తున్న 10 కిలోల ఉచిత బియ్యానికి చెల్లుచీటీ
- కేంద్రం ‘ఎన్‌ఎఫ్ఎస్‌సీ’ కార్డు దారులకు ప్రకటించిన 5 కిలోల ఉచిత బియ్యాన్నే ఇవ్వాలని నిర్ణయం
- రాష్ట్ర ప్రభుత్వ కార్డుదారులకూ ఇదే అమలు.. అదనపు కిలోకు కోత
- నేటి నుంచే అమల్లోకి.. ఈ ఏడాది డిసెంబర్ వరకు ఉచితంగా పంపిణీ



సాక్షి, హైదరాబాద్: బియ్యంలో కోతపడింది. కొన్ని నెలలుగా పంపిణీ చేస్తున్న తలసరి 10 కిలోల ఉచిత బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ నిలిపివేసింది. ఈ నెల నుంచి ఆహార భద్రతా కార్డుదారులకు ఒక్కొక్కరికి 5 కిలోల ఉచిత బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జాతీయ ఆహార భద్రతా కార్డుల(ఎన్ఎఫ్ఎస్‌సీ)తోపాటు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఫుడ్ సెక్యూరిటీ కార్డుదారులందరికీ ఇదే వర్తించనుంది.

కేంద్రమిచ్చేదానికి అదనంగా..

రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు రేషన్‌కార్డులపై రూపాయికి కిలో బియ్యం చొప్పున.. కుటుంబంలోని నలుగురికి ఒక్కొక్కరికి 4 కిలోల చొప్పున పంపిణీ చేసేవారు. కేసీఆర్ సర్కారు 2015 జనవరి 1 నుంచి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి రూపాయికి కిలో బియ్యం ఇచ్చే పథకం మొదలైంది. ఇందులో జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద కేంద్రం 54.44 లక్షల కార్డుల పరిధిలోని 1.91 కోట్ల మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 5 కిలోల చొప్పున కిలోకు రూ.3 రేటుతో బియ్యం ఇస్తుంది. ఇందులో 2 రూపాయలను రాష్ట్ర ప్రభుత్వమే భరించడంతో పాటు అదనంగా మరో కిలో కలిపి.. ఆరు కిలోల చొప్పున ‘రూపాయి’బియ్యం ఇస్తూ వచ్చింది.

కరోనా పరిస్థితులతో ఉచితంగా..

కేంద్ర ప్రభుత్వం కరోనా పరిస్థితుల నేపథ్యంలో గరీబ్ కల్యాణ్ అన్నయోజన పథకం తెచ్చి.. పేదలందరికీ ఉచితంగా 5 కిలోల చొప్పున బియ్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం దీనికి అదనంగా మరో ఐదు కిలోలు కలిపి 10కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేస్తూ వస్తోంది. తాజాగా 2023 డిసెంబర్ వరకు కూడా ఐదు కిలోల ఉచిత బియ్యం పథకాన్ని పొడిగిస్తూ కేంద్రం ప్రకటన చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అదనంగా ఇస్తున్న ఐదు కిలోల ఉచిత బియ్యానికి స్వస్తి పలికింది. ఆహార భద్రతా కార్డులన్నింటిపై ఒక్కొక్కరికి నెలకు 5 కిలోల ఉచిత బియ్యాన్ని మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించింది. అయితే కరోనాకు ముందు రాష్ట్ర ప్రభుత్వం తలా ఆరు కిలోల బియ్యం ఇవ్వగా.. ఇప్పుడు అందులోనూ ఒక కిలో కోత పడటం గమనార్హం.

ఇన్నాళ్లూ తీవ్ర భారం మోస్తూ..

రాష్ట్రంలో రేషన్‌కార్డుల సంఖ్య 90,13,512. ఇందులో 54.44 లక్షలకార్డులు జాతీయ ఆహార భద్రతాచట్టం(ఎన్ఎఫ్ఎస్ఏ) కింద కేటాయించినవి కాగా, 30 లక్షలకుపైగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసినవి. ఇవికాకుండా 5.62 లక్షల అంత్యోదయ అన్న యోజన, 5 వేలకుపైగా అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. మొత్తంగా 2.68 కోట్ల మందికి రేషన్ బియ్యం సరఫరా అవుతోంది. అయితే కరోనా సమయం నుంచి రాష్ట్రంలో అదనంగా ఉచిత బియ్యం ఇవ్వడంతో రాష్ట్ర ఖజానాపై భారం పడింది. దీనికి 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.3వేల కోట్లు ఖర్చయ్యాయి. 2022 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ప్రతినెలా ప్రభుత్వం రూ.300 కోట్ల చొప్పున సబ్సిడీ భరించింది. ఇప్పుడీ భారం చాలా వరకు తగ్గనుందని అధికారవర్గాలు చెప్తున్నాయి.

అమ్మానాన్నకు చెప్పొద్దు ప్లీజ్!

▶ మొదటి పేజీ తరువాయి

తెలియనివ్వద్దని ఆ జంట నన్ను అభ్యర్థించారు. ఇలాంటి అభ్యర్థనలు మామూలే కాబట్టి సరే అని, ఆ తర్వాత వీల్ చైర్‌లో నా ఛాంబర్‌లోకి ప్రవేశించిన మనుని కలిశా. ఆ సందర్భంగా డాక్టర్‌తో ఏకాంతంగా మాట్లాడాలనుకుంటున్నా అని మను తన తల్లిదండ్రులను కోరడం నన్ను ఆశ్చర్య పరచింది. తర్వాత తనకు క్యాన్సర్ ఉందనే విషయం తన తల్లిదండ్రులకు చెప్పవద్దని మను అభ్యర్థించడం నేను నివ్వెరపోయేలా చేసింది.

ఉద్యోగాలు వదిలి..మనుతో కదిలి...

మళ్లీ కొన్ని రోజుల క్రితమే వారు నన్ను కలిశారు. గతంలో ఇద్దరం ఉద్యోగస్తులమైనందున బిడ్డతో తగినంత సమయం గడపలేకపోయామని, నేను ఇచ్చిన సలహా మేరకు ఇద్దరం ఉద్యోగాలు వదిలేశామని చెప్పారు. అర్ధరాత్రి ఐస్‌క్రీమ్ తినిపించడం నుంచి, అమెరికాలో డిస్నీల్యాండ్ చూపించడం దాకా.. మను ఇష్టాలు, కోరికలు తీర్చడమే పనిగా ఆ సమయం అంతా గడిపామన్నారు. ఆర్నెల్లూ ముగ్గురం ఒకటిగా బ్రతికామని తెలిపారు. ఇటీవలే ఒకరోజు తీవ్రమైన తలనొప్పితో బాధపడిన మను తమని వదిలేసి వెళ్లిపోయాడని, ఆ బాధ నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటూ..మనుతో గడిపిన చివరిరోజుల్ని మర్చిపోలేని జ్ఞాపకాలుగా మలచుకోవడానికి కారణమైన మీకు థ్యాంక్స్ చెప్పడానికి వచ్చామని చెప్పారు.

మను లేడు కానీ..

మనులేడు.. కానీ చిన్న వయస్సులోనే అతని గొప్ప మనసు మనతోనే ఉంది. చనిపోతానని తెలిసి కూడా తల్లిదండ్రుల్ని బాధ పెట్టకూడదనుకుంటూ చిన్నారి చెప్పిన మాటలు మన స్మృతులలో నిలిచే ఉంటాయి. పెద్దవాళ్లయినా, చిన్నవాళ్లయినా మరణం తప్పదని తెలిసినప్పుడు దాగుడుమూతలు ఆడటం కంటే.. ఆ నిజాన్ని అందరూ అంగీకరించి చివరిరోజుల్ని సంతోషంగా గడిపేలా చూడటం ముఖ్యం’ అంటూ ముగించారు డా.సుధీర్ కుమార్.

హిందూ దేవతలను దూషించిన వారిపై చర్యకు వినతి

సాక్షి, హైదరాబాద్: హిందూదేవతలను దూషించిన రేంజర్ల రాజేష్‌పై పీడీ చట్టం నమోదు చేయాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. సరస్వతి మాత గురించి అసభ్యంగా మాట్లాడిన వ్యక్తిపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించింది. ఈ మేరకు గురువారం డీజీపీ అంజనీ కుమార్‌ను వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ రామ్‌సింగ్, సహ కార్యదర్శి భాను ప్రసాద్, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు కలిశారు.

క్లుప్తంగా...

కాంగ్రెస్ హయాంలోనే మైనార్టీలకు రిజర్వేషన్లు

షబ్బీర్ అలీ



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ ముస్లింలకు చేసిందేమీ లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు వచ్చాయని, ఈ రిజర్వేషన్ల కారణంగానే ముస్లిం వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 12 శాతం రిజర్వేషన్లను ముస్లింలకు కల్పిస్తామన్న సీఎం కేసీఆర్ హామీ ఎక్కడ అమలవుతోందని ప్రశ్నించారు. నాడు తామిచ్చిన రిజర్వేషన్లతో వేల మంది వృత్తివిద్యా కోర్సులు నేర్చుకుని జీవితాల్లో స్థిరపడ్డారని అన్నారు. కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌కు వ్యతిరేకంగా అక్కడి రైతులు చేస్తున్న ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు నిస్తుందని షబ్బీర్‌అలీ చెప్పారు.

వడ్డీలేని రుణాల పేరిట కేసీఆర్ మోసం

వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల ట్వీట్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పైకిమాత్రం ధనిక రాష్ట్రం, అధిక ఆదాయం.. లోపల మాత్రం అప్పుల బెడద అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల మండిపడ్డారు. పావలా వడ్డీకే రుణాలిచ్చి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి దేవుడైతే.. వడ్డీ లేని రుణాలని చెప్పి కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. ఓట్ల కోసం ఉచిత వడ్డీ అని ఆశ చూపి, లోన్లు ఇచ్చి.. ఆ తర్వాత ముఖం చాటేశారంటూ గురువారం ట్వీట్ చేశారు. సర్కారు నుంచి వడ్డీ బకాయిలు రాకపోవడంతో.. బ్యాంకులు ముక్కుపిండి మరీ 12 శాతం నుంచి 13.7 శాతం వడ్డీలు వసూలు చేస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో మహిళలకు కూడా అన్యాయమే జరుగుతోందని షర్మిల ధ్వజమెత్తారు.

సర్పంచ్‌ల సమస్యలపై 9న కాంగ్రెస్ ధర్నా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులను ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లిస్తున్న తీరును నిరసిస్తూ ఈనెల 9వ తేదీన ఇందిరాపార్కు వద్ద సర్పంచ్‌లతో కలిసి ఆందోళన చేస్తామని రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ వెల్లడించారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 2నే ధర్నా చేయాల్సి ఉన్నప్పటికీ పోలీసులు అడ్డుకున్నారని, కోర్టు తీర్పు మేరకు 9వ తేదీన ధర్నా చేస్తామని, ఈ ధర్నాకు రాష్ట్రంలోని సర్పంచ్‌లందరూ సంఘీభావం తెలపాలని కోరారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్ మాట్లాడుతూ సర్పంచ్‌ల సమస్యల మీద కాంగ్రెస్ ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడం దారుణమని అన్నారు.

బీజేపీ పాలనలో అంతా అయోమయమే: కూనంనేని



చర్ల: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజల బతుకులను అయోమయం చేస్తోందని, పాలనను పక్కన పెట్టి గుళ్లు, గోపురాలంటూ కాలం వెళ్లదీస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఎనిమిదేళ్లలో బీజేపీ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా లోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమతో కలిసొచ్చే బీజేపీయేతర పార్టీలతో కలిసి పోటీ చేస్తామని, అన్ని స్థానాలూ దక్కించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ కింద చర్ల, దుమ్ముగూడెం, అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాల్లో నిర్వాసితులవుతున్న రైతులు, కూలీలకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణాన్ని మూడు ముక్కలు చేసేందుకు తీసుకొచ్చిన జీఓను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు తదితరులు ఉన్నారు.

'ఎన్నికల సమయంలోనే పొత్తులపై ఆలోచన'

మిర్యాలగూడ: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుల కోసం తాము ఏ పార్టీతోనూ చర్చలు జరపలేదని, ఎన్నికల సమయంలోనే పొత్తులపై ఆలోచిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం ఆయన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో కొందరు నాయకులు పార్టీలు మారుతున్నట్లు వార్తలు వస్తున్నాయని, నాయకులు తాత్కాలిక ప్రయోజనాలు కాకుండా, ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. బీజేపీ ధన, జన బలమున్న నాయకులను పార్టీలో చేర్చుకొని బలోపేతం కావాలన్న ప్రయత్నం చేస్తోందని అన్నారు. మతతత్వ బీజేపీని ఓడించడానికి కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీని స్థాపించారని, బీజేపీ ఆగడాలను అడ్డుకునే వారికి తమ పార్టీ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 2,99,74,919

3.03 కోట్ల నుంచి 2.99 కోట్లకు తగ్గిన ఓటర్లు

- తొలిసారి ఓటుహక్కు పొందిన 2,800 మంది గిరిజనులు
- 2023 వార్షిక తుది ఓటర్ల జాబితా ప్రకటన



రాష్ట్రంలో ఓటర్లు ఇలా..

పురుషులు	1,50,74,919
మహిళలు	1,49,24,718
థర్డ్ జెండర్	1,951
మొత్తం	2,99,74,919
ఎన్‌ఆర్‌ఐలు	2,740
సర్వీసు ఓటర్లు	15,282

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సాధారణ ఓటర్లు 2,99,74,919 మంది ఉన్నారు. కొత్తగా ఓటర్ల జాబితాలో చోటు పొందిన యువ ఓటర్లు 2,78,650 మంది ఉండటం విశేషం. వార్షిక ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం(ఎస్ఎస్ఆర్)-2023లో భాగంగా ఈ మేరకు తుది ఓటర్ల జాబితాను గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ ప్రకటించారు. సాధారణ ఓటర్లకు ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 2,740 మంది, సర్వీసు ఓటర్లు (కేంద్ర సాయుధ బలగాలు) 15,282 మంది కలిపితే మొత్తం ఓటర్ల సంఖ్య 2,99,92,941కు చేరనుంది. రాష్ట్రంలో ఈ ఏడాది జరగాల్సిన శాసనసభ ఎన్నికలను ఈ జాబితాతోనే నిర్వహించనున్నారు. ఓటర్ల నమోదు నిరంతర కార్యక్రమం కావడంతో ఎన్నికల ప్రకటన నాటికి జాబితాలో స్థానం పొందే కొత్త ఓటర్లకు సైతం ఓటు హక్కును కల్పించనున్నారు.

ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సాయంతో...

వార్షిక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం-2022లో భాగంగా గతేడాది జనవరిలో ప్రకటించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో మొత్తం 3,03,56,894 మంది ఓటర్లు ఉండగా, తాజాగా ప్రకటించిన 2023 వార్షిక ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్య 2,99,74,919కి తగ్గింది. గతేడాది తుది ఓటర్ల జాబితా ప్రకటించిన తర్వాత నిరంతర నవీకరణ చేపట్టారు. ఒకే తరహా ఫొటోలు కలిగిన ఓటర్లను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో గుర్తించి తొలగించారు. మొత్తం 11,36,873 ఓటర్లను తొలగించగా, కొత్తగా 3,45,648 ఓటర్లను చేర్చారు. దీంతో ఓటర్ల జాబితా సవరణ 2023లో భాగంగా గత నవంబర్ 9న ప్రకటించిన ముసాయిదా జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,95,65,669కు తగ్గింది. ఆ తర్వాత కొత్తగా 6,84,408 మందికి చోటు కల్పించగా, 2,72,418 మంది ఓటర్లను తొలగించారు. దీంతో తాజాగా ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో సాధారణ ఓటర్ల సంఖ్య 2,99,74,919కి తగ్గింది.

నమోదుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో...

మారుమూల గిరిజన ప్రాంతంలో ఓటర్ల నమోదుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో ఈ ఏడాది 2,800 మంది గిరిజనులు తొలిసారిగా ఓటు హక్కును పొందారు. 361 గిరిజన ఆవాస ప్రాంతాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించి కొలామ్స్, తోటి, చెంచులు, కండారెడ్డి తెగల గిరిజనులకు ఓటు హక్కు కల్పించారు. సదరం డేటాబేస్, ఆసరా పెన్షన్ల సమాచారాన్ని వికలాంగ ఓటర్ల నమోదుకు వినియోగించారు. ముందస్తుగా ఓటర్ల నమోదులో భాగంగా 17 ఏళ్లు నిండిన 20,246 మంది యువతీయువకుల నుంచి సైతం దరఖాస్తులు స్వీకరించారు. వీరికి 18 ఏళ్లు నిండిన తర్వాత ఓటర్ల జాబితాలో చేర్చనున్నారు.

ఇంకా నమోదు చేసుకోవచ్చు: సీఈఓ వికాస్ రాజ్

ఓటర్ల నమోదు నిరంతర కార్యక్రమమని, తుది జాబితాలో చోటుపొందని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్‌వీఎస్‌పీ వెబ్‌పోర్టల్, ఓటర్ హెల్ప్ లైన్ యాప్ లేదా తమ దరఖాస్తును స్థానిక బీఎల్‌ఓకు అందజేస్తే అర్హులకు ఓటు హక్కు కల్పిస్తాం.



బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయగౌడ్‌ను అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ కవిత



బాధ్యతలు స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రిని కలిసిన ఆంజనేయగౌడ్

కార్పొరేషన్ చైర్మన్ల బాధ్యతల స్వీకరణ

టీఎస్ఐడీసీ చైర్మన్‌గా వేణుగోపాలచారి.. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఆంజనేయగౌడ్



వేణుగోపాలచారిని అభినందిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ కార్పొరేషన్ చైర్మన్లుగా నియమితులైన వేణుగోపాలచారి, ఈడిగ ఆంజనేయగౌడ్ గురువారం జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ (టీఎస్ఐడీసీ) చైర్మన్‌గా వేణుగోపాలచారి బంజారాహిల్స్‌లోని ఐడీసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, నేతలు హాజరై వేణుగోపాలచారికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థి నేతగా క్రియాశీలకంగా పనిచేసిన ఈడిగ ఆంజనేయగౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్‌బీ స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, తలసాని, ఎమ్మెల్సీ కవిత హాజరై శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో కలిసి నడిచిన ఉద్యమకారులకు ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రతీ నియోజకవర్గంలో స్టేడియం నిర్మాణంతో పాటు అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు.

పాదయాత్రకు సమాయత్తం

26న భద్రాచలం నుంచి రేవంత్ యాత్ర షురూ!



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. హాథ్‌సే హాథ్‌జోడో యాత్రల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా యాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా చేసుకుంటున్నారు. ఈనెల 26న భద్రాచలం నుంచి ప్రారంభం కానున్న తన పాదయాత్ర షెడ్యూల్‌ను ఇప్పటికే ఏఐసీసీ అధిష్టానానికి పంపిన రేవంత్.. ఈ షెడ్యూల్ మేరకు క్షేత్రస్థాయిలో అన్ని వ్యవహారాలను చక్కబెట్టుకునే పనిలో ఉన్నారు. అందులో భాగంగానే గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యతో రేవంత్ భేటీ అయ్యారు.

మా దగ్గరి నుంచే ప్రారంభించండి

రేవంత్‌ను పొదెం వీరయ్య కలిసిన సందర్భంగా పాదయాత్ర అంశం చర్చకు వచ్చిందని గాంధీభవన్ వర్గాల ద్వారా తెలిసింది. తన నియోజకవర్గం నుంచే యాత్రను ప్రారంభించాలని రేవంత్‌ను వీరయ్య కోరారు. అయితే యాత్ర ప్రారంభానికి ముందే అన్ని అడ్డంకులను తొలగించుకునే యోచనలో రేవంత్ ఉన్నారు. సంక్రాంతి తర్వాత రాష్ట్ర నాయకత్వంతో ఆయన పాదయాత్ర గురించి చర్చించనున్నారు. హాథ్‌సే హాథ్‌జోడో యాత్రలు ఎలాగూ రెండు నెలల పాటు రాష్ట్రమంతటా చేయాల్సి ఉన్న నేపథ్యంలో, ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ యాత్రను పొడిగించి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలని ఆయన కోరనున్నట్టు సమాచారం. ఈ యాత్రకు సంబంధించిన సమన్వయ బాధ్యతలను టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవికి రేవంత్ అప్పగించే అవకాశముంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో పార్టీ సమన్వయ బాధ్యతలను మల్లు రవికి అప్పగించారు. ఈ బాధ్యతలకు అనుగుణంగానే నూతన సంవత్సరం సందర్భంగా మల్లు రవి పలువురు కాంగ్రెస్ నాయకులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాగే రాష్ట్రంలోని ముఖ్య కాంగ్రెస్ నేతలందరినీ మల్లు రవి కలుస్తారని, రేవంత్ పాదయాత్ర ఉద్దేశం, ఆవశ్యకత గురించి వారితో చర్చిస్తారని తెలుస్తోంది.

రాష్ట్రం నుంచి మరో కేంద్రమంత్రి?

▶ మొదటి పేజీ తరువాయి

కిషన్‌రెడ్డికి తోడుగా తెలంగాణ నుంచి ఎంపీలుగా ఉన్న బండిసంజయ్, ధర్మపురి అరవింద్, సోయం బాపూరావులలో ఒకరికి కేబినెట్‌బెర్త్ దక్కే అవకాశాలున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. యూపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన డా.కె.లక్ష్మణ్ కూడా మంత్రి పదవి రేసులో ఉన్నట్టుగా చెబుతున్నారు.

కేసీఆర్ సర్కారు వైఫల్యాలను మరింతగా ఎండగట్టేలా...

తెలంగాణలో కచ్చితంగా విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్న జాతీయనాయకత్వం ఈ దిశలో కేసీఆర్ సర్కారు వైఫల్యాలను మరింత గట్టిగా ఎండగట్టేందుకు మరో కేబినెట్ పదవి ఇచ్చే అవకాశాలున్నాయని అంటున్నారు. గత 8 ఏళ్లలో మోదీ ప్రభుత్వం అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గురించి తెలంగాణలో విస్తృతంగా ప్రచారం చేయలేకపోయామనే అభిప్రాయంతో జాతీయనాయకత్వం ఉన్నట్టు సమాచారం. మరో పది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఇప్పటికైనా మోదీ ప్రభుత్వ విజయాలు, తెలంగాణలో వివిధవర్గాల పేదలకు చేకూరిన ప్రయోజనాలను గురించి ప్రజలకు తెలియచేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే కేబినెట్ విస్తరణలో తెలంగాణకు చెందిన నేతకు మంత్రి పదవి దక్కుతుందనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సంజయ్‌ను కేంద్రమంత్రిని చేస్తే రాష్ట్ర పార్టీలో బీసీవర్గం నుంచి కీలకనేతగా ఉన్న మరో ముఖ్యనేతకు రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ పగ్గాలు అప్పగించవచ్చునని ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఇప్పటికే సోషల్ మీడియాలోని కొన్ని వెబ్‌సైట్‌లలో వార్తలు పెద్దఎత్తున హల్‌చల్ చేస్తున్నాయి.

మాణిక్‌రావ్ రాకతోనైనా 'మారేనా'?

- గ్రూపు తగాదాల పరిష్కారమే ఇన్‌చార్జి ముందున్న సవాల్
- వచ్చే వారం తెలంగాణకు రాక!



సాక్షి, హైదరాబాద్: మాణిక్యం ఠాగూర్ మారారు.. మాణిక్‌రావు ఠాక్రే వస్తున్నారు.. మరి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మారుతుందా? మాణిక్యం కుదర్చలేని సమన్వయం మాణిక్‌రావ్‌తో సాధ్యమవుతుందా? మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా ఎనిమిదేళ్ల పాటు పనిచేసిన అనుభవంతో తెలంగాణ కాంగ్రెస్‌కు ఆయన ఎలాంటి చికిత్స చేయబోతున్నారనేది ఇప్పుడు టీకాంగ్రెస్ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే రాకతోనైనా తెలంగాణ కాంగ్రెస్ పరిస్థితి మారుతుందా అని కార్యకర్తలు ఆశగా ఎదురుచూస్తున్నారు. మహారాష్ట్ర కాంగ్రెస్‌లో ఒకప్పుడు కీలక నేతగా గుర్తింపు పొందిన మాణిక్‌రావ్ ప్రస్తుతం క్రియాశీల రాజకీయాల్లో లేరని తెలుస్తోంది. తన పని తాను చేసుకుని పోతున్న తరుణంలో అధిష్టానం వెతికి మరీ తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యతలు అప్పజెప్పడానికి గల కారణమేంటనేది కూడా చర్చనీయాంశమైంది. గాంధీ కుటుంబానికి వీరవిధేయుడిగా పేరున్న ఠాక్రే ప్రత్యర్థి పార్టీలపై విరుచుకుపడటం, సొంత పార్టీలో పరిస్థితులను చక్కబెట్టడంలో దిట్ట అని, తాను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేలా కృషి చేశారనే చర్చ జరుగుతోంది. శరద్ పవార్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆయన మహారాష్ట్ర హోంమంత్రిగా పనిచేసి తనదైన గుర్తింపు తెచ్చుకున్న నేపథ్యంలో పాలనానుభవం కూడా ఉందని గాంధీభవన్ వర్గాలు చెపుతున్నాయి. ఈ నేపథ్యంలో తన ముందున్న ప్రధాన సవాల్ అయిన తెలంగాణ కాంగ్రెస్‌లోని గ్రూపు తగాదాలను ఎలా పరిష్కరిస్తారనేది ఆసక్తి కలిగిస్తోంది.

వచ్చేవారం రాక..

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హోదాలో మాణిక్‌రావ్ ఠాక్రే వచ్చేవారం తెలంగాణకు రానున్నారని తెలుస్తోంది. వచ్చీరాగానే పార్టీ ముఖ్య నేతలందరినీ కలుస్తారని సమాచారం. కాగా, కొత్త ఇన్‌చార్జితో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గురువారం ఫోన్‌లో మాట్లాడారని, పార్టీ ఇన్‌చార్జిగా నియమితులైనందుకు శుభాకాంక్షలు చెప్పడంతోపాటు తెలంగాణకు రావాలని ఆహ్వానించారని తెలుస్తోంది.

ఖమ్మంలో నూనె శుద్ధి కర్మాగారం

రూ.250 కోట్లతో ఏర్పాటు చేయనున్న గోద్రెజ్ ఆగ్రోవెట్



గోద్రెజ్ ఆగ్రోవెట్ ఎండీకి జ్ఞాపికను అందజేస్తున్న కేటీఆర్. చిత్రంలో రంజిత్‌రెడ్డి, జయేశ్ రంజన్

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఆయిల్‌పామ్ సాగులో అతిపెద్దదైన గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ రూ.250 కోట్లతో ఖమ్మం జిల్లాలో వంట నూనెల శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. 30 టీపీహెచ్ (టోటల్ పెట్రోలియం హైడ్రోకార్బన్) సామర్థ్యంతో ఏర్పాటయ్యే ఈ ఫ్యాక్టరీని క్రమంగా 60 టీపీహెచ్‌లకు విస్తరిస్తారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా పామాయిల్‌ను శుద్ధి చేస్తారు. ఈ మేరకు గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ఎండీ బలరామ్‌సింగ్ యాదవ్ గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో భేటీ అయ్యారు. ఈ ఫ్యాక్టరీ 2025-26 నాటికి పూర్తి స్థాయిలో పనిచేస్తుందని, కో జనరేషన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధిస్తుందన్నారు. పది గోద్రెజ్ సమాధాన్ సెంటర్ల ద్వారా రైతులకు అందుబాటులో ఉంటుందని, ఇప్పటికే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సేవలు అందిస్తోందని చెప్పారు. శాటిలైట్, డ్రోన్‌ల ద్వారా సాగు విస్తీర్ణాన్ని పర్యవేక్షించడంతో పాటు వేర్వేరు యాప్‌ల ద్వారా రైతులకు సేవలు అందిస్తామన్నారు. ఈ యూనిట్ ఏర్పాటు ద్వారా 250 మందికి ప్రత్యక్షంగా, 500 మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. వంట నూనెల దిగుమతిని తగ్గించేందుకు రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించడం ద్వారా పసుపు విప్లవం దిశగా శరవేగంగా అడుగులు వేస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ఈ భేటీలో ఎంపీ రంజిత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు రెవెన్యూ, పోలీసుల ఊడిగం

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ, పోలీస్ అధికారులు తమ అధికారాలను సీఎం కేసీఆర్ మోకాళ్ల వద్ద పెట్టేశారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆరోపించారు. కామారెడ్డి కలెక్టరేట్ వద్ద జరిగిన ఘటన దుర్మార్గమని ఆమె ఒక ప్రకటనలో మండిపడ్డారు. రైతుల భూములన్నీ కూడా వ్యవసాయానికే ఉంటాయని.. ఇండస్ట్రియల్ జోన్‌లోకి తీసుకోబోమని ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను రైతులు కలిసి వినతిపత్రం కూడా సమర్పించే అవకాశం కూడా ఉండదా? అని అరుణ నిలదీశారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మహబూబ్‌నగర్ రూరల్/హన్వాడ: రాష్ట్రంలో బీజేపీ అనూహ్యంగా ఎదుగుతోందని మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని కోడూరు, హన్వాడలో జరిగిన బూత్ కమిటీ సభ్యుల సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని, పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపైనే ఉందని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కడంలేదని శ్రీకాంతాచారి వంటి అనేక మంది త్యాగాలు చేశారని, ఫలితంగా ఏర్పడిన రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. దీంతో ప్రజలకు న్యాయం జరగడం లేదని ధ్వజమెత్తారు. ఇప్పటికే ఉత్తర తెలంగాణలో బీజేపీ బలీయమైన శక్తిగా ఎదుగుతోందని, దక్షిణ తెలంగాణలో కూడా పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని అన్నారు. నెత్తిమీద రూపాయి పెడితే కూడా ఎవరూ కొనుక్కోలేని వ్యక్తి అక్కడ ఎమ్మెల్యే అయ్యారని, కేసీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడటం వల్లే ఆ పార్టీ అభ్యర్థి గెలుపొందారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవిత త్వరలో జైలుకెళ్లడం ఖాయమన్నారు. అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు కేవలం ఆరు నెలల్లో కాలం చెల్లనుందన్నారు. ప్రజలు సామాజిక తెలంగాణను కోరుకుంటున్నారని, అది బీజేపీతోనే సాధ్యమని స్పష్టంచేశారు. మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, జిల్లా ఇన్‌చార్జి భరత్‌గౌడ్ తదితరులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు.

ఇలానే ఉంటే రాష్ట్రం దివాలా

కేసీఆర్ వైఖరితోనే జీతాలివ్వలేని పరిస్థితి

- బీఆర్ఎస్ సర్కారుది దిగజారుడుతనం
- దేశమంతా అంబేడ్కర్ రాజ్యాంగం.. తెలంగాణలో కల్వకుంట్ల రాజ్యాంగం
- కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ధ్వజం
- రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకంతోనే రూ. 300 కోట్ల ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్స్ ఆగిపోయాయి



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వాన్ని నిందిస్తూ, అబద్ధాలు ప్రచారం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం, కల్వకుంట్ల కుటుంబం అర్థరహితమైన విమర్శలు చేస్తున్నాయని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. దేశమంతా అంబేడ్కర్ రాజ్యాంగం అమలవుతుంటే.. తెలంగాణలో మాత్రం కల్వకుంట్ల రాజ్యాంగం అమలవుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఢిల్లీలోని తన క్యాంపు కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణను గులాబీ మాఫియా దోచుకుంటోందని.. సీఎం కేసీఆర్ మొండివైఖరి, దుందుడుకు విధానాల వల్ల రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం వచ్చే అవకాశాలున్నాయనీ, ప్రభుత్వ ఉద్యోగులకు సరైన సమయంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. అస్తవ్యస్త ఆర్థిక విధానాల కారణంగా రాష్ట్రం దివాలా తీసే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇదే విధానం కొనసాగితే రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులకు అసలు జీతాలు ఇవ్వలేని పరిస్థితే రావొచ్చన్నారు. తెలంగాణలో వస్తున్న ఆదాయాన్ని దేశమంతా వినియోగిస్తున్నారన్న బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలపైనా కిషన్ రెడ్డి స్పందించారు.

ఇక్కడ వసూలైన డబ్బు ఇక్కడే ఖర్చు చేస్తున్నారా?


'హైదరాబాద్‌లో వసూలైన డబ్బును హైదరాబాద్‌లోనే ఖర్చు పెడుతున్నారా? గజ్వేల్, సిద్దిపేటల్లో వసూలైన డబ్బులు అక్కడే ఖర్చు పెడుతున్నారా?' అనే విషయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం స్పష్టం చేయాలని అయన డిమాండ్ చేశారు. కేంద్రం పంచాయతీల అకౌంట్లలోకి నేరుగా రూ.5,080 కోట్లు విడుదల చేస్తే .. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను డిజిటల్ కీల ద్వారా విడుదల చేసిన గంటల్లోనే దారిమళ్లించిందన్నారు. ఇంతకంటే దౌర్భాగ్యకరమైన పరిస్థితి, దిగజారుడుతనం మరొకటి ఉండదు' అని నిందించారు. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం ప్రతీ విషయాన్ని రాజకీయం చేస్తోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. పేద ఎస్సీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన పత్రాలు అందించని కారణంగా.. కేంద్రం నుంచి రావాల్సిన రూ.300 కోట్ల స్కాలర్‌షిప్‌లు అందడం లేదన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంతలా పాలన కొనసాగిస్తున్నారని.. రోడ్ల మరమ్మతులు చేసేందుకు నిధులు లేకపోవడంతో భూములు అమ్మేందుకు సిద్ధమవుతున్నారని మండిపడ్డారు.

ఎన్నికలెప్పుడొచ్చినా బీజేపీ రెడీ

తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ సమర్థవంతంగా ఎదుర్కొంటుందన్న కిషన్‌రెడ్డి, తెలంగాణ సమాజం బీజేపీ బలపడాలని కోరుకుంటోందన్నారు. తెలంగాణలో 15 శాతం భూములు ఆయిల్ పామ్ పంటలకు అనువుగా ఉన్నాయని.. అందుకోసం కేంద్ర ప్రభుత్వం 2021-22, 2022-23 సంవత్సరాలకు గానూ రూ.114 కోట్లు రాష్ట్రానికి విడుదల చేసిందన్నారు. ఇందుకు సంబంధించిన పత్రాలను కూడా మీడియాకు విడుదల చేశారు.

ఉద్యోగాలు ఊడగొడుతున్న కేంద్రం

బీజేపీపై మంత్రి హరీశ్‌రావు మండిపాటు.. ఉద్యోగ నోటిఫికేషన్లపై బండి సంజయ్ కుట్ర



కోరుట్ల/పెద్దపల్లి: బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, విశాఖ ఉక్కు వంటి ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించి ఇప్పటికే ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. గురువారం జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్, బస్తీ దవాఖానా ప్రారంభించి, వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోనూ 30 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని మాట తప్పిందని, దీనిపై యువతకు సమాధానం ఇవ్వాలన్నారు. తెలంగాణలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వరుసగా 81 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేస్తుంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుళ్లుకుంటున్నారని అన్నారు. నోటిఫికేషన్లపై స్టేలు తెచ్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 157 మెడికల్ కళాశాలలు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మాత్రం ఒక్కటి కూడా ఇవ్వలేదని, ఇంత అన్యాయం జరిగితే మరి సంజయ్ ఏం చేస్తున్నారని హరీశ్ ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు 4 మెడికల్ కళాశాలలు ఇస్తే ఎంపీ సంజయ్ ఏం తెచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ కృషి ఫలితంగా పేదలకు వైద్య సేవలు అందించడంలో దేశంలోనే రాష్ట్రం మూడో స్థానంలో ఉందని పేర్కొన్నారు. మతం పేరిట యువతను రెచ్చగొట్టి ఓట్లు దండుకునేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణతో బీఆర్ఎస్ పార్టీకి పేగుబంధం ఉందని, ప్రతిపక్షాలది మాత్రం ఓటు బంధమని అన్నారు.

నిరుద్యోగులకు కేంద్రం వంచన

దేశంలో నిరుద్యోగం 8.30 శాతానికి పెరగగా, తెలంగాణలో కేవలం 4 శాతమే ఉందని హరీశ్‌రావు అన్నారు. ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనం వాపస్ తెప్పిస్తామని కేంద్రం మోసగించిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంటు, రైతుబీమా, రైతుబంధు ఇస్తూ ఆదుకుంటోందని వెల్లడించారు. హరిత తెలంగాణ దిశగా బీఆర్ఎస్ చర్యలు తీసుకుంటే బీజేపీ మాత్రం ఉద్రిక్త తెలంగాణ, మతతత్వ తెలంగాణ కావాలన్న రీతిలో వ్యవహరిస్తోందన్నారు. కరెంట్ కోసం రోడెక్కిన రైతులను కాల్చి చంపిన నేతలు ఖమ్మంలో మాట్లాడారని, రైతులకు ఎరువులు ఇవ్వని కాంగ్రెస్ పార్టీ అన్నదాతల గురించి మాట్లాడడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. సమావేశంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్లు దావ వసంత, పుట్ట మధు తదితరులు పాల్గొన్నారు.

టీజీఓ కేలండర్ ఆవిష్కరణ



నాంపల్లి: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ నగర శాఖ నూతన కేలండర్‌ను గురువారం మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, టీజీఓ అధ్యక్షురాలు వి.మమత ఆవిష్కరించారు. టీజీఓ నగర శాఖ అధ్యక్షుడు డాక్టర్ గండూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, కోశాధికారి పి.రవీంద్ర కుమార్ గౌడ్, నగర శాఖ కోశాధికారి స్వర్ణలత, ఉపాధ్యక్షుడు ఎం.లక్ష్మారెడ్డి, నేతలు లావణ్య, డాక్టర్ యశోద, శివకుమార్, సోమశేఖర్, మహేష్, భీంసింగ్, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్' నిమ్స్!



అరుదైన చికిత్సలు.. పరిశోధనలతో ఉత్తమ గుర్తింపు పొందిన నిమ్స్ ఆస్పత్రి.. కొంత మంది వైద్యుల తీరుతో అభాసుపాలవుతోంది. -10లో

న్యూస్‌రీల్

రెండో ప్రీ- బిడ్ సమావేశానికి అనూహ్య స్పందన

సాక్షి, సిటీబ్యూరో: సంగారెడ్డి జిల్లా పరిధిలోని 17 ల్యాండ్ పార్సిల్స్ కొనుగోలుకు బిడ్డర్‌ల నుంచి అనూహ్య స్పందన లభించింది. గురువారం హెచ్ఎండీఏ అధికారులు గీతం యూనివర్సిటీలో నిర్వహించిన రెండో ప్రీ- బిడ్ సమావేశంలో బిడ్డర్‌లు పోటాపోటీగా పాల్గొన్నారు. సుమారు 150 మంది ఔత్సాహికులు, రియాల్టీ సంస్థల ప్రతినిధులు, స్థానికులు హాజరయ్యారు. సమావేశానికి హెచ్ఎండీఏ సెక్రటరీ చంద్రయ్య, ఎస్టేట్ ఆఫీసర్ (ఈవో) గంగాధర్, సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ నగేష్, హెచ్ఎండీఏ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీఓ) గంగాధర్‌లతో పాటు స్థానిక రెవెన్యూ అధికారులు హాజరయ్యారు. అమీన్‌పూర్, ఇస్నాపూర్, రామచంద్రాపురం పరిసర ప్రాంతాల్లో ల్యాండ్ పార్సిల్స్‌కు డిమాండ్ అధికంగా ఉన్నట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.

'కేబీఆర్' పాస్‌ల రెన్యూవల్ గడువు పొడిగింపు

ఈ నెల 7 దాకా అవకాశం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) నేషనల్ పార్క్ వార్షిక ఎంట్రీ పాస్‌ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 7 వరకు గడువు పెంచారు. జనరల్ కేటగిరీ రూ. 2750, సీనియర్ సిటిజన్‌లకు రూ. 1870గా నిర్ణయించారు. కేబీఆర్ పార్క్ వెబ్‌సైట్‌లో పాస్‌లను రెన్యూవల్ చేసుకోవచ్చని జిల్లా అటవీ శాఖ అధికారి వెల్లడించారు. వీటిని నెల రోజుల్లోపు పొందవచ్చన్నారు. కాగా.. రోజువారీ ఎంట్రీ ఫీజును కూడా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి రోజు ఎంట్రీ ఫీజు పెద్దలకు రూ. 45, పిల్లలకు రూ. 25గా నిర్ణయించారు. నెలవారీ పాస్ రూ. 770, వార్షిక పాస్ రూ. 2750, సీనియర్ సిటిజన్ పాస్ రూ. 1870గా నిర్ణయించారు. ఈ ధరలు జనవరి 1 నుంచి అమలులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

బకాయిలు చెల్లించకుంటే నల్లా కనెక్షన్లు కట్: దానకిశోర్



సాక్షి, సిటీబ్యూరో: ఏడాదికిపైగా బిల్లు చెల్లించని వాణిజ్య నల్లాల బకాయిలను తక్షణం వసూలు చేయాలని, వినియోగదారులు ముందుకురాని పక్షంలో సదరు కనెక్షన్లను తొలగించాలని జలమండలి ఎండీ దానకిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జలమండలి ఓఅండ్ఎం, రెవెన్యూ, ఎంసీసీ, సింగిల్ విండో తదితర విభాగాలపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎంసీసీకి వచ్చే ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రధానంగా కలుషిత నీరు, సీవరేజి ఓవర్ ఫ్లో, మిస్సింగ్ మ్యాన్ హోళ్లపై వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. నాన్ డొమెస్టిక్, నాన్ ఫ్రీ వాటర్ స్కీమ్ కనెక్షన్ల నుంచి బకాయిలు వసూలు చేయాలన్నారు. మొండిబకాయిదారులకు తక్షణం నోటీసులు జారీ చేయాలన్నారు. డొమెస్టిక్ స్లమ్ వినియోగదారులను బిల్లుల కోసం ఒత్తిడి చేయరాదని సూచించారు. కొత్త కనెక్షన్‌ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే మంజూరు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆపరేషన్స్ డైరెక్టర్ అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్2 స్వామి, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.

డైనోసర్లతో సరదాగా



మెరుపు మెరిస్తే.. వాన కురిస్తే.. ఆకసాన హరివిల్లు విరిస్తే.. తమ కోసమేనని సంబరపడతారు చిన్నారులు. ఆ బుడతలంతా ఓ చోట గుమిగూడితే ఇక సందడే సందడి. అటువంటి సందడి వాతావరణమే కనిపించింది బంజారాహిల్స్ రోడ్‌లోని లోటస్‌పాండ్- 2 డైనోసర్ పార్కులో. గురువారం ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు సరదాగా గడిపారు. డైనోసర్ల (రాక్షస బల్లులు) బొమ్మలతో ఫొటోలు దిగుతూ ఆహ్లాద వాతావరణంలో ఆనందంలో తేలియాడారు.

– బంజారాహిల్స్



కొట్టేసినా.. పట్టు చిక్కలే!

ఖరీదైన వస్తువులను తస్కరిస్తున్న దొంగలు

- వాటి విలువ తెలియక విక్రయించకుండా తమ దగ్గరే..
- నాలుగు కేసుల్లో ఊపిరి పీల్చుకున్న అధికారులు
- తాజాగా బంజారాహిల్స్ వజ్రాల ఉదంతంలోనూ..





సాక్షి, సిటీబ్యూరో: చోరాగ్రేసరులు ఓ టార్గెట్‌ను ఎంచుకుంటున్నారు.. కొన్నిసార్లు రోజుల పాటు రెక్కీ చేసి పథకం సిద్ధం చేస్తున్నారు.. అదను చూసుకుని పంజా విసురుతున్నారు... అత్యంత విలువైన వాటినే పట్టుకుపోతున్నారు. ఇలా కొట్టేసిన వాటి విలువ తెలియక, ఎలా విక్రయించాలో అర్థం కాని వీరు తమ దగ్గరే ఉంచుకుంటున్నారు. చోరీ సొత్తును సేల్ చేయడంలో చోరులు సఫలీకృతులై ఉంటే వారిని పట్టుకున్నా నష్టం తీర్చలేనిది, పూడ్చరానిది అని పోలీసులు చెబుతున్నారు. నగరం కేంద్రంగా ఇలాంటివి తరచూ వెలుగులోకి వస్తున్నాయి.

ముంబై వరకు వెళ్లి వచ్చినా...

పాతబస్తీలోని పురానీహవేలీలో ఉన్న హిజ్ ఎగ్జాల్టెడ్ హైనెస్ (హెచ్ఈహెచ్) నిజాం మ్యూజియంలో భారీ చోరీ జరిగింది. రాజేంద్రనగర్ వాసి మహ్మద్ ముబిన్, మహ్మద్ గౌస్ పాషా దాదాపు 35 రోజుల రెక్కీ తర్వాత ఈ పని చేశారు. వెంటిలేటర్ ద్వారా మ్యూజియంలోకి ప్రవేశించి, అల్మారా పగులకొట్టి టిఫిన్ బాక్స్, కప్‌సాసర్, స్పూన్ ఎత్తుకుపోయారు. రాజేంద్రనగర్ ఫాంహౌస్ సమీపంలో ఆ వస్తువుల్ని పాతిపెట్టారు. స్పూన్‌తో పాటు మిగిలిన వాటి ఫొటోలను తమ వద్ద ఉంచుకున్నారు. వీటిని ఖరీదు చేసే వారి కోసం ముంబై వెళ్లి ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు. చివరకు ఆ యత్నాల్లో ఉండగానే వస్తువులతో సహా చిక్కారు. ఆ టిఫిన్ బాక్స్‌లో నిజాం తిన్నారో తెలియదు గాని... గౌస్ మాత్రం బిర్యానీ భోంచేశాడు. అలాగే టీ కప్పులో మొబిన్ మంచినీళ్లు తాగి సంతృప్తి చెందాడు.

గూగుల్ సాయంతో గుడిలోకి వెళ్లినా..

గూగుల్ సాయంతో గుండేపూడి గుడిని గుర్తించి, దాని దగ్గరకు వెళ్లి అత్యంత విలువైన 12 పురాతన పంచలోహ విగ్రహాలను ఎత్తుకుపోయిన చోరులదీ ఇలాంటి కథే. ఆ సొత్తును ఎవరికి అమ్మాలో తెలియక కారులో పెట్టుకుని తిరుగుతూ రాచకొండ ఎస్ఓటీ పోలీసులకు పట్టుబడ్డారు. ఘరానా నేరగాడు కె.సంతోష్ గ్యాంగ్ భారీ చోరీకి స్కెచ్ వేసింది. గూగుల్‌లో సెర్చ్ చేసి పంచలోహ విగ్రహాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ రేటు ఉన్నట్లు గుర్తించారు. గూగుల్ ద్వారానే మహబూబాబాద్ జిల్లా గుండెపూడిలో ఉన్న పురాతన రామాలయం వద్దకు వెళ్లారు. పలుమార్లు రెక్కీ చేసిన తర్వాత సీతారామ లక్ష్మణ విగ్రహాలతో పాటు మరో 9 చిన్న విగ్రహాలను ఎత్తుకుపోయారు. ఈ మొత్తం 12 విగ్రహాలు తమ వద్ద ఉన్నప్పటికీ చోరీ సొత్తు మాదిరిగా అమ్మలేకపోయారు. పెద్ద విగ్రహాల విలువను లెక్కకట్టించడం కోసం వాటి కింది భాగం నుంచి చిన్న ముక్కలు కోసి తీశారు. ఈ పరీక్షలు ఎక్కడ చేయించాలో అర్థం కాక ఆగిపోయారు. ఇవి పంచలోహ విగ్రహాలు కావడంతో ఓ దశలో వాటిని కరిగించి బంగారం వేరు చేసి అమ్ముకోవాలని భావించారు. ఇవేవీ ఆచరణలోకి రాకుండానే కారు, విగ్రహాలతో సహా రాచకొండ పోలీసులకు దొరికారు.

ఆరితేరిన కర్రి సతీష్ కూడా...

చోరీల్లో ఆరితేరి, ఇప్పటి వరకు దాదాపు 50 కేసుల్లో నిందితుడిగా ఉన్న, నాలుగు రాష్ట్రాల్లో పంజా విసిరిన ఘరానా దొంగ కర్రి సతీష్. ప్రముఖులనే టార్గెట్ చేసుకుని ప్లాటినం నగలను కొట్టేశాడు. కానీ అమ్ముకోలేకపోయాడు. విశాఖపట్నంలోని కొత్తగాజువాకకు చెందిన ఇతడి ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వీళ్లు చెన్నైలోని డాక్టర్ కౌశిక్ ఇంట్లో పంజా విసిరారు. అక్కడున్న 146.6 గ్రాముల ప్లాటినం నగలు ఈ ముఠా ఎత్తుకుపోయింది. ఆ తర్వాత చెన్నైలోనే మరో రెండు, నెల్లూరులో ఒకటి, బంజారాహిల్స్ ప్రాంతంలో మూడు 'సంపన్న దొంగతనాలు' చేసింది. ఇలా ఎత్తుకువచ్చిన దాదాపు ముప్పావు కేజీ బరువున్న వజ్రాభరణాలు, దగ్గర దగ్గర కేజీ బంగారు నగలు అమ్మి క్యాష్ చేసుకుంది. ప్లాటినం నగల్ని అమ్మడానికి హైదరాబాద్‌తో పాటు కడప, పొద్దుటూరుల్లోనూ ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలమైంది. చివరకు ముంబైలో అమ్ముదామనే ప్రయత్నాల్లో అక్కడకు పట్టుకుని వెళ్తూ సొత్తుతో సహా చిక్కింది.

వజ్రాలను డబ్బాలో వేసి మూలకు...

గత నెలలో ఫిల్మ్‌నగర్‌లోని శమంతక డైమండ్స్ ఎల్ఎల్‌పీ జ్యువెలర్స్‌లో భారీ చోరీ జరిగింది. సింగాడ బస్తీకి చెందిన పవన్ కుమార్, అంజి, పవన్ ముప్పై లక్షల నగదు, వజ్రాలు ఉన్న లాకర్‌ను ఎత్తుకుపోయారు. సమీపంలోని శ్మశానంలో దాన్ని తెరిచి సొత్తుతో పాటు రూ.1.5 లక్షలు సొంతం చేసుకున్నారు. ఈ డబ్బుతో పాటు సొత్తును తాకట్టు పెట్టగా వచ్చినదాంతో గోవా, బెంగళూరుల్లో జల్సాలు చేశారు. తాము చోరీ చేసిన డైమండ్స్‌కు రూ.లక్షల విలువ ఉంటుందని వీళ్లకు తెలియలేదు. దీంతో వాటిని డబ్బాల్లో వేసి వాళ్ల గదుల్లో ఓ మూలన పెట్టారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వాటిని రికవరీ చేశారు.

పాదచారులకు ప్రాధాన్యం

- ప్రజారవాణా బలోపేతంతోనే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం
- నగరంలో ఫుట్‌పాత్‌లు, రోడ్ల విస్తరణపై కేటీఆర్ సమావేశం



సాక్షి, సిటీబ్యూరో: అభివృద్ధిలో దూసుకుపోతున్న హైదరాబాద్ లాంటి నగరంలో పాదచారులకు రక్షణ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, రోడ్ల విస్తరణ వంటి అంశాల్లో నిత్యం సవాళ్లు ఎదురవుతూనే ఉంటాయని మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కె.తారకరామారావు అన్నారు. ఎప్పటికప్పుడు కొత్త ప్రణాళికలను అమలు చేయడంతోనే ఈ సమస్యలు సమర్థంగా పరిష్కరించవచ్చన్నారు. నగరంలో ఫుట్‌పాత్‌ల నిర్మాణం, విస్తరణ, ప్రణాళికల రూపకల్పనకు సంబంధించి నగర పోలీస్ అధికారులతో పాటు జీహెచ్ఎంసీ, తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాదచారులకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

మౌలిక వసతులకు పెద్దపీట..

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే నగరంలో రోడ్ల విస్తరణ, నూతన మౌలిక వసతుల కల్పన, ఫుట్ పాత్‌ల నిర్మాణం వంటి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. నగరంలో అనేక చోట్ల కొత్తగా ఫ్లై ఓవర్లు, ఇతర రోడ్ల నిర్మాణాలు పూర్తైన నేపథ్యంలో వాటికి అనుబంధంగా ప్రస్తుతం ఉన్న రహదారులపై ఫుట్ పాత్‌ల నిర్మాణాన్ని కొనసాగిస్తూ పాదచారులు నడిచేందుకు మరింత సదుపాయంగా తీసుకోవాల్సిన చర్యలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

సైక్లింగ్ ట్రాక్‌లపై విస్తృత చర్చ..

తక్కువ దూరాలకు వాహనాలను ఉపయోగించాల్సిన అవసరం లేకుండా నడక లేదా సైకిల్ వంటి పద్ధతులను ప్రపంచ వ్యాప్తంగా కొన్ని నగరాల్లో ఉపయోగిస్తున్నారని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. పాదచారుల రక్షణ కోసం పోలీస్, ట్రాఫిక్ సిబ్బంది తగిన సహకారం అందించాలన్నారు. నగరంలో ఇప్పటికే 60 జంక్షన్లను జీహెచ్ఎంసీ అభివృద్ధి చేస్తోందని, పాదచారుల రక్షణకు ప్రాధాన్యమిస్తూ 12 జంక్షన్లలో మౌలిక వసతులను కల్పిస్తున్నట్టు జీహెచ్ఎంసీ అధికారులు మంత్రికి వివరించారు.

ఇదీ లెక్క!



90 లక్షలు దాటిన గ్రేటర్, శివారు ఓటర్లు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో అత్యధికంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 6,44,072 మంది ఓటర్లున్నారు. ఆ తర్వాత కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 6,12,700 ఓటర్లుండగా, చార్మినార్‌లో అత్యల్పంగా 2,14,774 ఓటర్లున్నారు. హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలు, మేడ్చల్ జిల్లాలోని 5 నియోజకవర్గాలు, రంగారెడ్డి జిల్లాలోని 5 నియోజకవర్గాలను పరిగణనలోకి తీసుకుంటే మొత్తం 91,86,375 మంది ఓటర్లు ఉన్నారు. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు నియోజకవర్గంలో కొంతభాగం మాత్రమే ఉండటంతో దాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. హైదరాబాద్ జిల్లాలో ముసాయిదా జాబితాలో 41.46 లక్షల ఓటర్లుండగా, తుదిజాబితాలో ఆ సంఖ్య 42.15 లక్షలకు పెరిగింది. ఓట్లు గల్లంతయిన వారితోపాటు కొత్త ఓటర్ల నమోదుతో ఈ సంఖ్య పెరిగింది.

ముగ్గా.. మురిపెం



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం డివిజన్ పరిధిలోని చిత్తారమ్మదేవి నగర్‌లో గురువారం 'సాక్షి' సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా.. హరివిల్లును నేలకు దింపినారా? అన్నట్లు ముగ్గులను తీర్చిదిద్దారు. ఆకట్టుకునే రంగవల్లులతో సంక్రాంతి శోభను కళ్లకు కట్టారు.



పారదర్శకతకు పాతర!

ఔట్ సోర్సింగ్ చేతుల్లో మెట్రో

- కీలక నిర్వహణ విధులన్నీ ప్రైవేటు ఏజెన్సీలవే
- ఉద్యోగుల నియామకాలు, జీతభత్యాలూ గోప్యంగానే..
- గుట్టు విప్పని నిర్వహణ సంస్థ కియోలిస్
- ప్రయాణికులపై త్వరలో చార్జీల బాదుడు



సాక్షి, సిటీబ్యూరో: మెట్రో ప్రాజెక్టులో రైళ్లు, స్టేషన్లు, డిపోలు, కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్ వ్యవస్థ నిర్వహణ, భద్రత.. ఇలా అతి కీలకమైన విధులన్నీ ప్రైవేటు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల చేతుల్లోనే ఉన్నాయి. ఈ విధానం తప్పు కాకపోయినా.. మెట్రో నిర్వహణ బాధ్యతలు దక్కించుకున్న అతిపెద్ద కియోలిస్ సంస్థ ప్రతీ పనిని తిరిగి పలు ప్రైవేటు ఏజెన్సీలకు సబ్‌కాంట్రాక్టు పేరిట అప్పజెప్పింది. సుమారు పదికిపైగా ప్రైవేటు ఏజెన్సీలు మెట్రో జర్నీలో పాలుపంచుకున్నాయి. ఇక్కడివరకు బాగానే ఉన్నా.. ఈ ఏజెన్సీలు చేపట్టే ఉద్యోగుల నియామకాలు, వారికి నెలవారీగా ఇచ్చే జీతభత్యాలు, కార్మికులు, ఉద్యోగుల భద్రతకు తీసుకుంటున్న చర్యలు.. చివరకు ఏ ఏజెన్సీ.. ఏ విధులు నిర్వహిస్తోందన్న విషయాల్లోనూ అంతులేని గోప్యత పాటించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

టికెటింగ్ సిబ్బంది సమ్మెతో..

తాజాగా స్టేషన్లలో టికెటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది అమీర్‌పేట్ స్టేషన్ వద్ద మెరుపు సమ్మెకు దిగడంతో ఆయా ఏజెన్సీల నిర్వాకం వెలుగుచూసింది. ప్రైవేటు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉప్పల్ మెట్రో డిపోలో జరిపిన చర్చలు, అరకొరగా పెంచిన వేతనాలు ఉద్యోగుల అసంతృప్తిని పూర్తిస్థాయిలో చల్లార్చకపోవడం గమనార్హం. మూడు కారిడార్లలో పని చేస్తున్న ఉద్యోగుల వేతనాల్లో వ్యత్యాసం ఉండడం, పని గంటలు, ఇతర భత్యాల విషయంలో తాము శ్రమదోపిడీకి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. నగర ప్రజారవాణా వ్యవస్థలో కొత్త శకం ఆవిష్కరించిన మెట్రో ప్రాజెక్టులో ఇలాంటి విపరిణామాలు చోటు చేసుకోవడం ఆక్షేపణీయమని ప్రజారవాణా రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ విషయంలో పారదర్శకత ఉండాలని, ఉద్యోగులకు కనీస వేతనాలు మంజూరు చేయాలని స్పష్టంచేస్తున్నారు.

- ఎల్బీనగర్- మియాపూర్, జేబీఎస్- ఎంజీబీఎస్, నాగోల్- రాయదుర్గం మూడు రూట్లలో నిత్యం 4 నుంచి 4.5 లక్షల మంది జర్నీ చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నప్పటికీ నష్టాల నుంచి ఇప్పట్లో గట్టెక్కే పరిస్థితులు దరిదాపుల్లో కనిపించడంలేదు. ప్రాజెక్టు నిర్మాణానికి గతంలో తీసుకున్న రుణాలు, వాటిపై వడ్డీ చెల్లింపులు, రైళ్లు, స్టేషన్లు, డిపోల నిర్వహణ భారంగా పరిణమించింది. ప్రభుత్వ పరంగా అందాల్సిన సాఫ్ట్‌లోన్ అందకపోవడం మెట్రోకు శాపంగా మారింది.
- ఈ నేపథ్యంలో తాజాగా చార్జీల పెంపునకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ప్రస్తుతం ఉన్న కనీస చార్జీని రూ.10 నుంచి రూ.20కి.. గరిష్ట చార్జీని రూ.60 నుంచి రూ.80 లేదా రూ.100 వరకు పెంచే అవకాశాలున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. చార్జీల పెంపుతో ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉండవన్న అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. నగరంలో అన్ని మెట్రో స్టేషన్ల నుంచి సమీప కాలనీలకు రవాణా సదుపాయం కల్పించకపోవడం, అన్ని స్టేషన్ల వద్ద ఉచిత పార్కింగ్ వసతుల లేమి కారణంగా ఆశించిన స్థాయిలో ప్రయాణికుల సంఖ్య పెరగడం లేదన్నది సుస్పష్టం.

నేరం జరిగితే..48 గంటల్లో పట్టేస్తాం!

- రాచకొండలో నేరాలు చేయాలంటే భయపడాలి
- రోడ్డు ప్రమాదాలతో సహా అన్ని రకాల నేరాలపై విశ్లేషణ
- రూరల్, అర్బన్ ప్రాంతాలకు తగినట్లు సేవలు
- సైబర్, రోడ్డు భద్రతకు ప్రాధాన్యం
- రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే భౌగోళికంగా అతిపెద్ద పోలీసు కమిషనరేట్ రాచకొండ. ఇది భువనగిరి, యాదాద్రి వంటి గ్రామీణ, కుషాయిగూడ, మల్కాజ్‌గిరి వంటి అర్బన్ ప్రాంతాలతో మిళితమై ఉంటుంది. రెండు ప్రాంతాల ప్రజల అవసరాలు, ఆకాంక్షలను నెరవేర్చేలా మిశ్రమ వ్యూహంతో పోలీసు సేవలందిస్తామని రాచకొండ సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. రోడ్డు ప్రమాదాలు, అన్ని రకాల నేరాలను సమయం, భౌగోళిక ప్రాంతాల వారీగా విశ్లేషిస్తామని, నేరం జరిగిన తర్వాత నిందితులు ఎక్కడున్నా సరే 48 గంటల్లో పట్టుకునేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. రాచకొండలో నేరం చేయాలంటే నిందితులు భయపడే స్థాయికి పోలీసు సేవలందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత చౌహాన్ తొలిసారిగా మీడియాతో గురువారం చిట్‌చాట్ నిర్వహించారు.

కాలేజీల దగ్గర గస్తీ వాహనాలు..

మహిళల భద్రత కోసం కాలేజీలు, కోచింగ్ సెంటర్ల వద్ద గస్తీ వాహనాలను ఉంచుతాం. విద్యా సంస్థల్లో మహిళ, సైబర్ భద్రతలపై అవగాహన కల్పిస్తాం. సున్నితమైన ప్రాంతాల్లో కమిటీలు, గ్రూప్‌లు, నివాసిత సంఘాలతో కలిసి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూస్తాం. ఆయా ప్రాంతాల్లో ప్యాట్రోలింగ్, సీసీ టీవీ కెమెరాల నిఘాలో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

హైవేలపై సీసీ కెమెరాలు..

రాచకొండలో 25 లక్షల వాహనాలు, 1,120 కి.మీ. మేర రహదారులున్నాయి. రాచకొండలో 53 కి.మీ. పొడవు ఉన్న విజయవాడ హైవేపై గతేడాది 110 మరణాలు జరిగాయి. నగరంలోని ఏ హైవేలపై చూసినా ఇదే అత్యధికం. హైవేలపై హిట్ అండ్ రన్ రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు 4 హైవేలపై సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం. పాదచారుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ హైవేలపై రెడ్ సిగ్నల్ పడినప్పుడు జీబ్రా క్రాసింగ్ దాటి వచ్చే వాహనాలకు భారీ జరిమానాలు విధిస్తాం. అలాగే ట్రాఫిక్ జాంకు కారణమయ్యే ఆర్టీసీ, ప్రైవేట్ బస్సు డ్రైవర్లకు తొలుత అవగాహన కల్పిస్తాం.

ఒక్క వాచ్‌మెన్, రెండు కెమెరాలు చాలు..

ఒక వాచ్‌మెన్, రెండు కెమెరాలు ఉంటే చాలు నేరాలు 80 శాతం తగ్గిపోతాయి. అందుకే నివాసిత సంక్షేమ సంఘాలు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా వారిని ప్రోత్సహిస్తాం. వాటి నిర్వహణ బాధ్యత రాచకొండ పోలీసులే చూసుకుంటారు. నంబర్ ప్లేట్‌లేని వాహనాలపై ఇక నుంచి వారంలో రెండుసార్లు ప్రత్యేక డ్రైవ్‌లు చేపడతాం.

ఓయూలో కారు బీభత్సం

ఇద్దరు విద్యార్థులకు గాయాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో గురువారం రాత్రి లేడీస్ హాస్టల్ సమీపంలో కారు బీభత్సం సృష్టించింది. యూనివర్సిటీ సెక్యూరిటీ అధికారి రాహుల్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..లేడీస్ హాస్టల్ సమీపంలో వేగంగా దూసుకొచ్చిన కారు ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురుకు స్పీడ్ బ్రేకర్ కనిపించకపోవడంతో ఐక్రీమ్ బండిని ఢీకొని ఫుట్‌పాత్ పైకి దుసుకెళ్లింది. ఈ ఘటనలో ఐక్రీమ్ బండి నుజ్జు నుజ్జుకాగా అటుగా వెళ్తున్న గణేష్, మల్లేష్ అనే ఓయూ విద్యార్థులు గాయపడ్డారు. చికిత్స కోసం వారిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఓయూ పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు అందాల్సి ఉంది.



ప్రమాదానికి కారణమైన కారు

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

దుండిగల్: భవనంపై నుండి ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయపడిన ఓ మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మెదక్ జిల్లా, కోనాపురం గ్రామానికి చెందిన బాగయ్య(52), స్వరూప దంపతులు నగరానికి వలస వచ్చి భౌరంపేట్‌లోని సింగపురి కాలనీలోని భవనంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 4న సాయంత్రం భవనం 6వ అంతస్తులో గోడలకు క్యూరింగ్ చేస్తున్న బాగయ్య ప్రమాదవశాత్తు అదుపు తప్పి కింద పడ్డాడు. అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో సూరారంలోని మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రికి తరలించారు. బాగయ్యను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

'ఆపరేషన్' నిమ్స్!

- చేయకుండానే చేశామంటూ డిశ్చార్జ్ సమ్మరీ
- చేయని ఆపరేషన్‌కు కుట్లు తీయాలన్న వైద్యులు
- ఇప్పుడు నా ఆపరేషన్ ఎవరు చేస్తారంటున్న బాధితుడు
- వైద్యుడి నిర్లక్ష్యమే కారణం : నిమ్స్ హెచ్‌ఓడీ

సాక్షి, హైదరాబాద్: క్లిష్టమైన రోగమైనా ఇక్కడ ఇట్టే నయమవుతుందనే నమ్మకం. కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.లక్షలు ఖర్చు చేసినా దొరకని స్పెషాలిటీ వైద్య సేవలు ఇక్కడ తక్కువ ధరకే లభిస్తాయనే భావన. అరుదైన చికిత్సలు..పరిశోధనలతో ఉత్తమ గుర్తింపు పొందిన నిమ్స్ నేడు కొంత మంది వైద్యుల తీరుతో అబాసు పాలవుతోంది. విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి తోడు అక్రమార్జనకు అలవాటు పడిన కొంత మంది వైద్యులు రోగులను మభ్యపెట్టి ఆస్పత్రికి చెడ్డపేరు తీసు కొస్తున్నారు. ఫలితంగా తక్కువ ధరకే నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం దెబ్బతింటోంది. తాజాగా ఓ వైద్యుడు రోగికి ఎలాంటి సర్జరీ చేయకుండానే చేసినట్లు డిశ్చార్జ్ సమ్మరీలో చూపించడమే కాకుండా ఆయన వద్ద నుంచి భారీగా నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఇప్పటి వరకు 15 మంది రోగుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందడంతో ఆస్పత్రి యాజమాన్యం సీరియస్ అయింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి ఛార్జీ మెమో జారీ చేయడంతో పాటు సమగ్ర విచారణ కోసం ద్విసభ్య కమిటీని ఏర్పాటు చేసింది.

సర్జరీ చేయకుండానే...చేసినట్లు రికార్డులు..

ఎల్లారెడ్డిగూడకు చెందిన వెంకటేశ్వర్‌రావు(47) వాంతులు, కళ్లు తిరిగే సమస్యతో బాధపడుతున్నారు. చికిత్స కోసం2 2021 ఏప్రిల్4న నిమ్స్ కు చేరుకున్నాడు. న్యూరాలజీ విభాగంలో వైద్య పరీక్షలు చేసిన వైద్యులు సమస్య ఉంది..ఆపరేషన్ చేయాలని చెప్పారు. తనకు ఆరోగ్యశ్రీ కార్డు ఉందని, అం దులోనే సర్జరీ చేయాలని సదరు బాధితుడు వైద్యులకు మొర పెట్టుకున్నాడు. ఆరోగ్యశ్రీ జాబితాలో ఈ చికిత్స లేదని, డబ్బులు కట్టి సర్జరీ చేయించుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. వైద్య ఖర్చులకు డబ్బు లేకపోవడంతో వెంకటేశ్వరరావు శస్త్రచికిత్స చేసుకోకుండానే ఇంటి ముఖం పట్టారు. అయితే, డాక్టర్లు ఇక్కడే తప్పులో కాలేశారు. డిశ్చార్జీ సమ్మరీలో వెంకటేశ్వరరావుకు సర్జరీ చేసినట్లు నమోదు చేయడమేగాకుండా.. కుట్లు తీయించుకునేందుకు ఫలానా తేదీనాడు రావాలని సూచించారు. ఆ తర్వాత కోవిడ్ మహమ్మారి చుట్టుముట్టడం..లాక్‌డౌన్ కారణంగా ఆయన ఆస్పత్రికి రాలేకపోయారు. ఇటీవల ఆనారోగ్య సమస్య తీవ్రం కావడంతో గతేడాది డిసెంబర్ 28న ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లారు. అక్కడి వైద్యుల సమాధానం విని బిత్తెరపోయారు. నిమ్స్ వైద్యులు రాసిన డిశ్చార్జీ సమ్మరీ చూసి వైద్యులు ఆశ్చర్య పోయారు. ఆపరేషన్ చేయక పోయినా... చేసినట్లు సమ్మరిలో పేర్కొనడంతో వారు చికిత్సకు నిరాకరించి.. మళ్లీ నిమ్స్‌కు వెళ్లమని తిప్పి పంపారు. దీంతో ఆయన గురువారం నిమ్స్ న్యూరాలజీ ఓపీకి వచ్చాడు. ఇంతకు ముందు నిన్నెవరు చూశారో వాళ్ల దగ్గరికి వెళ్లమని సలహా ఇచ్చారు. గతంలో చూసిన వైద్యుడెవరో తెలియని వెంకటేశ్వరరావు..ఏం చేయాలో అర్థంగాక తలపట్టుకున్నారు. ఇప్పటికే చికిత్స కోసం శక్తికి మించి ఖర్చు చేసుకున్న తనకు సర్జరీ కోసం మళ్లీ డబ్బులు సర్దుబాటు చేయడం తలకు మించిన భారమని వాపోయారు.

ఏసీబీకి ఫిర్యాదు చేసిన మరో బాధితుడు

అదే విధంగా బడంగ్‌పేటకు చెందిన అరుణ కుమార్ మెదడులో ఏర్పడిన కణితి సమస్యతో బాధపడుతూ నిమ్స్‌ను ఆశ్రయించాడు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత ఆపరేషన్ చేయాల్సి వస్తుంది.. డబ్బులు కట్టుకోవాల్సి వస్తుందన్నారు. ఆస్పత్రిలోని ఓ అధికారి సిఫార్సుతో వచ్చిన ఆ రోగికి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.50 వేలు కట్టించి పరీక్ష చేయించారు. అంతే కాకుండా ఓ అధికారి కూడా అతని వద్ద నుంచి ఆపరేషన్ చేయించేందుకు గానూ రూ. 20వేలు వసూలు చేశాడు. చివరికి ఆపరేషన్ చేయకుండానే డిశ్చార్జి చేశారు. సదరు బాధితుడు ఇటీవల ఏసీబీకి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ అంశాన్ని ఆస్పత్రి యాజమాన్యం తీవ్రంగా పరిగణించింది. సదరు అధికారికి ఛార్జీ మెమో జారీ చేయడంతో పాటు డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ సాయిబాబాలతో విచారణ కమిటీ వేసింది.

జేఎన్‌వీలో నేటి నుంచి 'రీజనల్ కల్చరల్ మీట్'

రెండు రోజులపాటు కార్యక్రమాలు

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డి జిల్లా ప్రాంగణంలో రెండు రోజులపాటు హైదరాబాద్ రీజనల్ కల్చరల్ మీట్ అండ్ ఆర్ట్ ఎగ్జిబిషన్–2022–23 కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ డానియల్ రత్న కుమార్ గురువారం 'సాక్షి'కి వివరించారు. జేఎన్‌వీ హైదరాబాద్ రీజన్ పరిధిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ రాష్ట్రాలు, పాండిచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాల్లోని జవహర్‌నవోదయ విద్యాలయాలు ఈ కార్యక్రమంలో పాల్గొంటాయన్నారు. ఆయా జేఎన్‌వీలకు చెందిన 250 మంది విద్యార్థులు, 40 మంది ఎస్కార్ట్ టీచర్లు, 25 మంది టీచర్లు హాజరుకానున్నట్లు తెలిపారు. గోపన్‌పల్లిలోని జేఎన్‌వీ రంగారెడ్డి ప్రాంగణంలో శుక్రవారం 3 గంటలకు హెచ్‌సీయూలోని సరోజినీ నాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ డీన్ ప్రొఫెసర్ వాసుకివెలవాడి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. గౌరవ అతిథిగా హాజరుకానున్న నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజన్ డిప్యూటీ కమిషనర్ టి గోపాల కృష్ణ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం జరిగే ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ముఖ్య అతిథిగా ఐఆర్‌టీఎస్ విశ్రాంత అధికారి డాక్టర్ ఆనందశంకర్ జయంత్, ఎన్‌వీఎస్ హైదరాబాద్ రీజన్ డిప్యూటీ కమిషనర్ టి గోపాల కృష్ణ హాజరుకానున్నట్లు తెలిపారు.



ప్రిన్సిపాల్ డానియల్ రత్నకుమార్

పట్టుకోండి చూద్దాం..

- పోలీసులకు సవాలు విసిరిన హ్యాకర్
- హ్యాకర్‌ను శిక్షించాలంటూ వీబీఐటీ కళాశాల విద్యార్థినుల తల్లిదండ్రుల నిరసన

ఘట్‌కేసర్: అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినుల ఫొటోలు మార్ఫింగ్ చేసి వాట్సాప్ గ్రూపులో పెడుతున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కళాశాల విద్యార్థులు, ఎస్ఎస్‌యూఐ, యూత్ కార్యకర్తలు కళాశాల ఎదుట గురువారం నిరసన చేపట్టారు. కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థినితో ప్రారంభించిన ఆగంతకుడు సుమారు 43 మంది విద్యార్థినిల్ల ఫోన్లు హ్యాక్ చేశాడు. వారి వ్యక్తిగత ఫొటోలు, డీపీ ఫొటోలు దొంగిలించి అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి పలు ఫోన్ నెంబర్లతో గ్రూపులో పెడుతూ, ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేస్తానని, వీడియో ఫోన్ చేయాలని సిమ్‌లు మారుస్తూ వేధిస్తున్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపిస్తూ విద్యార్థినుల తల్లితండ్రులు కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు.

పోలీసులకు సవాల్

హాస్టల్ విద్యార్థినుల ఆందోళన, పీఎస్‌లో ఫిర్యాదు చేయడంపై హ్యాకర్ స్పందిస్తూ దమ్ముంటే పట్టుకోవాలని, నన్ను ఏమీ చేయలేరని గురువారం పోలీసులకు సవాల్ చేశాడు. ఎవరికీ చెప్పొద్దంటూ విద్యార్థినులకు మెసెజ్ కూడా పెట్టడం గమనార్హం. అతడి వేధింపులు తీవ్రం కావడంతో విద్యార్థినులు కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేపట్టారు. కళాశాల గేటు మూసి వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గేటును విరగొట్టి మరి లోపలికి దూసుకెళ్లారు. సంఘటనా స్థలానికి చేరుకున్న మల్కాజ్‌గిరి ఏసీపీ నరేశ్‌రెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి, డీఐ జంగయ్య, అడ్మిన్ ఎస్సై నాగార్జున్‌రెడ్డి, ఎస్సైలు ధనంజయ, గ్యానేందర్‌రెడ్డి పరిస్థితిని పర్యవేక్షించారు.



వీబీఐటీ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

రెండు టీంలతో దర్యాప్తు: ఏసీపీ నరేశ్‌రెడ్డి

అమ్మాయిలను వేధిస్తున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వార్డన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయా నంబర్ల ఆధారంగా దర్యాప్తు చేపట్టామని ఏసీపీ నరేశ్‌రెడ్డి తెలిపారు. ఐటీ యాక్ట్ నిబంధనల మేరకు కేసు నమోదు చేశామని, నిందితుడిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా హ్యాకర్‌ను ప్రదీప్‌గా గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆందక్షణలో యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమోహన్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సుశాంత్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, బీరప్ప, మిత్రరెడ్డి, వినోద్, శివాజీ పాల్గొన్నారు.

అల్కాపురి కాల్పుల కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

చైతన్యపురి: చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్కాపురిలో గత నెల చోటుచేసుకున్న కాల్పుల కేసులో ప్రధాన నిందితుడిని, అతనికి ఆశ్రయం కల్పించిన మరో వ్యక్తిని చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డిసెంబర్ 1న అల్కాపురిలోని మహదేవ్ జువెలరీ షాపులో కాల్పులు జరిపి మూడు కేజీల బంగారు ఆభరణాలు, రూ.మూడు లక్షల నగదు దోచుకెళ్లిన విషయం తెలిసిందే. సీసీ కెమెరాల అధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు గత నెల 7న అంతర్రాష్ట్ర ముఠాలోని ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు గజ్వేల్‌లోని జయలక్ష్మి జువెలర్స్ నిర్వాహకుడు మహేందర్ కుమార్ పోలీసుల చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. గురువారం ఎల్‌బీనగర్ చిత్ర లేఅవుట్ ప్రాంతంలో అతడిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అతనితో పాటు మహేందర్‌కు ఆశ్రయం ఇచ్చిన సైదాబాద్ సింగరేణి కాలనీకి చెందిన ప్రకాష్‌చౌదరిని కూడా అరెస్ట్ చేశామన్నారు. ఘటన అనంతరం మహేందర్‌కుమార్ ఢిల్లీ, జోద్‌పూర్, బెంగుళూరు ప్రాంతాల్లో సంచరించినట్లు గుర్తించారు. గత నెల 13న జోద్‌పూర్ నుంచి నగరానికి వచ్చిన అతను మళ్లీ బస్సులో గి జోధ్‌పూర్ తిరిగి వెళ్లాడు. బిల్వాడా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వదిలి పెట్టిన ఎర్టిగా కారును తీసుకురావాలని తన స్నేహితుడు ప్రకాష్‌ను కోరాడు. అదే కారులో తిరిగి ఈ నెల 1న నగరానికి వచ్చిన మహేందర్, ప్రకాష్‌చౌదరి సికింద్రాబాద్‌లో కారులోనే బస చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వారి నుంచి కారు, రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. ఇదే కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు ఆయన వివరించారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



శంషాబాద్: ఓ ప్రయాణికుడు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు దుబాయ్ నుంచి ఈకే–528 విమానంలో గురువారం ఉదయం వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడిని పరిశీలించగా అతడి షూ లోపల దాచుకున్న బంగారు బిస్కెట్లు బయటపడ్డాయి. 480 గ్రాముల బరువు కలిగిన బంగారం విలువ రూ.27.78 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాదచారుల మృతికి కారకుడైన వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్: గత నెల 31న రాత్రి నూతన సంవత్సరం వేడుకల్లో మద్యం సేవించి మద్యం మత్తులోనే కారు నడుపుతూ రోడ్డు దాటుతున్న ఇద్దరు పాదచారుల మృతికి కారకులైన కేసులో ప్రధాన నిందితుడు కొడాలి ప్రణవ్‌ను బంజారాహిల్స్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనలో మరో నిందితుడు పోలసాని శ్రీవర్ధన్ తీవ్ర గాయాలతో సన్‌షైన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే... గత నెల 31న మాదాపూర్‌లో స్నేహితులతో కలిసి న్యూ ఇయర్ పార్టీ వేడుకలు ముగిసిన అనంతరం 1వ తేదీ తెల్లవారుజామున ప్రణవ్ తన కారులో స్నేహితుడు శ్రీవర్ధన్‌తో కలిసి మద్యం మత్తులో వేగంతో దూసుకొస్తూ బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని రాయల్ టిఫిన్ సెంటర్ వద్ద రోడ్డు దాటుతున్న అవిడి శ్రీను, భీమవరపు ఈశ్వరిలను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఈశ్వరి గాల్లోకి ఎగిరి టిఫిన్ సెంటర్ పక్కనే ఉన్న ఓ షాపు బోర్డును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. శ్రీనును కారు ఈడ్చుకుంటూ కొద్ది దూరం వెళ్ళగా డివైడర్ ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. వీరిద్దరి మృతికి కారకులైన ప్రణవ్, శ్రీవర్ధన్‌లకు కూడా గాయాలు కావడంతో వారిని సన్‌షైన్ ఆస్పత్రికి తరలించారు. కోలుకున్న ప్రణవ్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితుడు కొడాలి ప్రణవ్

రాయల్ టిఫిన్ సెంటర్‌పై కేసు...

గత నెల 31న రాత్రి ఒంటి గంట వరకే షాపులు, హోటళ్లు తెరిచి ఉంచేందుకు పోలీసు ఉత్తర్వులు ఉన్నాయి. అయితే బంజారాహిల్స్ రోడ్ నెం .2లోని రాయల్ టిఫిన్ సెంటర్ మాత్రం 31వ తేదీ రాత్రి మొత్తం తెరిచి ఉంచినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో సదకు టిఫిన్ సెంటర్‌పై కేసు నమోదు చేసేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. హోటల్‌కు వచ్చే వారు రోడ్డు పక్కనే వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో పార్క్ హయత్ వైపు నుంచి వేగంగా వాహనాలు ఈ మలుపు వద్ద ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీనికి తోడు ఈ నెల 1న శ్రీను, ఈశ్వరి, రాయల్ టిఫిన్ సెంటర్ బోర్డుకు ఢీకొని క్యాష్ కౌంటర్‌పై పడ్డారు. అయితే సదరు హోటల్ యజమాని సాక్ష్యాలు తారుమారు చేసేందుకు రెండు మృతదేహాలను రోడ్డుకు అవతల వేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సాక్ష్యాలను తారుమారు చేసినందుకు, రాత్రంతా హోటల్ తెరిచి ఉంచినందుకు ఈ హోటల్‌పై కేసు నమోదు చేయనున్నారు. ఇప్పటికే ఈ హోటల్‌ను సీజ్ చేశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ప్రశాసన్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ కింది ప్రాంతాల్లో శుక్రవారం కరెంట్ సరఫరా ఉండదని బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ ఎ.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు... జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్ ఏరియా, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, జర్నలిస్ట్ కాలనీ మెయిన్‌రోడ్డు, నాదగిరి హిల్స్, లక్ష్మారెడ్డి ఇంటి పరిసరాలు, కోట బిల్డింగ్ ఏరియాలో కరెంట్ సరఫరా ఉండదన్నారు.
- మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు... మహేష్‌బాబు పాత ఇంటి ఎదురు గల్లీ, కోట బిల్డింగ్ వెనుక వైపు, లంబాడీ బస్తీ, కార్వీ గెస్ట్ హౌస్ ప్రాంతాలు. ఫిల్మ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జగ్గారావు ఏరియా, సాయిబాబా టెంపుల్, రామానాయుడు ఫిల్మ్ ఛాంబర్, అపోలో ఆసుపత్రి ఏరియా, మిలాన్ టెంట్‌హౌస్, పద్మాలయ స్టూడియో, బాటా షోరూం మెయిన్‌రోడ్డు ప్రాంతాలు.
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. సూర్యోదయ కాంప్లెక్స్, నల్లి శిల్క్ శారీస్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ కిశోర్‌కుమార్ తెలిపారు.

8న 'ది లెజెండ్స్ ఆఫ్ జ్యోతిర్లింగం'

పంజగుట్ట: భాగ్యనగర్ జ్యోతిర్లింగం టీం ఆధ్వర్యంలో కేంద్ర సాంస్కృతిక శాఖ సహకారంతో ఈ నెల 8న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌లో 'ది లెజెండ్స్ ఆఫ్ జ్యోతిర్లింగం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భాగ్యనగర్ జ్యోతిర్లింగం టీం చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశంలోని 12 జ్యోతిర్లింగాల విశిష్టతను నృత్యరూపంలో ప్రముఖ నృత్యకారిణి కణక సుధాకర్ 2 గంటల 10 నిమిషాలు ప్రదర్శిస్తారన్నారు. ఎలాంటి ప్రవేశ రుసుము లేదని, అందరూ ఆహ్వానితులే అని అన్నారు. కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి స్వామి హాజరవుతారన్నారు. సమావేశంలో కో చైర్మన్లు కాశీనాథ్ లంకరాజు, సుధాకర్ శర్మ, అధ్యక్షుడు సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

రేపు 'మెరుగైన రేపటి కోసం విద్యలో విలువలు' సదస్సు

పంజగుట్ట: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, బ్రహ్మకుమారీల రాజయోగ ఎడ్యుకేషన్, రీసెర్చ్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఈ నెల 7న 'మెరుగైన రేపటి కోసం విద్యలో విలువలు, ఆధ్యాత్మికత' అనే అంశంపై అధ్యాపకులకు సింపోజియం నిర్వహిస్తామని హిమాయత్ నగర్ ఇన్‌చార్జి సిస్టర్ అంజలి, చేలాపుర సెంటర్ ఇన్‌చార్జి సిస్టర్ రజని, రామాంతపూర్ ఇన్‌చార్జి సిస్టర్ కవిత తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నిర్వహించే ఈ సింపోజియంలో రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్, హైదరాబాద్ వర్సిటీ వీసీ బీజే రావు తదితరులు పాల్గొని అధ్యాపకులు అవసరమైన నైపుణ్యాలు ఎలా పెంపొందించుకోవాలో వివరిస్తారన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దాసోజు శ్రావణ్ తదితరులు

హిమాయత్‌నగర్: ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో యువత పెద్ద ఎత్తున రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు దాసోజు శ్రావణ్ అన్నారు. హిమాయత్‌నగర్ బీఆర్ఎస్ నాయకుడు అనీష్‌గంగపుత్ర రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను గురువారం ఆయన కట్టెల శ్రీనివాస్ యాదవ్, అంజన్‌కుమార్, శాస్త్రి, పీటర్‌లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం దాసోజు శ్రావణ్ మాట్లాడుతూ.. సమస్యలున్న ప్రాంతాల్లో యువత స్పందించి అధికారుల దృష్టికి తేవాలన్నారు. దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు.

మర్యాదపూర్వక కలయిక



సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర డీజీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అంజనీకుమార్ గురువారం రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంజనీకుమార్‌ను మంత్రి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మరో ఏడాది ఉచిత బియ్యం

- పంపిణీని పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం
- ఖైరతాబాద్‌లో 2,85,267 మందికి లబ్ధి
- ఒక్కొక్కరికి ఐదు కిలోలు
- రేపటి నుంచి పంపిణీ



రేషన్ షాపు వద్ద లబ్ధిదారులు

బంజారాహిల్స్: ఆహార భద్రతా కార్డు లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆహార భద్రత కింద ఉచిత బియ్యం పంపిణీని మరో ఏడాదిపాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్–07 పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడ, బోరబండ, వెంగళ్‌రావునగర్, ఎర్రగడ్డ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 81 రేషన్ షాపుల్లో 83,127 తెల్లరేషన్ కార్డుదారులు లబ్ధి పొందనున్నారు.

- సర్కిల్–7 పరిధిలో మొత్తం తెల్లరేషన్ కార్డులు 83,127, అన్నపూర్ణ కార్డు 1, అంత్యోదయ అన్నయోజన కార్డులు 3368 ఉన్నాయి. ఈ మొత్తం కార్డుల్లో 2,85,267 మంది లబ్ధిదారులున్నారు. పొడిగించిన ఉచిత బియ్యం వీరందరికీ లబ్ధి చేకూర్చనుంది.
- కరోనా కష్టకాలంలో ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్న పేదలను ఆదుకునేందుకు కేంద్రం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పేరిట ఉచిత రేషన్ బియ్యం పంపిణీ చేసిన విషయం తెలిసిందే.
- గత మార్చి నుంచి ఆరు నెలలు, ఆ తర్వాత మరో మూడు నెలలు ఉచిత బియ్యం అందించింది. గత నెల 31తో గడువు తీరిపోనుండటంతో మరో ఏడాది పాటు ఉచిత బియ్యం పేదలకు అందించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది.
- దీంతో 2023 జనవరి నుంచి డిసెంబర్ వరకు ఏడాది పాటు ఒక్కో కార్డులో ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున బియ్యం ఉచితంగా అందించనున్నారు.
- డిసెంబర్ కోటాలో ఇప్పటికే ఉచిత బియ్యం పంపిణీ పూర్తయింది. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.
- కేంద్రం నుంచి ఉత్తర్వులు రావడంతో పౌరసరఫరాల శాఖాధికారులు సర్కిల్ పరిధిలోని 81 మంది రేషన్ డీలర్లకు ఉచితం బియ్యం కోటా పంపిణీని పూర్తి చేశారు.
- రోజురోజుకు పెరుగుతున్న ధరలతో నిత్యావసర సరుకులు కొనుగోలు చేయలేని పరిస్థితిలో ఉన్న ప్రజలకు ఈ ఉచిత బియ్యం పంపిణీ వరం కానుంది.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాని ఉత్తర్వులు

రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉచిత బియ్యంపై ప్రకటన రాకపోవడంతో ఈ నెల 5 కిలోల బియ్యమే ఒక్కొక్కరికి పంపిణీ చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పది కిలోల ఉచిత బియ్యం వస్తాయని అంతా భావించారు. అయితే 5వ తేదీ వరకు కూడా ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి అన్ని రేషన్ దుకాణాల్లో కార్డులో ఉన్న ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే గోదాముల ద్వారా బియ్యం డీలర్లకు తరలించారు.

ట్రాఫిక్ మళ్లింపుపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే దానం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లో రూ. 27 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కాగా డీఏవీ స్కూల్ నుంచి వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. అయితే రోడ్డు ఇరుకుగా ఉండటంతో రోడ్డు వేసే క్రమంలో ట్రాఫిక్ డైవర్షన్ అవసరమని భావించిన జీహెచ్ఎంసీ ఇంజినీర్లు గురువారం బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ టి. నరసింహరాజుతో పాటు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. రోడ్డు పనులు పూర్తయ్యేదాకా ట్రాఫిక్‌ను ఏ రకంగా మళ్లించాలనే దానిపై సమావేశంలో చర్చించారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే స్థానికంగా వాహనాల రాకపోకలకు మరింత తేలికవుతుందని పనులు పూర్తయ్యేదాకా స్థానికులు కూడా ఇంజినీర్లకు సహకరించాలని ఎమ్మెల్యే దానం సూచించారు.

నాగార్జునహిల్స్‌లో సీవరేజి పనులకు శంకుస్థాపన



సీవరేజి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దానం

వెంకటేశ్వరకాలనీ: పంజగుట్ట నాగార్జున హిల్స్‌లో రూ. 24 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన 300 ఎంఎం డయా సీవరేజి పైప్‌లైన్ పనులకు గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ , వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. తరచూ ఇక్కడ మురుగు పొంగుతూ స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామన్నారు. ఈ పనులు పూర్తయితే స్థానికంగా డ్రైనేజీ సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సి. రాములు చౌహాన్, బీఆర్ఎస్ నేతలు ఆనంద్, అక్బర్, సునీల్, రాజ్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, షీ టీమ్ పోలీసులు

వెంగళరావునగర్ : విద్యార్థినులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం షీ టీం పోలీసులు విద్యార్థినులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థినులకు ఏదైనా అనుకోని సంఘటన జరిగితే తక్షణమే షీ టీంకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. అపరిచితులతో మాట్లాడకూడదని, వారు ఏం ఇచ్చినా తీసుకోరాదని, వారి కదలికలను కనిపెడుతూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం నరసింహ, ఎన్‌సీసీ అధికారి ప్రభాకర్, పీడీ కరుణ, షీ టీం పోలీసులు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అనహిత'లో రోజ్ గార్డెన్ కలెక్షన్స్



సాక్షి, సిటీబ్యూరో: డిజైనర్ దుస్తుల సీజనల్ కలెక్షన్స్ నగరవాసులకు అందుబాటులోకి వచ్చాయి. బంజారాహిల్స్‌లోని అనహిత బొటిక్‌లో గురువారం వీటిని విడుదల చేశారు. రోజ్ గార్డెన్ పేరిట రూపొందించిన ఈ కలెక్షన్స్ అన్ని సందర్భాలకు అనుగుణంగా అమరిపోతాయని, దుస్తులతో పాటు ఫ్యాన్సీ జ్యువెలరీ కూడా ఈ కలెక్షన్స్‌లో భాగమని ఈ సందర్భంగా బొటిక్ నిర్వాహకులు తెలిపారు. పలువురు యువతులు లేటెస్ట్ కలెక్షన్లను ప్రదర్శించారు.

పవన్ కల్యాణ్ ఇంటి ఎదుట మహిళ హంగామా



పోలీసులు అదుపులోకి తీసుకున్న మహిళ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 35లోని సినీ నటుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇంటి ఎదుట గురువారం ఉదయం ఓ మహిళ హల్‌చల్ చేసింది. తాను పవన్ కల్యాణ్‌ను కలవాలంటూ అక్కడున్న సెక్యూరిటీతో వాగ్వాదానికి దిగింది. రాళ్లతో చుట్టుపక్కల వారిని కొడుతూ దుస్తులు తీసేసి నగ్నంగా అటూ ఇటూ తిరుగుతూ న్యూసెన్స్‌కు పాల్పడింది. మహ్మద్ హసన్ అలీ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు వచ్చి ఆమెను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు సదరు మహిళ గురించి ఆరా తీయగా ఆమె తమిళనాడు రాష్ట్రంలోని మధురై వైఓత్త కాడై ప్రాంతానికి చెందిన జాయిస్ కమల(36)గా తేలింది. గతంలో కూడా ఆమె హీరో సాయిధరమ్ తేజ్ ఇంటి ముందు ఇలాగే న్యూసెన్స్‌కు పాల్పడగా పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఆమె మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయానికి తరలించారు. మతిస్థిమితం లేకపోవడంతోనే ఇలా ఈమె గతంలో కూడా సినీ హీరోల ఇంటి వద్ద నగ్నం తిరుగూ న్యూసెన్స్ చేసిందని పోలీసులు గుర్తించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సుల కుదింపు యోచన విరమించుకోవాలి

- బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి

లిబర్టీ: ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఆర్టీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సింది పోయి విధ్వంసం చేసే చర్యలకు పాల్పడటం సమంజసం కాదన్నారు. దళ్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న 8350 బస్సుల సంఖ్యను 5272కు కుదించాలని యాజమాన్యం యోచించడాన్ని తప్పుబట్టారు. టీఎస్ ఆర్‌టీసీని కుదించడం వల్ల ప్రజలకు రవాణా సౌకర్యానికి ఇబ్బందులు కలుగుతాయని, ప్రైవేట్ ఆపరేటర్ల దోపిడీ పెరుగుతుందన్నారు. ఆర్టీసీలో కుదింపు చర్యలకు స్వస్తి పలకాలని, లేకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని కుమారస్వామి హెచ్చరించారు.

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించొద్దు



ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు

హిమాయత్‌నగర్: ''హెల్మెట్ ధరించండి, మద్యం తాగి వాహనం నడపొద్దు, ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించి ప్రమాదాల బారిన పడొద్దు'' అంటూ ప్లకార్డులతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హిమాయత్‌నగర్‌లోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు గురువారం ట్రాఫిక్ అవగాహన ర్యాలీ చేపట్టారు. ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసుల సమక్షంలో ప్రిన్సిపల్ జ్యోతి, ఏజీఎం సతీష్‌లు ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ..ట్రాఫిక్ రూల్స్ విషయంలో విద్యార్థి దశ నుంచే చిన్నారులకు అవగాహన ఉంటే పెద్దయ్యాక వారు రూల్స్‌ని అతిక్రమించరని అన్నారు.

పబ్లిక్ టాయిలెట్‌తో ట్రా'ఫికర్'!

- రహమత్‌నగర్ మూల మలుపులో నిత్యం నిలిచిపోతున్న వాహనాలు
- టాయిలెట్‌ను తొలగించాలని అధికారులకు వాహనదారుల విజ్ఞప్తి



రహమత్‌నగర్ మూల మలుపు వద్ద నిలిచిపోయిన వాహనాలు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ మూల మలుపు వద్ద ఉన్న పబ్లిక్ టాయిలెట్ కారణంగా వాహనాలు నిలిచి పోతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. గ్రంథాలయ మూలమలుపు వద్ద నిమ్స్ మే మైదానం గోడ వద్ద జీహెచ్ఎంసీ పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటు చేసింది. అసలే ఇరుకైన మూల మలుపు కావడం, దారి పక్కనే టాయిలెట్ ఉండటంతో వాహనాలు తిరిగేందుకు దారి లేక ట్రాఫిక్ జామ్ అవుతోంది. దానికి తోడు ఇదే ప్రాంతంలో కొంత మంది వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో మలుపు వద్ద ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బంది అవుతోందని, ఈ సమస్య నిత్యకృత్యంగా మారుతోందని వాహనదారులు మండిపడుతున్నారు. ప్రధానంగా సాయంత్ర వేళల్లో ఒక్కోసారి గంటల తరబడి వాహనాలు ట్రాఫిక్‌లో నిలిచి పోవాల్సి వస్తోందని ప్రయాణికులు అంటున్నారు. నిరుపయోగంగా ఉన్న పబ్లిక్ టాయిలెట్ తొలగిస్తే కొంత వరకైనా రహదారిపై ట్రాఫిక్ సమస్య తొలగే అవకాశం ఉందని, జీహెచ్ ఎంసీ అధికారులు స్పందించి పబ్లిక్ టాయిలెట్‌ను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

అంధుల పాఠశాలను సందర్శించిన విద్యార్థులు

శ్రీనగర్‌కాలనీ: వరల్డ్ బ్రెయిలీ డే సందర్భంగా ఎర్రగడ్డ సంస్కార్ ది లైఫ్ స్కూల్ విద్యార్థులు బేగంపేట దేవనార్ బ్లైండ్ స్కూల్‌ను సందర్శించారు. బ్రెయిలీ లిపి గురించి, ఇక్కడి అంధులు ఎలా చదువుతారనేది ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫిస్ట్ ఆఫ్ రైస్‌లో ముఖ్య భూమిక పోషిస్తున్న స్కూల్ విద్యార్థులు ఉచితంగా బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయండి

లిబర్టీ: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ దళిత బహుజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు వలిగొండ శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమైక్య కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మొత్తం 40 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందడం లేదన్నారు. ప్రధానంగా సైన్సు, గణితం, ఇంగ్లిషు బోధించే ఉపాధ్యాయులు లేరని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని శ్రీనివాస్ కోరారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: అప్పులబాధ తాళలేక రైలుకింద పడి ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం సికింద్రాబాద్ రైల్వేపోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మౌలాలి హౌసింగ్‌బోర్డుకు చెందిన విప్పలపల్లి రాజశేఖర్ (45) ఎలక్ట్రీషియన్ . వృత్తితో సరైన ఆదాయం లేకపోవడంతో అప్పులపాలయ్యాడు. రెండేళ్లుగా వృత్తిగా దూరంగా ఉంటుండటం, అప్పుల బాధ నేపథ్యంలో లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించగా తీవ్ర గాయాలయ్యాయి. రైల్వే సిబ్బంది అంబులెన్స్‌లో రాజశేఖర్‌ను నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ అతడు మృతి చెందాడని పోలీసులు తెలిపారు.



నాణ్యతతో రోడ్డు నిర్మించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని పంచవటి కాలనీలో రూ. 42 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఇంజినీర్లకు సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడొద్దన్నారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే స్థానికంగా ట్రాఫిక్ సమస్య చాలా వరకు పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఆదర్శం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు యావత్ భారతావనికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను దేశం అనుసరిస్తున్నదన్నారు. ఆడపిల్లల పెళ్లికి అండగా నిలబడతూ వారికి ఆర్థిక సాయం చేస్తున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. అత్యధిక సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈ ఎనిమిదేళ్లలో సనత్‌నగర్ నియోజకవర్గంలో వందలాది కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గత పాలకులు పట్టించుకోని దీర్ఘకాలిక సమస్యలను సైతం సవాల్‌గా తీసుకుని పరిష్కరించామన్నారు. సనత్‌నగర్ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా సబ్‌స్టేషన్ స్థలాన్ని సేకరించి బాటిల్‌నెక్‌గా ఉన్న అక్కడి మూల మలుపును సైతం విశాలంగా విస్తరించి ట్రాఫిక్ వెతలను తీరుస్తామన్నారు. కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, జమీర్‌బేగ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

చేనేతలను ప్రోత్సహిద్దాం



శ్రీనగర్‌కాలనీ: చేనేత కళాకారులను ప్రోత్సహించేలా ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని వర్ధమాన నటి సౌమ్యా జాను అన్నారు. గురువారం గ్రామీణ హస్తకళావికాస్ సమితి ఆధ్వర్యంలో శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–2023ను ఆమె ప్రారంభించారు. ఇక్కడి వస్త్రాలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయని, ఈ ఎక్స్‌పో నగర ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటుందన్నారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ ఆభరణాలు, చీరలను ఇక్కడ అందుబాటులో ఉంచామని, ఈనెల 10 వరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకుడు జయేష్ గుప్తా తెలిపారు.

రూ.1.92 కోట్లతో మురుగు సమస్యకు మోక్షం



నాగార్జున సర్కిల్‌లో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని నాగార్జున సర్కిల్, పంజగుట్ట రోడ్డులో డ్రైనేజీ పొంగి రోడ్లన్నీ మురుగుతో నిండిపోయాయి. దుర్గంధం, దుర్వాసనతో స్థానికులు, వాహనదారులు ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. జలమండలి సిబ్బంది తాత్కాలిక మరమ్మతులు చేస్తూ మ్యాన్‌హోళ్ల నుంచి బురద, మట్టి వ్యర్థాలను తొలగిస్తున్నా... పరిస్థితి అదుపులోకి రావడం లేదు. ఇక్కడ వరదనీటి పైప్‌లైన్ లేకపోవడంతో వాణిజ్య భవనాల సెల్లార్ల నుంచి వస్తున్న ఊట నీటిని నేరుగా సివరేజీ లైన్లలోకి వదిలేస్తున్నారు. అలాగే ఇటీవల ఇక్కడ బీటీ రోడ్డు వేశారు. జీహెచ్ఎంసీ ఇంజినీర్లు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లపై బీటీ వేయించడంతో అది మ్యాన్‌హోళ్లలోకి చేరింది. ఫలితంగా మ్యాన్‌హోళ్లు నిండిపోయి మురుగు మొత్తం రోడ్లపై పారుతోంది.

సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే దృష్టి..

ఈ సమస్యలను పరిష్కరించడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుతం ఉన్న 300 ఎంఎం డయా లైన్ సరిపోవడంలేదని, కొత్తగా 450 ఎంఎం డయా పైప్‌లైన్ వేసేందుకు వెంటనే రూ.1.92 కోట్లను మంజూరు చేయాలని జలమండలి ఎండీ దాన కిషోర్‌ను దానం కోరారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేస్తామని వారు హామీ ఇచ్చారని దానం తెలిపారు. త్వరలోనే ఇక్కడ పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

క్లుప్తంగా...

రూ.100 కోట్లతో పాత్రికేయుల సంక్షేమ నిధి

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పాత్రికేయుల సంక్షేమానికి రూ.100 కోట్లతో సంక్షేమ నిధి ఏర్పాటు చేసి.. ఇప్పటి వరకు ఆరేళ్లలో ప్రభుత్వం రూ.42 కోట్లు విడుదల చేసిందని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. గురువారం జార్ఖండ్ ప్రెస్ సలహా సమితి సభ్యులు అల్లం నారాయణను కలిశారు. పాత్రికేయుల సంక్షేమం, శిక్షణకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను జార్ఖండ్ పాత్రికేయులు ప్రశంసించారు. 16 మంది సభ్యులతో కూడిన ఈ బృందం గురువారం తెలంగాణ మీడియా అకాడమీని సందర్శించింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారుల బాధ్యతల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: ఇటీవల బదిలీ అయిన పలువురు పోలీస్ అధికారులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు అడిషనల్ డీజీ శివధర్‌రెడ్డి డీజీపీ కార్యాలయంలో రైల్వేస్, రోడ్డు భద్రత ఏడీజీగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయంలో పర్సనల్ విభాగం ఐజీగా వీబీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ డీజీ శివధర్‌రెడ్డి నుంచి గురువారం బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయంలో ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్ (పీ అండ్ ఎల్) విభాగం డీఐజీగా నియమితులైన ఎం.రమేశ్ కూడా అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీజీపీ అంజనీకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

'కేసీఆర్ కనుసన్నల్లో మరో ప్రాంతీయ పార్టీ'

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి తర్వాత సీఎం కేసీఆర్ కనుసన్నల్లో తెలంగాణ పేరుమీద మరో ప్రాంతీయ పార్టీ రాబోతున్నదని బీజేపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ జోస్యం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పట్ల, నాయకత్వం పట్ల రోజురోజుకూ ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుండటంతో కుర్చీని కాపాడుకుని, కుటుంబాన్ని నిలబెట్టుకునేందుకు కేసీఆర్ ఒక్కోపార్టీని ముందుకు తెస్తున్నారన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జిగా కొత్తగా మాణిక్‌రావు ఠాక్రే వచ్చినా, పాత ఇన్‌చార్జి మాణిక్కం ఠాగోర్ వెళ్లినా అది ముమ్మాటికీ కేసీఆర్ కాంగ్రెసేనని ఆరోపించారు. ఇప్పటికే ఈ చక్రవ్యూహంలో వామపక్షాలు పడ్డాయని, మొన్నటివరకు ఆ పార్టీలు చెప్పిన మాటలకు.. ఇప్పుడు వెలిబుచ్చుతున్న అభిప్రాయాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

బాబు వాడుకున్నారు.. జనం ఆడుకున్నారు

టీడీపీ గిమ్మిక్కును బయటపెట్టి.. ఎండగట్టిన నెటిజన్లు

- భారీగా జనాన్ని చూపించడానికి మొదట సందుల్లోకి సభ
- అక్కడ 8 మంది మరణించటంతో.. తరవాత కానుకల ఎత్తుగడ
- మాట తప్పి మోసం చేయటంతో ముగ్గురి ప్రాణాలు బలి
- ఇక కుప్పంలో బాబు సభను ఏమాత్రం పట్టించుకోని జనం
- దీంతో భారీగా జనం హాజరయ్యారంటూ 'మార్ఫింగ్' ఫోటోలు
- సిద్ధేశ్వర స్వామి అంతిమయాత్ర ఫోటోలను వాడేసిన ఎల్లో ముఠా

సాక్షి, అమరావతి: జనాదరణ పోయింది. పిలిచినా సభలకు రావటం లేదు. దీంతో ఒకరోజు ఇరుకు సందుల్లోనే సభ పెట్టబోయారు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు. ఆ సాహసానికి.. పాపం 8 మంది అమాయకులు బలైపోయారు. జనం రద్దీ బాగా కనిపించే డ్రోన్‌షాట్ల కోసం ఇరుకు రోడ్లోకి వాహనాన్ని పోనిచ్చి... అక్కడ చంద్రబాబు మాట్లాడబోగా, అప్పటికే ఉన్న జనం వెనక్కివెళ్లే తొందర్లో ఒకరిపై ఒకరు పడి... పాపం ప్రాణాలు కోల్పోయారు. దీంతో జనాన్ని రప్పించడానికి వారికి కానుకల ఆశ చూపించారు చంద్రబాబు. విలువైన చీర, ఇతర సరుకులు ఇస్తామని నమ్మబలికి టోకెన్లు పంచి మరీ వేల మందిని రప్పించారు. కానీ చౌకబారు చీరలతో నాసిరకం కానుకలిచ్చారు. అది కూడా టోకెన్లున్న వారందరికీ ఇవ్వకపోవటంతో అక్కడా తోపులాట తప్పలేదు. పాపం.. మరో ముగ్గురు బలైపోయారు. ఎలాగైనా తమకు జనాదరణ తగ్గలేదని చూపించడానికి చంద్రబాబు ముఠా ఎల్లో మీడియా, సోషల్ మీడియా వేదికగా మరో దుస్సాహసానికి దిగింది. చంద్రబాబును చూసేందుకు ప్రజలు భారీగా తరలి వచ్చారంటూ సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలను ఈ ముఠా వైరల్ చేసింది. 'కుప్పం గడ్డ.. ఇది చంద్రబాబు అడ్డా' అనే నినాదాలతో విపరీతంగా జనం కనిపిస్తున్న ఆ ఫొటోలను కొన్ని ఎల్లో చానెళ్లు కూడా ప్రసారం చేశాయి. ఇక సోషల్ మీడియాలో అయితే టీడీపీ బ్యాచ్ మొత్తం ఈ ఫోటోలను షేర్ చేస్తూ శివాలెత్తిపోయింది. బాబును ప్రభుత్వం ఎంతలా అడ్డుకున్నా జనం ఆయన వెంటే ఉన్నారంటూ కామెంట్లు కూడా ఊదరగొట్టేశారు. కానీ నిజమేంటో తెలుసా? ఆ ఫోటోలు కుప్పంలోనివి కాదు. అసలు చంద్రబాబుకే కాదు... ఈ రాష్ట్రానికే సంబంధం లేని ఫోటోలు. కర్ణాటక రాష్ట్రంలో అత్యంత ప్రముఖుడిగా గుర్తింపు పొందిన సిద్ధేశ్వర స్వామి సోమవారం మరణించగా... ఆయన అంతిమ యాత్రకు దాదాపు 2 లక్షల మంది భక్తులు, సామాన్య ప్రజలు హాజరయ్యారు. లింగాయత్ సంప్రదాయానికి చెందిన సిద్ధేశ్వర స్వామి... దశాబ్దాల పాటు సమాజానికి విశేష సేవలు అందించి కర్ణాటక వ్యాప్తంగా విశేష గుర్తింపు పొందటంతో జనం తండోపతండాలుగా వచ్చారు. భక్తుల్లో చాలామంది పసుపు రంగు దుస్తులు ధరించి ఉండటం... వాహనానికి కూడా పసుపు రంగు ఉండటంతో ఇది తమకు సరిగ్గా మ్యాచ్ అవుతుందనుకున్న టీడీపీ వర్గాలు... ఆ ఫోటోలను, వీడియోలను డౌన్‌లోడ్ చేసి తమ బాబు సభకు వచ్చిన జనం అంటూ వైరల్ చేసేశాయి.

కుప్పం గడ్డ.. చంద్రబాబు అడ్డా.. అంటూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రిలీజ్ చేసిన వీడియో | వాస్తవానికి ఆ వీడియో కర్ణాటకలో జరిగిన సిద్ధేశ్వరస్వామి అంతిమయాత్రకు సంబంధించినది



ఏకి పారేసిన నెటిజన్లు...

ఆ ఫొటోల లోగుట్టును నెటిజన్లు క్షణాల్లోనే పట్టేశారు. ఆ ఫొటోలు కుప్పంలో చంద్రబాబు పర్యటనవి కావంటూ నిజాన్ని నిగ్గు తేల్చారు. చుట్టుపక్కల పరిసరాలు, ఆ ఫొటోల్లో ఉన్న ప్రజల ఆహార్యాన్ని గుర్తించిన ప్రజలే.. ఇవి ఫేక్ అంటూ ఎండగట్టే సరికి పచ్చ గ్యాంగ్‌కు దిమ్మ తిరిగిపోయింది. 'బాబు మరీ ఇంత ఫేకా' అంటూ నెటిజన్లు ఏకిపారేశారు. నిజానికి 1989 నుంచీ చంద్రబాబు ఎమ్మెల్యేగా ఉన్న కుప్పం స్థానంలో ఇపుడు టీడీపీ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఇటీవల జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్, పంచాయతి ఎన్నికల్లో టీడీపీ ఘోరంగా ఓడిపోయింది. మరో ఏడాదిన్నరలో ఎన్నికలున్న తరుణంలో మూడు రోజుల పర్యటనకు గాను చంద్రబాబు బుధవారం కుప్పంలో అడుగుపెట్టారు. బాబు వస్తున్నారని వారం పది రోజులుగా ఎంత ప్రచారం చేసినా, అక్కడి ప్రజల నుంచి ఏమాత్రం స్పందన కనిపించ లేదు. దీంతో ఫోటోల మార్ఫింగ్‌కు దిగారు టీడీపీ ఘనులు. అయినా జనం వచ్చేది నాయకులు చేసే మంచిని చూసి. మరి చంద్రబాబు ఏం చేశారని వస్తారు?

నిరంతర పరిశీలన

ట్యాబ్‌లలో సమస్య వస్తే వారంలో మరమ్మతు లేదా కొత్త ట్యాబ్

ఉన్నతస్థాయి సమీక్షలో అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశం



సాక్షి, అమరావతి: ఏపీ వ్యాప్తంగా 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబుల్లో ఎలాంటి సమస్య తలెత్తినా వారం రోజుల్లో మరమ్మతు చేసి ఇవ్వాలని, లేదా కొత్త ట్యాబును అందజేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ట్యాబుల ద్వారా పాఠాలు నేర్చుకుంటున్న తీరుపై డేటా అనలిటిక్స్ ద్వారా నిరంతర పరిశీలన ఉండాలని సూచించారు. ఇందుకు అనుగుణంగా హెడ్ మాస్టర్, ఎంఈఓలు తగిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల విద్యాశాఖ కార్యకలాపాలపై గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ట్యాబుల పంపిణీ పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ట్యాబుల వాడకం.. దాని ద్వారా పాఠాలు నేర్చుకుంటున్న తీరు, తదితర అంశాలపై ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. తరగతి గదుల డిజిటలైజేషన్‌లో భాగంగా ఐఎఫ్‌పి ప్యానెల్స్ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్) ఏర్పాటుపై తీసుకుంటున్న చర్యల గురించి సీఎంకు వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే నాటికి ఐఎఫ్‌పి ప్యానెల్స్ ఏర్పాటు కావాలని, 6–10 తరగతుల విద్యార్థులందరికీ ఇవి అందుబాటులోకి రావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

నేటి నుంచి విశాఖలో గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్

మహారాణిపేట (విశాఖ దక్షిణ): ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా శుక్రవారం నుంచి విశాఖలో గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్ జరగనుంది. నోవాటెల్ హోటల్‌లో మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ప్రపంచం నలుమూలల నుంచి 450 మంది వైద్య నిపుణులు పాల్గొంటున్నారు. తొలిరోజు సదస్సులో సీఎం వైఎస్ జగన్ వర్చువల్‌గా ప్రసంగిస్తారు.

కొనసాగుతున్న బాబు షో

- కుప్పంలో కార్యకర్తలకు పరామర్శ పేరుతో డ్రామా
- అప్పటికప్పుడు చేతులకు కట్లతో ప్రైవేట్ ఆస్పత్రిలో కార్యకర్తలు
- బాబు వెళ్లగానే కట్లు విప్పేసి, ఇళ్లకు వెళ్లిపోయిన వైనం


చేతికి కట్లతో మంచంపై ఉన్న కార్యకర్తను పరామర్శిస్తున్న చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఒక షో ఫ్లాప్ అయితే.. మరో షో.. అది పోతే ఇంకొకటి.. అన్నట్లు ప్రతిపక్ష నేత చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. పట్టు తప్పుతున్న కుప్పంలో నిలదొక్కుకునేందుకు సరికొత్త 'షో'లకు తెరతీస్తున్నారు. ప్రభుత్వ జీవో, 30 పోలీస్ యాక్ట్‌ను ఉల్లంఘిస్తూ కుప్పంలో రోడ్ షో పేరిట బుధవారం బాబు చేసిన రాద్ధాంతం అందరికీ తెలిసిందే. అయితే వ్రతం చెడ్డా ఫలితం దక్కలేదన్నట్టుగా ఆయన రోడ్లపై చేసిన హైడ్రామా కూడా బెడిసికొట్టింది. అయినాసరే గురువారం మరో షోకు తెరతీశారు. బుధవారం పోలీసుల లాఠీచార్జిలో తమ కార్యకర్తలు గాయపడ్డారంటూ వారిని పరామర్శించేందుకు ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పారు. అంతే.. కుప్పంలోని కేసీ ఆస్పత్రిలో అందుకు వేదిక సిద్ధమైపోయింది. కొందరు టీడీపీ కార్యకర్తలు అప్పటికప్పుడు ఆస్పత్రికి వచ్చి అక్కడ మంచాలపై కూర్చున్నారు. వారి చేతులకు ఎలాంటి బ్యాండేజ్ కట్లూ లేవు. కులాసాగానే కబుర్లు చెప్పుకున్నారు. చంద్రబాబు కాసేపట్లో వస్తారనగా వారి చేతులకు హఠాత్తుగా బ్యాండేజ్ కట్లు కట్టారు. సాయంత్రం 6.45 గంటలకు చంద్రబాబు ఆ ఆస్పత్రికి చేరుకున్నారు. చేతికి కట్లతో మంచాలపై ఉన్న కార్యకర్తలను పరామర్శించారు. ఇక తన వెంట తీసుకువచ్చిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తమ కార్యకర్తలపై పోలీసులు లాఠీ చార్జీ చేశారని, ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపుతామని ఊగిపోయారు. అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయారు. చంద్రబాబు అలా వెళ్లారో... లేదో... ఆస్పత్రిలో కట్లతో ఉన్న కార్యకర్తలు తమ చేతులకు ఉన్న బ్యాండేజ్ కట్లు తీసివేసి, ఇళ్లకు వెళ్లిపోయారు. ఆస్పత్రి సిబ్బంది, అక్కడ ఉన్న వారు ఇదంతా నవ్వుతూ చూస్తూండిపోయారు.

'ఏపీ సచివాలయాల పనితీరు బాగుంది'

సాక్షి, అమరావతి: ఏపీలో ఇంటివద్దే సేవలందించే వలంటీర్ల వ్యవస్థతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు ఎప్పుడూ సమర్థవంతంగా ఉండేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయాలను కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో పాటు ఇతర ఉన్నతాధికారులతో తనిఖీలు నిర్వహిస్తోంది. 2021 సెప్టెంబర్ 1 నుంచి ఈ నెల 3 వరకు కూడా సచివాలయాల పనితీరును పరిశీలించారు. దాని ప్రకారం చూస్తే.. 80.90 శాతం గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు బాగుందని.. మరో 17.99 శాతం ఓ మోస్తరుగా ఉన్నాయని తేలింది. మిగిలిన 1.11 శాతం సచివాలయాల పనితీరు బాగోలేదని తేలింది. అలాగే, 76.59 శాతం మంది వలంటీర్ల పనితీరు బాగుందని, 21.55 శాతం వలంటీర్ల పనితీరు ఓ మోస్తరుగా ఉందని.. 1.86 శాతం వలంటీర్ల పనితీరు బాగోలేదని ఆ తనిఖీల్లో తేలింది.

నగర వార్తలు

ఫిబ్రవరి 9 నుంచి జాతీయ మల్లయోధ పోటీలు

పంజగుట్ట: శ్రేష్ఠ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుండి 12 వరకు కాచిగూడ లోని విక్టరీ ప్లేగ్రౌండ్‌లో ముఖేష్ గౌడ్ మెమోరియల్ జాతీయస్థాయి మల్లయోధ పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రేష్ఠ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బిజేపీ యువ నాయకులు విక్రమ్ గౌడ్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పోర్ట్స్ అథారటీ సెక్రటరీ నర్సింగరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అస్లం, రెజ్లర్ నిఖిల్ యాదవ్, సంతోష్ యాదవ్‌లతో కలిసి మాట్లాడుతూ .. జాతీయస్థాయిలో సుమారు 300 నుండి 500 మంది మల్లయోధులు ఈ పోటీల్లో పాల్గొంటారని, సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ మహిళల విభాగం, పురుషుల విభాగం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 17 విభాగాల్లో మొత్తం 57 బహుమతులు ఉంటాయని మొత్తం 57 బహుమతులు, 31 లక్షలకు పైగా ప్రైజ్ బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

'మార్కెట్' విషయం అధికారులకు తెలియజేశాం

సాక్షి, సిటీబ్యూరో: సీఎం అసెంబ్లీలో హామీ ఇచ్చినందువల్లే మామిడిపల్లిలో పండ్ల మార్కెట్ ప్రాంభించామని న్యూ ఫ్రూట్ మార్కెట్ హోల్‌సేల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ ప్రతినిధి సయ్యద్ ఆఫ్సర్ తెలిపారు. గురువారం మామిడిపల్లి మార్కెట్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. మార్కెట్ ప్రారంభిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖకు లేఖ కూడా అందించామన్నారు. గతంలో స్థలం పరిశీలనకు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, ఉన్నత అధికారులు కూడా వచ్చారన్నారు. మామిడిపల్లిలోని వక్ఫ్ భూమిలో మార్కెట్ ప్రారంభమవుతున్న విషయం ప్రభుత్వానికి తెలిసిన విషయమే అన్నారు. మార్కెటింగ్ శాఖకు తెలియకుండా గోప్యంగా ప్రాంభించలేదన్నారు.

మామిడిపల్లిలో 12 ఎకరాల విస్తీర్ణంలోని భూమిని వక్ఫ్ బోర్డు ద్వారా లీజుకు తీసుకున్న స్థలంలో వ్యాపారులు స్వచ్ఛంగా షెడ్లు నిర్మించుకొని వ్యాపారం చేయడం తప్పా అని ప్రశ్నించారు.


సఖీ సెంటర్ అమ్మలాంటిది

- ఆపదలో ఉన్న మహిళలు ఆశ్రయించాలి
- మంత్రి సబితాఇంద్రారెడ్డి
- వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో సఖి వన్‌స్టాప్ సెంటర్ భవనం ప్రారంభం


సఖి వన్‌స్టాప్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్

వనస్థలిపురం: ఆపదలో ఉన్న మహిళలకు సఖీ సెంటర్ అమ్మలాంటిదని, మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఆ సెంటర్లను ఆశ్రయించవచ్చని రాష్ట్ర విద్యా శాఖామాత్యులు పి.సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో రూ.59.79 లక్షలతో నూతనంగా నిర్మించిన సఖి వన్‌స్టాప్ సెంటర్ భవనంను గురువారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తతో కలసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లైంగిక వేధింపులు, గృహహింస, బాల్య వివాహాలు తదితర సమస్యల పరిష్కారం కోసం సఖి సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆపదలో ఉన్న మహిళలకు మెడికల్, లీగల్, కౌన్సిలింగ్ సేవలు ఈ సెంటర్లలో లభిస్తాయని చెప్పారు. కుటుంబ పరువు పోకుండా నాలుగు గోడల మధ్య సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి సఖి సెంటర్లో ఐదు రోజులపాటు వసతి సౌకర్యం, దుస్తులు, అవసరాల కోసం రూ. 2వేల కిట్ అందజేయడం జరుగుతుందని మంత్రి సబితా వివరించారు. ఆపదలో ఉన్న మహిళల కోసం 181, పిల్లల కోసం 1098, సీనియర్ సిటిజెన్స్ కోసం 14567 హెల్ప్ లైన్ సెంటర్లు పనిచేస్తున్నాయని, సమస్యల్లో ఉన్న వారు వాటికి ఫోన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు స్వయం ఉపాధి కోసం మంజూరైన రుణాలకు సంబంధించిన చెక్కులను మంత్రి, ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డా.బి.వెంకటేశ్వరరావు, శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఒకే చోట 70 రకాల టీ పౌడర్‌లు


చిక్కడపల్లిలో ఏ1 టీషాపు ప్రారంభిస్తున్న దృశ్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నగరంలో ఒకే చోట 70 రకాల అత్యుత్తమ టీ పౌడర్లు అందుబాటులో ఉంచుతున్నట్లు ఏ1 టీ దుకాణం నిర్వాహకులు జాకీర్ పటేల్ అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సమీపంలోని చిక్కడపల్లి పిస్తా హౌస్ వద్ద గురువారం నూతనంగా ఏ1 టీషాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రఫియా పటేల్ దుకాణాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. అస్సాం, డార్జిలింగ్ తదితర ప్రాంతాల నుంచి టీ పౌడర్‌లను తెప్పించి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వీటిలో 9 రకాల హెర్బల్ గ్రీన్ టీ పౌడర్‌లు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీ క్రాస్‌రోడ్డు చౌరస్తాలో ఓ షాపును నిర్వహిస్తుండగా.. చిక్కడపల్లిలో నూతనంగా మరో షాపును ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా 5 రోజుల పాటు లక్కీడ్రా కూపన్లను ఇస్తున్నామని వీటిలో ఈనెల 9 వరకు రోజూ 100 గ్రాముల బంగారాన్ని అందజేస్తామన్నారు. మొదటి బహుమతి, రెండో బహుమతి గెలుచుకున్నవారికి ఈ ఏడాదంతా నెలకు కిలో టీ పౌడర్ చొప్పున ఉచితంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. జాకర్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్‌ల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు

రాయదుర్గం: భారతదేశంలో స్టార్టప్ సంస్కృతి మిశ్రమ ఫలితాలు ఇస్తున్నాయని, మరోవైపు గణనీయమైన సంఖ్యలో స్టార్టప్‌లు భారీ ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నాయని భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయ వ్యూహాత్మక అలయన్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ సప్నాపోటి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో పబ్లిక్ పాలసీ డైలాగ్-2023 సదస్సు రెండవ రోజు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సప్నాపోటి మాట్లాడుతూ దేశంలో కొన్ని స్టార్టప్‌లు ప్రారంభ రౌండ్ల నిధుల తర్వాత అదృశ్యమవుతున్నాయన్నారు. ఆవిష్కరణల కోసం స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడానికి దేశంలో నాణ్యమైన ఇంక్యుబేటర్‌లను కలిగి ఉండాల్సిన అవసరం ఇంకా చాలా ఉందన్నారు. కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయలక్ష్మీనాదెండ్ల తదితరులు మాట్లాడారు.

హైబిజ్ టీవీ మీడియా అవార్డ్స్ పోస్టర్ ఆవిష్కరణ



గోల్కొండ: హైబిజ్ టీవీ ఈ సారి కూడా ప్రింట్ ఎలక్ట్రానిక్ డిజిటల్ మీడియా రంగాలలో అద్భుత ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులతో సత్కరించనున్నదని హైబిజ్ టీవీ అండ్ తెలుగు నౌ ఎండీ ఎం.రాజ్‌గోపాల్ అన్నారు. గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని గోల్కొండ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డులకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైబిజ్ టీవీ మీడియా అవార్డ్స్ 2023 కు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ మొదలైందని, ఆయా రంగాలలో పనిచేస్తున్నవారు హెచ్ఎంఏ పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కెడాయి హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, భారతి సిమెంట్ మార్కెటింగ్ డైరెక్టర్ ఎం.రవీందర్ రెడ్డి, లైఫ్‌స్పాన్ ప్రైవేట్ లిమిటెడ్ నరేంద్రరామ్ నంబుల, సోమశేఖర్, వినోద్ తదితరులు ఉన్నారు. వివరాలకు 96667 96622 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా మహిళ ఆత్మహత్యాయత్నం


బాధితురాలికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రాజేంద్రనగర్: ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత పట్టించుకోవడం లేదు. మరో మహిళతో తిరుగుతూ ఇంటికి రాకపోవడంతో ఆమె పెద్దలు, పోలీసులను ఆశ్రయించింది. అయినా భర్త ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో ఇద్దరు పిల్లలతో సహా హిమాయత్‌సాగర్‌లో దూకేందుకు ప్రయత్నిస్తుండగా రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ సుందర్‌రెడ్డి వారిని చేరదీసి రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒంగోలు ప్రాంతానికి చెందిన కురుమమ్మ, సాయిలు 8 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి యశ్వంత్, యశ్మిత సంతానం. మూడేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం హైదర్షాకోట్ ప్రాంతానికి వలస వచ్చారు. సాయి ప్లంబర్‌గా పని చేసేవాడు. కొన్ని నెలలుగా సాయికి మరో మహిళతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి కురుమమ్మతో పాటు పిల్లలను పట్టించుకోవడం లేదు. ఇంటికి సైతం సరిగ్గా రావడం లేదు. దీంతో కురుమమ్మ పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో వారు అతడిని మందలించారు. అయినా అతను మారకపోవడంతో పది రోజుల క్రితం నార్సింగి పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కౌన్సెలింగ్ ఇవ్వగా బుద్ధిగా ఉంటానన్నారు. అయితే గత నాలుగు రోజులుగా తిరిగి ఇంటికి రాకపోగా, ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ రావడంతో గురువారం ఉదయం ఇద్దరు పిల్లలతో హిమాయత్ సాగర్ చేరుకుంది. సాగర్‌లోకి దూకేందుకు ప్రయత్నించగా చుట్టు ఇనుప కంచె ఉండడంతో సాధ్యంకాలేదు. దీంతో సాదమ్మ గుట్టవైపు ఫెన్సింగ్ లేకపోవడంతో అక్కడికి వెళ్లింది. ఇద్దరు పిల్లలతో సాగర్‌లోకి వెళ్తుండడంతో వాహనదారులు గమనించి ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సిబ్బందితో అక్కడికి చేరుకుని వారిని సముదాయించి వివరాలు సేకరించారు. అనంతరం రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. రాజేంద్రనగర్ పోలీసులు భర్తకు ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో ఒంగోలులోని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసినా వారు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో కౌన్సెలింగ్ ఇచ్చి నార్సింగి పోలీసులకు అప్పగించారు.

పనుల పర్యవేక్షణ తప్పనిసరి

మన బస్తీ–మన బడి పనులపై మంత్రి తలసాని సమీక్ష



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మన బస్తీ–మన బడి పనులపై వారంలో నాలుగు రోజుల పాటు డిప్యూటీ విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ తప్పనిసరని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. గురువారం మాసాబ్ ట్యాంక్ లోని తన కార్యాలయంలో మన బస్తీ- మన బడి కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో టాయిలెట్స్, విద్యుత్ సౌకర్యం, తాగునీరు వంటి సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాఠశాలల్లో చేపట్టాల్సిన అభివద్ధి పనులు, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్ళాలని సూచించారు. పాఠశాలల వారిగా విద్యార్థుల సంఖ్య, తరగతి గదుల సంఖ్య, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై పూర్తిస్థాయి సమాచారంతో ఈ నెల 11 వ తేదీన జరిగే సమావేశానికి రావాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 15 నియోజకవర్గాల పరిధిలో 499 ప్రాథమిక, 9 ప్రాథమికోన్నత, 182 ఉన్నత పాఠశాలలు మొత్తం 690 పాఠశాలలు ఉండగా, 239 పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు. అభివద్ధి పనులు మరింత వేగవంతంగా జరిగేలా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేష్, సాయన్న, కౌసర్ మొహినోద్దిన్, మౌజం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కేలెండర్ ఆవిష్కరణ

హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న చేస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్. చిత్రంలో హెచ్‌సీఏఏ అధ్యక్ష, కార్యదర్శులు రఘునాథ్, గడిపల్లి మల్లారెడ్డి, జల్లి నరేందర్ తదితరులు

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర వాణిజ్య పనుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం 2023–క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్‌ను తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పనుల శాఖ కమిషనర్ నీతు కుమారి ప్రసాద్ ఆవిష్కరించారు. గురువారం రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ సెక్రెటరీ ఎస్కే జలాలుద్దీన్ అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి మధుసూదన్ రావు,సునీల్ కుమార్ పాల్గొన్నారు.

విజేతకు అభినందనలు



పాండిచ్చేరిలో జరిగిన ఆలిండియా క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన తెలంగాణ హైకోర్టు జట్టును అభినందిస్తున్న సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ తదితరులు.

సాక్షి ఫ్యామిలీ
ఫ్యాషన్
హైదరాబాద్
శుక్రవారం ॥ 6-1-2023

ఉలెన్... ఉమన్






కొంచెం కూల్.. కొంచెం హాట్

అన్నట్టుగా ఉంటోంది ఈ వెదర్.
దీంతో సందర్భాన్ని బట్టి స్పెషల్‌గా రెడీ అవడం
కుదరడం లేదు అనుకునే వారికి
బెస్ట్ ఆప్షన్ గా నిలుస్తున్నాయి ఈ ఉలెన్ కుర్తీలు.
పార్టీలో ప్రత్యేకంగా నిలుస్తున్నాయి .
చలికి స్వెట్టర్ అవసరం లేకుండా కాజువల్ వేర్ గానూ ఆకట్టుకుంటున్నాయి.

ఎనీ వేర్ ఎనీ టైం అన్నట్టుగా కుర్తీ అన్ని వయసుల వారి తప్పనిసరి డ్రెస్‌గా నిలిచిపోయింది. సీజన్‌కి తగిన విధంగా, స్టైలిష్ వేర్‌గా పేరొందిన కుర్తీ మరింత స్పెషల్ గా అట్రాక్ట్ చేస్తోంది.

బ్యూటిప్స్

ముఖం మీద వికారంగా కనిపించే మొటిమలను ఇంటి చిట్కాతో సులభంగా వదిలించుకోవచ్చు. నాలుగు వెల్లుల్లి రెబ్బలు తీసుకుని పొట్టుతీసి మెత్తగా పేస్టులా నూరుకోవాలి. తరువాత ఈ పేస్టును ముఖంపై ఉన్న మొటిమలపై రాయాలి. పేస్టు ఆరుతుంది అనుకున్నప్పుడు దానిపై బ్యాండేజ్ వేయాలి. ఈ బ్యాండేజీను రాత్రంతా ఉంచుకుని ఉదయం తీసేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేయడం ద్వారా మొటిమలు తగ్గుముఖం పడతాయి.





జుట్టు నిగనిగల కోసం...

ఇనప మూకుడు తీసుకుని దానిలో టీకప్పు ఆవనూనె, మరోకప్పు కొబ్బరి నూనె, టేబుల్ స్పూన్ మెంతిపొడి లేదా మెంతులు, టేబుల్ స్పూన్ ఉసిరిపొడి, అరకప్పు గోరింటాకు పొడి వేసి బాగా కలపాలి. ఇప్పుడు సన్నని మంట మీద ఈ మూకుడు పెట్టి పదినిమిషాలపాటు మరగనివ్వాలి. ఆయిల్ రంగు మారిన తరువాత స్టవ్ ఆపేసి దించి పక్కనపెట్టుకోవాలి. చల్లారిన తర్వాత దీనిని ఒక శుభ్రమైన పొడి సీసాలో పోసుకుని ఒక పూటంతా పక్కన పెట్టాలి. దీనిని రోజూ తలకు రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల వెంట్రుకలు నల్లగా నిగనిగలాడతాయి. రోజూ వాడటం ఇష్టం లేనివాళ్లు వారానికి ఒకటి రెండుసార్లు తలకు పట్టించి రెండు మూడు గంటల తర్వాత తలస్నానం చేయాలి. ఈ ఆయిల్‌ను వాడటం వల్ల నల్లని ఒత్తైన కురులు మీ సొంతమవుతాయి.

ఇంటిప్స్

అరటిపండు, యాపిల్ వంటి పండ్లు కోసిన తరువాత రంగు మారకుండా ఉండాలంటే నిమ్మరసం రాసి ఉంచితే సరి.

నిమ్మరసం కొద్ది చుక్కలు మాత్రమే అవసరమైతే మొత్తం కాయనంతటినీ కోయకుండా– ఒక పక్కగా చిన్న రంధ్రం చేసి, కావలసినంత మాత్రమే రసం పిండి, ఆ నిమ్మకాయను ఫ్రిజ్‌లో ఉంచితే, ఆ తర్వాత దానిని మరల ఉపయోగించుకోవచ్చు.

పచ్చని కూరగాయలు వండిన తరువాత కూడా ఆ రంగుని కోల్పోకుండా ఉండాలంటే ఉడుకుతున్నప్పుడు కొద్దిగా పంచదార గాని, నిమ్మరసం గాని కలపాలి.



ముగ్గు - ముచ్చట

చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34. ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com
(మీ ఊరుతోపాటు కాలనీ- వీధి పేరు కూడా రాయండి)





ఎస్. మౌనిక
జహీరాబాద్
19 చుక్కలు,
5 వరుసలు,
వరుస చుక్క





జి. పద్మావతి
ఎమ్‌విపి కాలనీ, విశాఖపట్నం
17 చుక్కలు, 1 వచ్చే వరకు,
చుక్క వదిలి చుక్క

వంటిల్లు

రుచుల సంక్రాంతి

సంక్రాంతి దగ్గరకు వస్తోంది...
పిల్లలకు పరీక్షలు వచ్చేశాయి.
ఆ తర్వాత సెలవులు వస్తాయి.
పండక్కి కొత్త దుస్తులు వస్తాయి.
ఇంటికి రుచుల దినుసులు వస్తాయి.
వంటింట్లో రుచులు మొలకెత్తుతాయి.
ఈ రుచులకు ఇప్పుడే బాణలి పెట్టండి.
పండగ వరకు తాజాగా ఉంటాయి

అరిశెలు



కావలసినవి: బియ్యం – ఒకటింపావు కిలో ; బెల్లం – కిలో ; నువ్వులు– టేబుల్ స్పూన్ ; గసగసాలు– టేబుల్ స్పూన్ ; నెయ్యి లేదా నూనె – ముప్పావు కేజీ.

తయారీ: ● బియ్యాన్ని ముందు రోజు రాత్రి కడిగి నానబెట్టాలి. ఉదయాన్నే నీళ్లను వంపేసి తడిగా ఉన్నప్పుడే దంచాలి. సన్నని రంధ్రాలున్న జల్లెడతో జల్లించి ఒకపాత్రలో వేసి అదిమి మూత పెట్టాలి. ● బెల్లాన్ని పొడి చేయాలి. పెద్దపాత్రలో ఒక గ్లాసు నీరు, బెల్లం పొడిని వేసి పాకం వచ్చేదాకా మరగనిచ్చి బియ్యప్పిండి వేసి కలుపుకోవాలి. ● బాణలిలో నెయ్యి వేడి చేయాలి. పాకంపిండిని పెద్ద నిమ్మకాయంత తీసుకుని గసగసాలు, నువ్వులలో అద్ది పాలిథిన్ పేపర్ మీద పలుచగా తట్టి బాణలిలో వేయాలి. రెండువైపులా దోరగా కాలిన తర్వాత తీసి అరిశెల పీట మీద వేసి అదనంగా ఉన్న నెయ్యి కారిపోయేటట్లు వత్తాలి. అరిశెల పీటకు బదులుగా రంధ్రాలున్న చెక్క గరిటెలు కూడా వాడవచ్చు. వీటితో బాణలిలో నుంచి తీసేటప్పుడే వత్తి అదనపు నేతిని బాణలిలోకి జారేటట్లు వత్తవచ్చు. **గమనిక:** ● అరిశె మెత్తగా రావాలంటే పాకం లేతగా ఉన్నప్పుడే బియ్యప్పిండి కలుపుకోవాలి. గట్టిగా ఎక్కువ తీపితో కావాలనుకుంటే పాకాన్ని కాస్త ముదరనివ్వాలి. ● ఒక ప్లేటులో నీళ్లు పోసి ఉడుకుతున్న బెల్లం మిశ్రమాన్ని స్పూనుతో కొద్దిగా తీసుకుని నీటిలో వేయాలి. దీనిని చేత్తో నొక్కి రౌండ్ చేయాలి. జారి పోకుండా రౌండ్ వచ్చిందంటే పాకం వస్తున్నట్లు. ఆ రౌండ్‌ను పైకెత్తి ప్లేటు మీద వేసినప్పుడు మెత్తగా జారిపోకుండా అలాగే ఉంటే పాకం వచ్చినట్లు. ముదురు పాకం కావాలనుకుంటే ఆ రౌండ్ ప్లేటుకు తగిలినప్పుడు ఠంగున శబ్దం వచ్చే దాకా పాకం పట్టుకోవాలి. ● అరిశెలు పదిహేను రోజుల వరకు తాజాగా ఉంటాయి. తినే ముందు పెనం మీద వేడి చేస్తే అప్పుడు చేసిన అరిశెలాగా వేడిగా, మెత్తగా మారుతాయి.

సకినాలు



కావలసినవి: బియ్యం– పావు కేజీ ; వాము – టేబుల్ స్పూన్ ; నువ్వులు – నాలుగైదు స్పూన్లు ; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచికి తగినట్లు ; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● బియ్యాన్ని కడిగి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం నీటిని వంపేసి మెత్తగా పొడి చేసి సన్నని చిల్లులున్న జల్లెడతో జల్లించాలి. ఇందులో వాము, నువ్వులు, ఉప్పు వేసి కలపాలి. అన్నీ సమంగా కలిసిన తర్వాత నీటిని పోసి ముద్దగా కలిపితే సకినాల పిండి రెడీ. ● శుభ్రమైన నూలు వస్త్రాన్ని తడి చేయాలి. సకినాల పిండిని చేత్తో తీసుకుని వేళ్లతో సన్నని తాడులాగ చేస్తూ వస్త్రం మీద వలయాకారంగా తిప్పాలి. అలా మూడు –నాలుగు వరుసలుగా వేయాలి. అలాగే పిండినంతటినీ నూలు వస్త్రం మీద సకినాల ఆకారంలో వేసి పది నిమిషాల సేపు ఆరనివ్వాలి. ● బాణలిలో నూనె వేడి చేసి నూలు వస్త్రం మీద నుంచి పచ్చి సకినాలను తీసి నూనెలో వేసి దోరగా వేయించి బాణలిలో నుంచి తీయాలి. నోరూరించే సకినాలు రెడీ. వేడి తగ్గి గోరువెచ్చగా ఉన్నప్పుడు తింటే చాలా రుచిగా ఉంటాయి.

నువ్వుల కజ్జికాయ



కావలసినవి: గోధుమ పిండి – కేజీ ; నువ్వులు – కేజి ; బెల్లం పొడి – 800గ్రా. ; ఏలకులు– 10 గ్రా. ; జీడిపప్పు– 100 గ్రా ; నెయ్యి లేదా నూనె– కేజీ. **తయారీ:** ● గోధుమ పిండి పూరీల పిండిలా ముద్దగా కలిపి పక్కన పెట్టాలి. ● నువ్వులను దోరగా వేయించి చల్లారిన తర్వాత కొంచెం పలుకుగా గ్రైండ్ చేయాలి. అందులో బెల్లం పొడి, ఏలకుల పొడి వేసి అన్నీ సమంగా కలిసే వరకు కలపాలి. ● గోధుమ పిండిని చిన్న నిమ్మకాయంత తీసుకుని పూరీలా వత్తుకుని దానిని సాంచిలో పరిచి అందులో ఒక స్పూను నువ్వులు, బెల్లం మిశ్రమాన్ని, ఒక జీడిపప్పును పెట్టి సాంచిని మూత వేయాలి. కజ్జికాయ ఆకారం వస్తుంది. ● సాంచిలో నుంచి తీసి మరుగుతున్న నూనెలో వేసి దోరగా కాలనివ్వాలి. ● ఇవి దాదాపుగా ఇరవై రోజుల వరకు తాజాగా ఉంటాయి.

గమనిక: ● 'సాంచి' అంటే చెక్కతో చేసిన మౌల్డ్. ఇందులో పూరీని పెట్టి మడత వేస్తే అంచులు నొక్కుకుని అక్కడ పిండి అతుక్కుపోతుంది. లోపల పెట్టిన మిశ్రమం బయటకు రాకుండా ఉంటుంది. దీనికి బదులుగా చక్రం స్పూనులు కూడా ఉంటాయి. వాటిని కూడా వాడవచ్చు. ● నెయ్యి రుచిని పెంచుతుంది కాని, కజ్జికాయలు త్వరగా మెత్తబడతాయి. ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే నూనెతో చేసుకోవడం మంచిది.

సున్నుండలు



కావలసినవి: మినప్పప్పు– పావు కేజీ ; బెల్లం పొడి– 200గ్రా. ; ఏలకుల పొడి– టీ స్పూను ; నెయ్యి– 100గ్రా.


తయారీ: ● మందపాటి బాణలిలో నూనె లేకుండా మినప్పప్పు దోరగా వేయించి, చల్లారిన తర్వాత మిక్సీలో పొడి చేయాలి. ఇందులో బెల్లం పొడి, ఏలకుల పొడి, నెయ్యి వేసి కలపాలి. అన్నీ సమంగా కలిసిన తరువాత కావలసిన సైజులో ఉండలు చేయాలి. నెయ్యి వాడకాన్ని తగ్గించాలనుకుంటే నెయ్యిని పిండిలో కలపకుండా కొద్దిగా చేతికి రాసుకుంటూ ఉండలు చేసుకోవాలి.

పూతరేకులు



కావలసినవి: చక్కెర – కేజీ ; సగ్గుబియ్యం– ముప్పావు కేజీ ; జీడిపప్పు– పావు కేజీ ; ఏలకులు– 50గ్రా.; నెయ్యి– 100 గ్రా.

తయారీ: ● పూత రేకుల కోసం రేకులను తయారు చేసుకోవడం కొంచెం కష్టమే. ఇందుకు ప్రత్యేకమైన కుండ కావాలి. ● సగ్గుబియ్యాన్ని చిక్కటి గంజి చేసుకోవాలి. ఒక గట్టి కాటన్ క్లాత్‌ను నలుచదరంగా కట్ చేయాలి. కుండను మంట మీద బోర్లించి వేడెక్కిన తరువాత క్లాత్‌ను సగ్గుబియ్యం గంజిలో ముంచి వేడెక్కిన కుండ మీద పరచాలి. గంజి కుండకు అంటుకుని వేడికి పలుచని పొరలాగా వస్తుంది. ఆ పొర విరిగిపోకుండా అట్లకాడతో జాగ్రత్తగా తీయాలి. ఎన్ని రేకులు కావాలంటే అన్నింటికీ ఇదే పద్ధతి. రేకు ఏ సైజులో కావాలంటే క్లాత్‌ను ఆ సైజులో కట్ చేసుకోవాలి. ● చక్కెర, జీడిపప్పు, ఏలకులను పొడి చేసి కలుపుకోవాలి. ఇప్పుడు రెండు ఒక రేకు తీసుకుని నెయ్యిరాసి చక్కెర, జీడిపప్పు మిశ్రమాన్ని పలుచగా చల్లి పైన మరొక రేకు వేసి మడత వేయాలి. తెల్లగా నోరూరించే పూతరేకు రెడీ. ఇవి పదిహేను రోజుల వరకు తాజాగా ఉంటాయి. ● ఎక్కువ మోతాదులో రేకులను తయారు చేసుకుని ఎప్పుడు కావాలంటే అప్పుడు చక్కెర మిశ్రమాన్ని వేసి పూతరేకులను చేసుకోవచ్చు. అలాగే చక్కెర బదులు బెల్లం పొడి, ఖర్జూరాల పొడితో కూడా పూతరేకులు చేసుకోవచ్చు. జీడిపప్పుతో పాటు బాదం పలుకులు కూడా వాడవచ్చు.



● బ్రెయిన్ జిమ్

ఫటాఫట్ ధనాధన్

ABCDE x 4 = EDCBA

A=? B=? C=? D=? E=?

జవాబు: a = 2 b = 1 c = 9 d = 7 e = 8 ; 21978 x 4 = 87912 : edcba=87912

విన్నర్ విన్నర్ చికెన్ డిన్నర్



ఒకరి విజయాన్ని అభినందించే సందర్భంలో ఉపయోగించే ఎక్స్‌ప్రెషన్ విన్నర్ విన్నర్ చికెన్ డిన్నర్. గ్రేట్ డిప్రెషన్ కాలం నుంచి పుట్టిన మాట ఇది. గ్యాంబ్లర్స్ తమ విజయాన్ని చికెన్ డిన్నర్‌తో సెలబ్రెట్ చేసుకునే వారు. మల్టీప్లేయర్ షూటర్ వీడియోగేమ్ 'ప్లేయర్ అన్‌నోన్స్ బ్యాటిల్‌గ్రౌండ్స్'తో 'విన్నర్ విన్నర్...' ఎక్స్‌ప్రెషన్ ఆన్‌లైన్‌లో పాపులర్ అయింది. ఉదా: ఒక జట్టు కప్పు గెలిచిన సందర్భంలో...

'విన్నర్ విన్నర్ చికెన్ డిన్నర్! గ్రేట్ జాబ్ టుడే ఎవ్రీవన్'

● గేమింగ్

వన్ పీస్ ఒడిస్సీ

త్వరలో విడుదల కాబోతున్న రోల్‌ప్లేయింగ్ వీడియోగేమ్ వన్ పీస్ ఒడిస్సీ. 'వన్‌పీస్' ఫ్రాంచైజ్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ప్లేయర్స్ ఈ గేమ్‌లో మంకీ డి లుఫీని కంట్రోల్ చేయాల్సి ఉంటుంది.



మంకీ డి అలియాస్ స్ట్రాహ్యాట్ 'వన్‌పీస్' సిరీస్‌లో ప్రధాన కథానాయకుడు. సముద్రపు దొంగ కావాలనేది మంకీ చిన్నప్పటి కల. తన కలను నెరవేర్చుకోవడమే కాదు సముద్రపు దొంగలకు నాయకుడు అవుతాడు. ఈ గేమ్‌లో ప్రతి క్యారెక్టర్‌కు తనదైన ప్రత్యేకత ఉంటుంది. నిధుల వేటలో భాగంగా ఈస్ట్ సీలోకి వెళ్లాల్సి ఉంటుంది. ప్రమాదాలను పసిగట్టాల్సి ఉంటుంది.

ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్స్: రోల్‌ప్లేయింగ్ గేమ్ **మోడ్:** సింగిల్

స్ఫూర్తి




సౌమ్య రాజన్

సాగర తీరాన సైన్యమై కదులుతున్నాడు

చిన్నప్పుడు చందమామ కథలతో పాటు సముద్రపు తాబేళ్ల కష్టాల కథలు కూడా విన్నాడు ఒడిషాకు చెందిన సౌమ్య రాజన్ బిస్వాల్. ప్రమాదం అంచున ఉన్న తాబేళ్ల స్థితి గురించి 'అయ్యో!' అనుకోవడానికి మాత్రమే పరిమితం కాలేదు సౌమ్య రాజన్. తానే ఒక ఉద్యమమై, సైన్యమై బలమైన అడుగులు వేస్తున్నాడు...

చిన్నప్పుడు స్కూల్లో ఉపాధ్యాయులు చెప్పే హుషారైన కథలు వినేవాడు సౌమ్య రాజన్ బిస్వాల్. దీంతో పాటు పర్యావరణ సంబంధిత అంశాలలో భాగంగా సముద్రపు తాబేళ్ల గురించి కూడా వినేవాడు. ఎన్నో కథల్లో తాబేలు మనకు సుపరిచిత ఫ్రెండు. అయితే వాస్తవప్రపంచంలో వాటి పరిస్థితి ఘోరంగా ఉంది.

ప్రతి 7 జాతులలో 3 జాతులు అంతరించబోయే ప్రమాదకర పరిస్థితులలో ఉన్నాయి.

తాబేళ్లకు ఎదురవుతున్న విపత్కర పరిస్థితుల గురించి విన్న తరువాత తన వంతుగా ఏదైనా చేయాలని బలంగా అనుకున్నాడు సౌమ్య. అప్పటికింకా తాను హైస్కూల్ విద్యార్థి. రోజూ పెద్ద సంచిని భుజాన వేసుకొని పూరీ జిల్లాలోని అస్తరంగ బీచ్‌కు వెళ్లేవాడు. ప్లాస్టిక్ సంచులు, వాటర్ బాటిల్స్, ఖాళీ సీసాలను ఆ సంచిలో వేసుకొని వచ్చేవాడు.

సోషల్ మీడియా వేదికగా వ్యక్తిత్వ వికాస కోణంలో తన మనసులోని భావాలకు అక్షర రూపం ఇస్తుంటాడు సౌమ్య రాజన్. మచ్చుకు ఒకటి... 'గతంలో చేసిన తప్పుల నుంచి బయటికి రండి. కొత్త ప్రయాణం ప్రారంభించండి. కొత్త ప్రయాణానికి ప్రతిరోజూ ఒక అపురూప అవకాశమే'.

ఆలివ్ రిడ్లీ తాబేళ్లు పెట్టిన గుడ్లు నక్కలు, కుక్కలు, ఇతర జంతువుల పాలు కాకుండా రక్షించేవాడు.

ఆ తరువాత సౌమ్య రాజన్‌కు స్నేహితులు కూడా తోడయ్యారు.

కాలేజీరోజుల విషయానికి వస్తే, ప్రతి ఆదివారం పర్యావరణ విషయాలపై ఊరూవాడా సైకిల్‌యాత్ర నిర్వహించేవాడు. పర్యావరణ నేస్తాలైన తాబేళ్లను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత గురించి జాలర్లకు చెప్పేవాడు.

పర్యావరణానికి సంబంధించిన కార్యక్రమాలను విస్తృతం చేయడం కోసం 'ఒడిషా పర్యావరణ్ సంఘర్షణ్ అభియాన్' అనే స్వచ్ఛందసంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ద్వారా వందమందితో ఒక సైన్యాన్ని తయారుచేశాడు సౌమ్య రాజన్. చుట్టు పక్కల ఎన్నో జిల్లాలకు వెళ్లి ఈ సైన్యం పర్యావరణ అంశాలపై ప్రచారం నిర్వహిస్తోంది.

'యూఎన్ ఇండియా యువ అడ్వకేట్స్'లో ఒకరిగా గుర్తింపు పొందిన 27 సంవత్సరాల సౌమ్య రాజన్ బిస్వాల్ ఎజెండాలో ఇప్పుడు సేంద్రియ వ్యవసాయం కూడా చేరింది. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యత గురించి గిరిజనుల దగ్గరికి వెళ్లి ప్రచారం చేస్తున్నాడు.

ఎంపవర్

సందేశ యాత్ర


ఆశ

మహిళా సాధికారత, మహిళల భద్రతకు సంబంధించిన విషయాలను ప్రచారం చేయడానికి 24 సంవత్సరాల ఆశా మాల్వియ 'సంపూర్ణ్ భారత్ సైకిల్ యాత్ర' చేపట్టింది. మధ్యప్రదేశ్‌లోని నటరామ్ గ్రామానికి చెందిన ఆశకు చిన్నప్పటి నుంచి సాహసాలు చేయడం అంటే ఇష్టం. కొత్తగా ఆలోచించడం అంటే ఇష్టం.

పర్వతారోహకురాలిగా ఎన్నో సాహసాలు చేసిన ఆశకు సామాజిక విషయాలపై మంచి అవగాహన ఉంది.

గత సంవత్సరం నవంబర్ 1న ఈ సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు అయిదు రాష్ట్రాల గుండా ఆరువేల కిలో మీటర్ల దూరం ప్రయాణం చేసింది.

'ఇంత సుదీర్ఘయాత్రను చేయడం కష్టంగా లేదా?' అనే ప్రశ్నకు ఆమె చిరునవ్వే సమాధానం చెబుతుంది. యాత్రలో ప్రతి రోజూ ఒక కొత్త ప్రపంచాన్ని దర్శించుకో గలిగే అదృష్టం లభించినప్పుడు కష్టం ఎందుకు! అనేది ఆమె చిరునవ్వు సారాంశం.

యాత్రలో భాగంగా రకరకాల సంస్కృతులు, ఆచార, వ్యవహారాల గురించి తెలుసుకుంటూ వెళుతుంది. ఉద్యమకారులు, ఉన్నతాధికారులు, నాయకులతో మాట్లాడుతుంది. వారితో ఎన్నో విషయాలు చర్చిస్తుంది. ప్రస్తుతం ఆశ సైకిల్ యాత్ర కేరళకు చేరుకుంది. ఈ సైకిల్ యాత్ర దిల్లీలో ముగుస్తుంది.

'భారతదేశం మహిళలకు భద్రమైన దేశం అనే సందేశాన్ని నా యాత్ర ద్వారా ప్రపంచానికి సందేశం పంపాలనుకుంటున్నాను' అంటోంది ఆశ.

● టెక్..టాక్

సెర్చ్ ఇన్ వీడియో

యూట్యూబ్ 'సెర్చ్ ఇన్ వీడియో' అనే కొత్త ఫీచర్‌ని తీసుకురానుంది. మనకు అవసరమైన, ఆసక్తి కలిగించే టాపిక్ గురించి సులభంగా వెదకడానికి ఉపకరించే ఫీచర్ ఇది. దీంతో పాటు 'మల్టీ సెర్చ్' 'బై లింగ్వల్ సెర్చ్ రిజల్ట్' ఫీచర్‌లను తీసుకురానుంది. 'మల్టీ సెర్చ్ ఫీచర్'తో సందేహాలు కూడా అడగవచ్చు. 'బై లింగ్వల్ సెర్చ్ రిజల్ట్'లో ఇంగ్లీష్‌లో ప్రశ్నలు అడిగితే మనకు అవసరమైన భాషలో సమాధానాలు వస్తాయి.

యూ.కామ్‌లో యూఛాట్

సెర్చ్ ఇంజిన్ you.com గురించి చాలామందికి తెలిసి ఉండకపోవచ్చు. 'ప్రైవసీకి మా తొలి ప్రాధాన్యత' అంటున్న యూ.కామ్‌లో ప్రైవేట్ మోడ్‌లో సెర్చెస్ స్టోర్ కావు. వెబ్‌రిజల్ట్, న్యూస్, వీడియోలు, ఇమేజ్‌లు, మ్యాప్‌లు...మొదలైన విభాగాలు ఉన్నాయి. యూ.కామ్ తాజాగా ఏఐ ఛాట్‌బోట్ 'యూ ఛాట్'ను లాంచ్ చేసింది. సందేహాలకు సమాధానాలు, విషయ వివరణ, అనువాదం, ఇమెయిల్ కంపోజింగ్, కోడ్ రైటింగ్‌లో యూ ఛాట్ ఉపయోగపడుతుంది.

హైడ్ చేయడానికి...

ఆర్కైవ్‌తో పనిలేకుండా వాట్సాప్‌లో(ఐఫోన్) మెసేజ్ హైడ్ చేయడానికి...1. సెట్టింగ్స్-క్లిక్ 2. ఎకౌంట్-సెలెక్ట్ 3. ప్రైవసీ-సెలెక్ట్ 4. స్క్రీన్ లాక్-క్లిక్ 5. రిక్వెస్ట్ ఫేస్‌ఐడీ-యాక్టివేట్ 6. 'ఇమిడియెట్లీ' 'ఆఫ్టర్ 15 మినిట్స్' 'ఆఫ్టర్ 1 హవర్' ఆప్షన్‌లలో టైమ్‌లిమిట్ సెలెక్ట్ చేసుకోవాలి.

ఇక 60 నిమిషాల వీడియో

మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వీడియో క్రియేటర్స్‌కు నచ్చే ఆప్షన్‌ను ప్రవేశ పెట్టింది. తాజా మార్పుతో ట్విట్టర్ బ్లూ సబ్‌స్క్రైబర్‌లు 60 నిమిషాల నిడివి (2జీబి) ఉన్న వీడియో ఫైల్‌ను అప్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఇది వెబ్‌లోనే అందుబాటులో ఉంది. దీనికి ముందు 10 నిమిషాల వీడియోను మాత్రమే అప్‌లోడ్ చేసుకోవడానికి వీలయ్యేది. దీంతో పాటు నిర్దిష్టమైన ట్వీట్‌ను ఎన్నిసార్లు చూశారో తెలిపే 'వ్యూ కౌంట్' ఫీచర్‌ని కూడా పరిచయం చేసింది ట్విట్టర్.

లెనోవా ట్యాబ్ ఎం9



లెనోవా ట్యాబ్ ఎం9 గురించి ప్రకటించింది. దీన్ని లాస్ వేగాస్‌లో జరుగుతున్న టెక్ ఈవెంట్ సీయిఎస్ 2023లో ప్రదర్శిస్తారు. విడుదల తేదీ గురించి ప్రకటించలేదు.

- డిస్‌ప్లే: 9 అంగుళాలు
- రిజల్యూషన్: 1340×800 పిక్సెల్స్
- స్టోరేజ్: 128జీబి
- ఎక్స్‌టెండబుల్ స్టోరేజ్: 2టీబి
- బ్యాటరీ లైఫ్: 13 గంటలు
- సెల్ఫీ షూటర్: 2టీబి
- 15 డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్
- బ్లూటూత్ 5.1

ఐ ప్రొటెక్షన్ డెస్క్ లైట్



స్వాప్‌కార్ట్ పోర్టబుల్ ఐ ప్రొటెక్షన్ యుఎస్‌బీ ఎల్‌ఈడీ డెస్క్ లైట్ తేలికపాటి బరువుతో అడ్జస్టబుల్, ఫ్లెక్సిబుల్‌గా ఉంటుంది. పుస్తకాలు చదువుకోవడానికి, పీసీ, ల్యాప్‌టాప్‌లతో పని చేస్తున్నప్పుడు ఇది ఉపకరిస్తుంది. **బ్రాండ్:** స్వాప్‌కార్ట్ **స్టైల్:** పోర్టబుల్

సినిమా


● చిరంజీవి

సంక్రాంతి సంబరం... బాక్సాఫీస్ సమరం

ప్రతి ఏడాదిలానే ఈసారి కూడా సంక్రాంతి సమరానికి బాక్సాఫీస్ ముస్తాబవుతోంది. థియేటర్ అనే గ్రౌండ్‌లో ప్రేక్షకులే సాక్షిగా బాక్సాఫీస్ బరిలో కలెక్షన్స్ పందేనికి కత్తులు కట్టిన కోడి పుంజుల్లా రెడీ అయ్యారు నలుగురు స్టార్ హీరోలు. వీరితో పాటు యంగ్ హీరో కూడా వస్తున్నాడు. పండగ సందర్భంగా సినిమాలు రావడం సినీ ప్రేమికులకు సంబరం... బాక్సాఫీస్‌కి వసూళ్ల సమరం. ఇక.. ఈ సంక్రాంతి పండక్కి వస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

సంక్రాంతి ఈ నెల 13న ఆరంభమవుతుంది. కానీ సినిమా సంక్రాంతి మాత్రం రెండు రోజులు ముందుగానే అంటే జనవరి 11న స్టార్ట్ అవుతుంది. తమిళ హీరోలు విజయ్ నటించిన 'వారసుడు' (తమిళంలో 'వారిసు'), అజిత్ 'తునివు' (తెలుగులో 'తెగింపు') చిత్రాలు జనవరి 11నే విడుదల కానున్నాయి. విజయ్, రష్మికా మందన్నా జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'వారసుడు'. ఈ సినిమాను 'దిల్' రాజు, శిరీష్‌లు నిర్మించారు. ఓ సంపన్న ఉమ్మడి కుటుంబంలో చోటు చేసుకునే వివిధ సంఘటనల సమాహారంగా ఈ సినిమా ఉంటుందని తెలుస్తోంది. ఇక 'నేర్కొండ పార్వై' (హిందీ 'పింక్' తమిళ రీమేక్), 'వలిమై' చిత్రాల తర్వాత హీరో అజిత్, దర్శకుడు హెచ్. వినోద్, నిర్మాత బోనీ కపూర్‌ల కాంబినేషన్‌లో తెరకెక్కిన మూడో చిత్రం 'తెగింపు' (తమిళంలో 'తునివు'). ఈ యాక్షన్ ఫిల్మ్ కథాంశం బ్యాంకు రాబరీ నేపథ్యంలో ఉంటుంది. బ్యాంకును హైజాక్ చేసిన ఓ వ్యక్తి, ఆ బ్యాంకు కస్టమర్లను హోస్టేజ్‌గా చేసి తన లక్ష్యాలు నెరవేరేలా ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేస్తాడు. 'తెగింపు' ప్రధానాంశం ఇదే అని తెలుస్తోంది. కాగా జనవరి 12న 'వీరసింహారెడ్డి'గా వస్తున్నారు బాలకృష్ణ. 'అఖండ' వంటి హిట్ తర్వాత బాలకృష్ణ, 'క్రాక్' వంటి హిట్ తర్వాత దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రూపొందిన ఈ 'వీరసింహారెడ్డి'లో శ్రుతీహాసన్ హీరోయిన్. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలు. రాయలసీమ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. మరోవైపు 'వాల్తేరు వీరయ్య'గా జనవరి 13న వస్తున్నారు చిరంజీవి. ఆయన టైటిల్ రోల్‌లో నటించి, హీరో రవితేజ ఓ కీలక పాత్ర పోషించిన ఈ సినిమాకు కొల్లి బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకుడు. శ్రుతీ హాసన్ నాయిక. శ్రీకాకుళంలో నివాసం ఉండే వాల్తేరు వీరయ్య (చిరంజీవి)కు, మరో ఏరియాలో ఉండే పోలీస్ ఆఫీసర్ విక్రమ్ సాగర్ (రవితేజ)లకు మధ్య ఉన్న అనుబంధం, పగ అంశాలతో ఈ సినిమా కథనం సాగుతుందని సమాచారం. ఈ చిత్రాన్ని కూడా నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌లే నిర్మించారు. ఇక ప్రతి సంక్రాంతికి పెద్ద స్టార్స్ మధ్య చిన్న హీరోల సినిమాలూ రిలీజ్ అవుతాయి. ఈ సంక్రాంతికి ఈ జాబితాలో నిలిచిన మూవీ 'కళ్యాణం కమనీయం'. సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన ఈ చిత్రం జనవరి 14న విడుదల కానుంది. ఆళ్ల అనిల్ కుమార్ దర్శకత్వంలో ఈ సినిమాను యూవీ కాన్సెప్ట్స్ నిర్మించింది. శివ (సంతోష్), శ్రుతి (ప్రియా) ప్రేమ బంధం నుంచి వైవాహిక జీవితంలోకి అడుగు పెడతారు. అయితే శివకు జాబ్ లేకపోవడం వారి మధ్య ఎలాంటి మనస్పర్థలకు దారి తీసింది అనేది చిత్రం ప్రధానాంశం. మరి.. ఈ సంక్రాంతి బరిలో ఏ సినిమాకు ప్రేక్షకులు 'సంక్రాంతి హిట్' ట్యాగ్ ఇస్తారో చూడాలి.


● బాలకృష్ణ


● విజయ్


● అజిత్

మళ్లీ క్లాష్

చిరంజీవి, బాలకృష్ణ ఇప్పటివరకు ఏడెనిమిది సార్లు సంక్రాంతికి బాక్సాఫీస్ వద్ద పోటీపడ్డ సంగతి తెలిసిందే. చివరిసారిగా 2017లో చిరంజీవి 'ఖైదీ నంబరు 150 (జనవరి 11)', బాలకృష్ణ 'గౌతమి పుత్రశాతకర్ణి' (జనవరి 12) చిత్రాలతో పోటీపడ్డారు. ఈ రెండు చిత్రాలూ విజయం సాధించాయి. మళ్లీ ఆరేళ్లకు వీరిద్దరూ సంక్రాంతి బరిలో ఉన్నారు. సేమ్ తమిళ హీరోలు అజిత్, విజయ్ కూడా పొంగల్‌కి బాక్సాఫీస్ వద్ద పోటీ పడ్డ హీరోలే. 2014లో అజిత్ 'వీరమ్ (జనవరి 10)', విజయ్ 'జిల్లా' (జనవరి 10) చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు వీరి తాజా చిత్రాలు 'తెగింపు', 'వారసుడు' కూడా ఒకేరోజు (జనవరి 11) విడుదల కానుండటం విశేషం.


● ప్రియా భవానీ, సంతోష్

పండగకి చిన్న సినిమాలూ హిట్టే

- అనిల్‌కుమార్ ఆళ్ల

"ప్రతి సంక్రాంతికి పెద్ద సినిమాలతో పాటు చిన్న సినిమాలూ విడుదలవుతుంటాయి.. హిట్టవుతుంటాయి కూడా. పండగకి ఎన్ని సినిమాలు వచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారు. పైగా నాలుగు మాస్ సినిమాల మధ్య వస్తున్న ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మా 'కళ్యాణం కమనీయం'. సంక్రాంతి పండగ అంటే సినిమా పండగ. కుటుంబం అంతా కలిసి చూసేలా మా సినిమా ఉంటుంది. అందుకే పెద్ద స్టార్స్ సినిమాలున్నా మా చిత్రాన్ని నమ్మకంగా రిలీజ్ చేస్తున్నాం. థియేటర్లు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలోనే దొరుకుతున్నాయి" అని చిత్రదర్శకుడు అనిల్‌కుమార్ ఆళ్ల 'సాక్షి'తో అన్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ని గురువారం అనుష్క రిలీజ్ చేశారు.

రివెంజ్ హిట్టవ్వాలి

- దర్శకుడు ఎన్. శంకర్

"'రివెంజ్' దర్శకుడు శ్రీను, నా ప్రయాణం చెన్నై నుంచే ప్రారంభమైంది. తను మంచి రైటర్, డైరెక్టర్. సినిమానే ప్రాణంగా బతికే వ్యక్తి. శ్రీను, బాబులకు సినిమా అంటే ఎంతో ప్యాషన్.. అంకితభావం ఉన్న వీరిద్దరూ కలిసి చేసిన 'రివెంజ్' మంచి హిట్ కావాలి" అని దర్శకుడు ఎన్. శంకర్ అన్నారు. బాబు పెదపూడి హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'రివెంజ్'. రెట్టడి శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నేహా దేశ్‌పాండే హీరోయిన్. ఆది అక్షర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం ట్రైలర్‌ను ఎన్. శంకర్ విడుదల చేశారు. హీరో-నిర్మాత బాబు పెదపూడి మాట్లాడుతూ- "త్రివిక్రమ్‌గారి 'అతడు', దశరథ్‌గారి 'శ్రీ' సినిమాల్లో మంచి పాత్రలు చేశాను. ఆ తర్వాత అవకాశాలు వచ్చినప్పటికీ బిజీ వల్ల చేయలేకపోయాను. శ్రీనివాస్‌గారి అంకితభావం నచ్చి, 'రివెంజ్' అవకాశం ఇచ్చాను. త్వరలో సినిమా విడుదలకు ప్లాన్ చేస్తున్నాం" అన్నారు. "30 ఏళ్లుగా చిత్ర రంగంలో ఉంటున్నాను. వంశీ, విజయ్ భాస్కర్ వంటి ప్రముఖ దర్శకుల వద్ద పని చేశాను. 'పొదరిల్లు, ఐపీసీ సెక్షన్' వంటి చిత్రాల తర్వాత నేను దర్శకత్వం వహించిన మూడో చిత్రం 'రివెంజ్'" అన్నారు రెట్టడి శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో దర్శకుడు వీరభద్రమ్ చౌదరి, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ శోభారాణి, వ్యాపార, రాజకీయవేత్త ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: చిడతల నవీన్, సంగీతం: విజయ్ కురాకుల.


● బాబు పెదపూడి, ఎన్. శంకర్, వీరభద్రమ్

సినిమా అంటే దేవాలయం

- రాజమౌళి

"నా దృష్టిలో సినిమా అంటే ఓ దేవాలయం. చిన్నప్పుడు సినిమా చూసేందుకు వెళ్లినప్పుడు పొందిన ఆనందం నాకిప్పటికీ గుర్తుంది" అని దర్శకుడు రాజమౌళి అన్నారు. రామ్‌చరణ్, ఎన్టీఆర్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా గత ఏడాది విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పటికే ఈ చిత్రం పలు అవార్డులు అందుకుంది. తాజాగా ఉత్తమ దర్శకుడిగా 'న్యూయార్క్ ఫిల్మ్ క్రిటిక్స్ సర్కిల్' అవార్డును అందుకున్నారు రాజమౌళి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- "ఆర్ఆర్ఆర్‌కి ఉత్తమ దర్శకుడి అవార్డును అందుకోవడం సంతోషంగా ఉంది. ప్రతి సీన్‌ని నేను ఓ ప్రేక్షకుడిలా ఊహించుకుని తీస్తాను. ప్రపంచంలోని భారతీయులను ఆకట్టుకోవడం కోసం సినిమాలు తీస్తుంటాను. కానీ, 'ఆర్ఆర్ఆర్'పై భారతీయులు ఎలాంటి ప్రేమను చూపించారో విదేశీయులు కూడా అలానే చూపించారు. నా సినిమాలకు పని చేసే ముఖ్యమైన వ్యక్తులందరూ నా సొంత కుటుంబ సభ్యులే. నన్ను అత్యున్నత స్థానంలో నిలపడం కోసం వారు కష్టపడుతున్నారు. నేను ఎలాంటి విజయాలు అందుకున్నా నా కుటుంబానికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. అలాగే, 'ఆర్ఆర్ఆర్' టీమ్, తారక్ (ఎన్టీఆర్), చరణ్ (రామ్‌చరణ్)లకు, సినిమా ప్రేమికులకు థ్యాంక్స్" అన్నారు. కాగా ఈ వేడుకలో రాజమౌళి సతీమణి రమా, వదిన వల్లి, తనయుడు కార్తికేయ, కోడలు పూజ, నిర్మాత శోభు యార్లగడ్డ పాల్గొన్నారు.


● న్యూయార్క్‌లో ఓ సెల్ఫీ

గుర్తుండిపోయే పాత్ర చేశా

- దునియా విజయ్



"బాలకృష్ణగారి సినిమాలు చూస్తూ పెరిగాను.. అలాంటిది ఆయనతో కలసి నటించడం మాటల్లో చెప్పలేని అనుభూతి. తొలిసారి ఆయన్ని సెట్‌లో చూసినప్పుడు నన్ను నేను నమ్మలేకపోయాను.. ఆయనది గొప్ప వ్యక్తిత్వం" అని నటుడు దునియా విజయ్ అన్నారు. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. ఈ చిత్రంలో మెయిన్ విలన్ పాత్ర పోషించిన కన్నడ నటుడు దునియా విజయ్ మాట్లాడుతూ- "గోపీచంద్‌గారు బ్రిలియంట్ డైరెక్టర్. 'వీరసింహారెడ్డి' లో నా పాత్ర (ముసలిమడుగు ప్రతాప్ రెడ్డి) గురించి చెప్పినప్పుడే చాలా థ్రిల్ అనిపించింది. చాలా మొరటుగా ఉండే నా పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది. ఇంత మంచి పాత్రలో బాలకృష్ణగారి సినిమాలో నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఆయన ఎనర్జీ సూపర్.. పనిపట్ల అంకితభావం గొప్పగా ఉంటుంది. 'వీరసింహారెడ్డి' ఆయన అభిమానులకు, ప్రేక్షకులకు గ్రేట్ ఎమోషనల్ జర్నీ. ఒక నటుడిగా అన్ని పాత్రలూ చేయాలని ఉంటుంది. ఈ సినిమా తర్వాత కూడా మంచి పాత్రలు వస్తే విలన్‌గా చేయడానికి సిద్ధమే. నటన, దర్శకత్వం వేర్వేరు. నటుడిగా చేస్తున్నప్పుడు నా దృష్టి కేవలం నటనపైనే ఉంటుంది. దర్శకునిగా చేస్తున్నప్పుడు నా నుండి ప్రేక్షకులు ఏం కోరుకుంటున్నారో దానిపైనే ఫోకస్ ఉంటుంది. ప్రస్తుతం కన్నడలో 'భీమ' అనే చిత్రంలో నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్నాను. తెలుగులోనూ కొన్ని చర్చలు జరుగుతున్నాయి" అన్నారు.

సాక్షి **బిజినెస్**
శుక్రవారం
6-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
304	51
60,353	17,992

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	10,341	▽	118
డోజోన్స్	32,893	▽	377
ఎఫ్‌టీఎస్ఈ 100	7,633	▲	43
డాక్స్	14,436	▲	54
షాంఘై	3,155	▲	32
నికాయ్	25,821	▲	104

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	55,796 ▲ 346
బంగారం (99.5 స్వచ్ఛత)	55,573 ▲ 344
వెండి (కిలో)	67,678 ▽ 1693

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.01	83.68
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	86.39	89.48
€	యూరో	ఒకటి	98.15	101.44
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	61.71	63.70
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.35	57.75
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.76	62.77
SAR	సౌదీ రియాల్	[illegible]	21.02	22.69
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.58	23.38
¥	చైనా యువాన్	[illegible]	10.89	12.92

4,675 ఈ-బస్‌లకు సీఈఎస్ఎల్ టెండర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ (సీఈఎస్ఎల్) తాజాగా 4,675 ఎలక్ట్రిక్ బస్‌లకు టెండర్లను పిలిచింది. వీటి విలువ రూ.5,000 కోట్లు. నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రామ్ (ఎన్ఈబీపీ) కింద టెండర్లను ఆహ్వానించడం ఇది రెండవసారి అని సీఈఎస్ఎల్ గురువారం తెలిపింది. డ్రై లీజ్ ప్రాతిపదికన ఈ బస్‌లను తెలంగాణ, ఢిల్లీ, కేరళలో ప్రవేశపెడతారు. డ్రై లీజ్ పద్ధతిలో డ్రైవర్లు, కండక్టర్లు లేకుండా ఈ బస్‌లను ఆపరేటర్లు రాష్ట్ర రోడ్డు రవాణా (ఎస్‌టీసీ) సంస్థలకు సరఫరా చేస్తారు. ఎస్‌టీసీలు తమ సిబ్బందితో వీటిని నడిపిస్తాయి. యాజమాన్య హక్కులతోపాటు నిర్వహణ బాధ్యతలను 10, 12 ఏళ్లపాటు సర్వీస్ ప్రొవైడర్లు (ఆపరేటర్లు) చేపడతారు. ఒక్కో బస్‌కు నిర్దేశిత రుసుమును ఆపరేటర్లకు ఎస్‌టీసీలు చెల్లిస్తాయి. బిడ్డర్లు, ఎస్‌టీసీలు తప్పనిసరిగా మహిళలను నియమించుకోవడంతోపాటు సురక్షిత వాతావరణాన్ని కల్పించాల్సి ఉంటుంది. 4,675 ఎలక్ట్రిక్ బస్‌లు వస్తే ఏటా 15 లక్షల కిలోలీటర్ల ఇంధనం ఆదా అవుతుందని సీఈఎస్ఎల్ తెలిపింది.

లిస్టెడ్ కంపెనీలకు సెబీ దన్ను

వార్షిక నివేదిక హార్డ్ కాపీలకు చెక్



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ లిస్టెడ్ కంపెనీలకు వార్షిక నివేదికల విషయంలో మరోసారి దన్నుగా నిలిచింది. ఈ ఏడాది సెప్టెంబర్‌వరకూ వాటాదారులకు వార్షిక నివేదికల హార్డ్ కాపీలను పంపించనవసరం లేదని స్పష్టం చేసింది. ఇప్పటికే 2022 డిసెంబర్‌వరకూ అన్ని లిస్టెడ్ కంపెనీలనూ ఇందుకు అనుమతించింది. తాజాగా ఈ ఆదేశాలను 2023 సెప్టెంబర్‌వరకూ పొడిగించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-1-2023	
విశాఖ	555–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	78.00
5-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	541–00
వరంగల్	543–00
రిటైల్ ధర	6.00

అమెజాన్, సేల్స్'ఫోర్స్'లో కోత

- యూఎస్‌లో ఉద్యోగులకు షాక్
- అమెజాన్‌లో 18,000 మందికి టాటా
- సేల్స్‌ఫోర్స్ నుంచి 8,000 మంది ఔట్

వాషింగ్టన్: ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ ఇంక్, ఐటీ దిగ్గజం సేల్స్‌ఫోర్స్ తాజాగా ఉద్యోగాలలో కోత పెట్టనున్నట్లు వెల్లడించాయి. వెరసి కరోనా మహమ్మారి తదుపరి సిబ్బందిని తగ్గించుకుంటున్న పలు కంపెనీల బాటలో నడవనున్నాయి. అమెజాన్ 18,000 పొజిషన్లను తప్పించనున్నట్లు తెలియజేసింది. ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికంకాగా.. ప్రపంచవ్యాప్తంగా 15 లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలోనూ పలు సంక్షోభ సమయాలను అధిగమించిన కంపెనీ భవిష్యత్‌లోనూ నిలదొక్కుకోగలదని ఉద్యోగులకు పంపిన నోట్‌లో అమెజాన్ సీఈవో ఆండీ జెస్సీ పేర్కొన్నారు. ప్రధానంగా అమెజాన్ ఫ్రెష్, అమెజాన్ గో స్టోర్ల సిబ్బందిపైనే తాజా వేటు పడుతున్నట్లు వెల్లడించారు.



8,000 మందికి గుడ్‌బై

టెక్నాలజీ దిగ్గజం సేల్స్‌ఫోర్స్ 8,000 మంది ఉద్యోగులకు గుడ్‌బై చెప్పనుంది. ఇది కంపెనీ మొత్తం సిబ్బందిలో 10%కి సమానంకాగా.. 23ఏళ్ల కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికం! క్లౌడ్ కంప్యూటింగ్‌కు తెరతీసిన సేల్స్‌ఫోర్స్‌ను ఒరాకిల్ మాజీ ఎగ్జిక్యూటివ్ మార్క్ బెనియాఫ్ నెలకొల్పారు. మరోవైపు టాప్ ర్యాంక్‌లోనూ కోతలు కనిపిస్తున్నాయి. ట్విట్టర్ చైర్మన్‌గా వ్యవహరించిన కో-సీఈవో బ్రెట్ టేలర్, స్లాక్ సహవ్యవస్థాపకుడు స్టివార్ట్ బటర్‌ఫీల్డ్ సైతం సేల్స్‌ఫోర్స్ నుంచి వైదొలిగారు. స్లాక్‌ను 28 బిలియన్ డాలర్లకు సేల్స్‌ఫోర్స్ కొనుగోలు చేసింది.

బీఎస్ఈ సీఈవోగా సుందరరామన్

గత నెలలోనే సెబీ ఆమోదముద్ర



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం బీఎస్ఈకి ఎండీ, సీఈవోగా సుందరరామన్ రామమూర్తి ఎంపికయ్యారు. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రామమూర్తి ఎంపికకు గత నెలలోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు బీఎస్ఈ పేర్కొంది. అయితే ఈ ఆఫర్‌ను రామమూర్తి ఆమోదించవలసి ఉన్నట్లు తెలియజేసింది. బీఎస్ఈ గత ఎండీ, సీఈవో ఆశిష్ కుమార్ చౌహాన్ గతేడాది(2022) జూలైలో పదవి నుంచి తప్పుకుని మరో దిగ్గజ స్టాక్ ఎక్స్ఛేంజీ ఎన్ఎస్ఈకి తరలి వెళ్లారు. దీంతో ఎన్ఎస్ఈలో సభ్యులుగా వ్యవహరించిన రామమూర్తికి బీఎస్ఈ అత్యున్నత పదవిని ఆఫర్ చేసింది.

18,000 దిగువకు నిఫ్టీ

- సెన్సెక్స్ నష్టం 304 పాయింట్లు
- రెండోరోజూ సూచీల డీలా
- ఫెడ్ వడ్డీరేట్ల పెంపు అంచనా ఒత్తిళ్లు
- ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంక్స్, ఐటీ షేర్లలో అమ్మకాలు



ముంబై: అమెరికాలో కీలక వడ్డీరేట్ల పెంపు ఈ ఏడాదిలోనూ కొనసాగొచ్చని ఫెడ్ మినిట్స్ ద్వారా వెల్లడి కావడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ డీలా పడ్డాయి. వీక్లీ ఆప్షన్స్ ఎక్స్‌పైరీ నేపథ్యంలో ట్రేడర్లు పొజిషన్లను వదిలించుకోవడంతో పాటు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. విదేశీ ఇన్వెస్టర్లు పదో ట్రేడింగ్ సెషన్‌లోనూ విక్రయాలను పాల్పడ్డారు. ఆర్థిక మాంద్యం భయాలు వెంటాడటంతో ప్రపంచ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందాయి. ఫలితంగా ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంక్స్, ఐటీ, వినిమయ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో గురువారం సెన్సెక్స్ 304 పాయింట్లు పతనమై 60,353 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 51 పాయింట్లు నష్టపోయి 18వేల స్థాయి దిగువన 17,992 వద్ద నిలిచింది. ట్రేడింగ్ ప్రారంభంలో సానుకూలంగా కదలాడిన సూచీలు ఆ తర్వాత కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 607 పాయింట్లు క్షీణించి 60,050 వద్ద, నిఫ్టీ 150 పాయింట్లను కోల్పోయి 17,893 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. చివరి గంటలో ఫార్మా, మెటల్, ఇంధన, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించినప్పటికీ.., సూచీలు నష్టాల నుంచి తేరుకోలేకపోయాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు వరుసగా 0.33%, 0.01 శాతం చొప్పున నష్టపోయాయి. వడ్డీ రేట్ల పెంపు అంశాన్ని ఫెడ్ మినిట్స్ ద్వారా ఖరారు చేసుకున్న ప్రపంచ మార్కెట్లు మిశ్రమంగా కదలాడాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 37 పైసలు బలపడి 82.45 స్థాయి వద్ద స్థిరపడింది. రెండు వరుస ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 941 పాయింట్లు, నిఫ్టీ 240 పాయింట్లు నష్టపోయాయి.

"ప్రపంచ ఈక్విటీ మార్కెట్లతో పోలిస్తే ఇప్పటికీ భారత మార్కెట్ వ్యాల్యుయేషన్‌లు అధికంగా ఉన్నాయి. అంతర్జాతీయ అనిశ్చితులు, సవాళ్ల నేపథ్యంలో ఇన్వెస్టర్లు పొజిషన్లను పరిమితంగా చేసుకునేందుకు స్థిరంగా లాభాల స్వీకరణకు పాల్పడుతున్నారు. వడ్డీ రేట్ల పెంపు, భౌగోళిక అనిశ్చితులు తెరపైకి వస్తున్న తరుణంలో ఇన్వెస్టర్లు పూర్తి అప్రమత్తతతో వహిస్తున్నారు" అని కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు.

బజాజ్ ఫైనాన్స్‌కు రూ.28,681 కోట్ల నష్టం

డిసెంబర్ క్వార్టర్ ముందస్తు వ్యాపార గణాంకాలు అంచనాలను అందుకోలేకపోవడంతో ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజ బజాజ్ ఫైనాన్స్ షేరు భారీ పతనాన్ని చవిచూసింది. బీఎస్ఈలో ఏడుశాతానికి పైగా నష్టపోయి రూ.6,100 స్థాయి వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో ఎనిమిది శాతానికి పైగా క్షీణించి రూ.6,032 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే. షేరు భారీగా దిగిరావడంతో కంపెనీకి రూ.28,681 కోట్ల నష్టం వాటిల్లింది. వెరసి కంపెనీ మొత్తం మార్కెట్ విలువ రూ.3.69 లక్షల కోట్లుగా నమోదైంది.

ఫైనాన్స్ షేర్ల భారీ పతనం

బ్యాంకింగేతర కంపెనీల ప్రీ-క్వార్టర్ డేటా నిరాశపరచడంతో పలు ఫైనాన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్ సర్వ్ కంపెనీల షేర్లు 7%, ఐదుశాతం చొప్పున పతనమయ్యాయి.. చోళ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 4–1% నష్టపోయాయి.

2024లో బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలు

కేంద్ర టెలికం మంత్రి వైష్ణవ్ వెల్లడి



భువనేశ్వర్: ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ 2024 నుంచి 5జీ సర్వీసులను ప్రారంభిస్తుందని కేంద్ర టెలికం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం 4జీ నెట్‌వర్క్ ఏర్పాటు కోసం టీసీఎస్, సీ-డీవోటీ సారథ్యంలోని కన్సార్షియంను బీఎస్ఎన్ఎల్ షార్ట్‌లిస్ట్ చేసిందని ఆయన చెప్పారు. దీన్ని ఏడాది వ్యవధిలో 5జీకి అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ఒడిషాలో జియో, ఎయిర్‌టెల్ 5జీ సర్వీసులను ప్రారంభించిన సందర్భంగా మంత్రి వివరించారు. ఒడిషాలో టెలికం కనెక్టివిటీని మెరుగుపర్చేందుకు కేంద్రం రూ. 5,600 కోట్లు కేటాయించిందని ఆయన చెప్పారు. మరోవైపు, రుణ సంక్షోభంలో ఉన్న టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియాకు (వీఐఎల్) నిధులు సహా వివిధ అవసరాలు ఉన్నాయని వైష్ణవ్ తెలిపారు. ఎంత మేర పెట్టుబడులు కావాలి, ఎవరు ఎన్ని నిధులను సమకూర్చాలనే అంశాలపై చర్చలు జరుగుతున్నాయని ఆయన వివరించారు. వీఐఎల్‌కు రూ. 2 లక్షల కోట్ల పైగా రుణ భారం ఉంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ. 16,000 కోట్ల వడ్డీని ఈక్విటీ కింద మార్చే ఆప్షన్‌ను వినియోగించుకోవాలని వీఐఎల్ నిర్ణయించుకుంది. దీంతో కేంద్ర ప్రభుత్వానికి దాదాపు 33 శాతం వాటా లభిస్తుండగా, ప్రమోటర్ల హోల్డింగ్ 74.99 శాతం నుంచి 50 శాతానికి తగ్గుతుంది.

విస్తరణలో రుషిల్ డెకోర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైజాగ్‌లో ఎండీఎఫ్ బోర్డుల తయారీ ప్లాంటును ఏర్పాటు చేసిన ఇంటీరియర్ ఇన్‌ఫ్రా తయారీ సంస్థ రుషిల్ డెకోర్ .. తాజాగా కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా రూ. 60 కోట్లతో గుజరాత్‌లో జంబో-సైజ్ డెకరేటివ్ ల్యామినేట్స్ ప్లాంటును నెలకొల్పుతోంది. ఇది 2024–25 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అందుబాటులోకి రాగలదని సంస్థ డైరెక్టర్ రుషిల్ ఠక్కర్ గురువారమిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎండీఎఫ్, ల్యామినేట్స్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటకలో తమకు మొత్తం అయిదు అధునాతన ప్లాంట్లు ఉన్నాయని ఆయన వివరించారు. వైజాగ్ ప్లాంటు సామర్థ్య వినియోగం ప్రస్తుతం సుమారు 74%గా ఉందని, దీన్ని త్వరలో 100%కి పెంచుకోనున్నట్లు రుషిల్ చెప్పారు. తమ ఎండీఎఫ్ అమ్మకాల్లో తెలంగాణ వాటా 18%గా ఉండగా, దేశీయంగా మొత్తం ఎండీఎఫ్ మార్కెట్లో తమ వాటా సుమారు 24% వరకూ ఉంటుందని ఆయన వివరించారు. గత ఆర్థిక సంవత్సరం రూ. 624 కోట్ల ఆదాయం ఆర్జించగా ఈసారి దాదాపు రూ. 800 కోట్ల పైచిలుకు ఉంటుందని అంచనా వేస్తున్నట్లు రుషిల్ తెలిపారు.

చిన్న ఫార్మా సంస్థల్లో రుణాలకు డిమాండ్

యాక్సిస్ బ్యాంక్ ప్రెసిడెంట్ సంగ్రామ్ సింగ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తెలుగు రాష్ట్రాల్లో ఫార్మా, ఆటో, ఇంజినీరింగ్, విద్య తదితర రంగాల్లోని చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) నుంచి రుణాలకు డిమాండ్ నెలకొందని యాక్సిస్ బ్యాంక్ ప్రెసిడెంట్ (కమర్షియల్ బ్యాంకింగ్ కవరేజీ విభాగం) సంగ్రామ్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం తమ బ్యాంక్ బ్యాలెన్స్ షీట్‌లో ఎస్ఎంఈ రుణాల పోర్ట్‌ఫోలియో వాటా 20 శాతం మేర ఉంటుందని ఆయన చెప్పారు. గత అయిదేళ్లుగా ఈ విభాగం ఏటా 28 శాతం వృద్ధి నమోదు చేస్తోందని వివరించారు. రుణ, ఆర్థిక సేవల విషయంలో చిన్న సంస్థలకు తోడ్పాటు అందించే దిశగా యాక్సిస్ బ్యాంక్ గురువారమిక్కడ 'ఎవాల్వ్' కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా సింగ్ ఈ విషయాలు చెప్పారు. యాక్సిస్ బ్యాంక్‌కు దేశవ్యాప్తంగా 4,760 పైచిలుకు శాఖలు ఉండగా, 189 ఎస్ఎంఈ సెంటర్ల ద్వారా చిన్న, మధ్యతరహా సంస్థలకు సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్‌బీఎఫ్‌సీల్లాంటి వాటి నుంచి పోటీ ఉన్నా తాము రుణాలు మొదలుకుని డిపాజిట్, ట్రేడ్, ఫారెక్స్ వరకూ వివిధ ఆర్థిక సర్వీసుల అన్నీ అందిస్తాము కాబట్టి చిన్న సంస్థలకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని సింగ్ చెప్పారు.

ఒగ్బెచె 'హ్యాట్రిక్'తో హైదరాబాద్ ఘన విజయం

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (హెచ్ఎఫ్‌సీ) జోరు కొనసాగుతోంది. గురువారం గోవాలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 3–1 గోల్స్ తేడాతో గోవా ఎఫ్‌సీపై ఘన విజయం సాధించింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు సాధారణ ప్రదర్శన కనబర్చిన బార్తొలొమెవ్ ఒగ్బెచె ఈ మ్యాచ్‌లో 'హ్యాట్రిక్'తో చెలరేగి జట్టును గెలిపించాడు. హైదరాబాద్ తరఫున నమోదైన మూడు గోల్స్‌ను (21వ నిమిషం, 79వ నిమిషం, 90వ నిమిషం) కూడా ఒగ్బెచె సాధించడం విశేషం. గోవా తరఫున రెడీమ్ (54వ నిమిషం) ఏకైక గోల్ చేశాడు. తాజా విజయంతో హైదరాబాద్ మరో సారి అగ్రస్థానానికి దూసుకుపోయింది. 13 మ్యాచ్‌లలో 10 మ్యాచ్‌లు గెలిచిన జట్టు మొత్తం 31 పాయింట్లతో పట్టికలో నంబర్‌వన్‌గా కొనసాగుతోంది.



పరుగుల వరదలో తేడా పదహారు!

- రెండో టి20లో పోరాడి ఓడిన భారత్
- 16 పరుగులతో శ్రీలంక గెలుపు
- అక్షర్, సూర్యకుమార్ పోరాటం వృథా
- లంకను గెలిపించిన షనక



పుణే: భారత్ విజయలక్ష్యం 207 పరుగులు... ఒక దశలో స్కోరు 57/5... మిగిలిన 65 బంతుల్లో మరో 150 పరుగులు చేయాలి...భారీ ఓటమి ఖాయమనిపించింది...అయితే ఈ దశలో అక్షర్ పటేల్ (31 బంతుల్లో 65; 3 ఫోర్లు, 6 సిక్సర్లు) అనూహ్యంగా చెలరేగిపోయాడు. ఈ మ్యాచ్‌కు ముందు ఒకే ఒక్కసారి 30కి పైగా పరుగులు (గత మ్యాచ్‌లోనే) చేసిన అతను ఈ సారి విధ్వంస ప్రదర్శనతో చెలరేగిపోయాడు. మరో వైపునుంచి సూర్యకుమార్ యాదవ్ (36 బంతుల్లో 51; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) కూడా సత్తా చాటడంతో భారత్ గెలుపు ఆశలు పెరిగాయి. వీరిద్దరు 40 బంతుల్లోనే 91 పరుగులు జోడించారు. అయితే 26 బంతుల్లో 59 పరుగులు చేయాల్సిన స్థితిలో సూర్య వెనుదిరగడంతో ఛేదన కష్టంగా మారిపోగా... అక్షర్ ఆఖరి ఓవర్ మూడో బంతికి అవుట్ కావడంతో టీమిండియాకు ఓటమి తప్పలేదు. చివరకు 16 పరుగుల తేడాతో గెలిచి శ్రీలంక ఊపిరి పీల్చుకుంది.

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 6 వికెట్లకు 206 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దసున్ షనక (22 బంతుల్లో 56 నాటౌట్; 2 ఫోర్లు, 6 సిక్సర్లు), కుశాల్ మెండిస్ (31 బంతుల్లో 52; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 190 పరుగులు చేసి ఓడింది.

మెరిపించిన మెండిస్

ఓపెనర్లు కుశాల్ మెండిస్, నిసాంక లంక ఇన్నింగ్స్‌ను వేగంగా నడిపించారు. 27 బంతుల్లో (3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించిన మెండిస్‌ను చహల్ అవుట్ చేశాడు. అసలంక (19 బంతుల్లో 37; 4 సిక్సర్లు) కూడా బ్యాట్ ఝుళిపించాడు. 17వ ఓవర్ ముగిసేసరికి కూడా షనక (7 బంతుల్లో 6) పది పరుగులైనా చేయలేదు. కానీ ఆఖరి మూడు ఓవర్లలో అతను విధ్వంసం సృష్టించాడు. అర్ధ సెంచరీ (20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో) సాధించి లంక తరఫున టి20ల్లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ చేసిన బ్యాటర్‌గా షనక రికార్డులకెక్కాడు.

చెత్త బౌలింగ్

లంక 200 పైచిలుకు స్కోరులో భారత బౌలర్లు శివమ్ మావి (0/53), ఉమ్రాన్ (3/48) ఇద్దరే 101 పరుగులు సమర్పించుకోవడం విశేషం. అర్ష్‌దీప్ కేవలం 2 ఓవర్ల స్పెల్ మాత్రమే వేసి 37 పరుగులు ఇచ్చాడు. ఏకంగా 5 నోబాల్స్ వేయడం కూడా లంక భారీ స్కోరుకు అవకాశమిచ్చింది. దీంతో పాటు మరో 2 నోబాల్స్ కలిపి మొత్తం '7 నోబాల్'లు చివరకు భారత్ ఓటమిలో కీలకంగా నిలిచాయి.

టాపార్డర్ విఫలం...

భారత్ ముందు కొండంత లక్ష్యం వుంటే టాపార్డర్ 21 పరుగులకే డగౌట్ చేరింది. ఇషాన్ (2), గిల్ (5), త్రిపాఠి (5) చెత్త షాట్లతో అవుటయ్యారు. కెప్టెన్ పాండ్యా (12; 1 ఫోర్, 1 సిక్స్) పవర్‌ప్లేలోనే వెనుదిరిగాడు. కాసేపటికి దీపక్ హుడా (9) అవుట్ కావడంతో 57 పరుగులకే సగం వికెట్లు కూలాయి.

ఆశలు రేపిన అక్షర్ సిక్సర్లు...

పదో ఓవర్లో అక్షర్ వచ్చీ రాగానే హసరంగ ఓవర్లో సిక్సర్ బాదాడు. ఆ తర్వాత కరుణరత్నే బౌలింగ్‌లో బౌండరీ కొట్టిన అక్షర్ 13వ ఓవర్ వేసిన తీక్షణ బౌలింగ్‌లో బౌండరీ, భారీ సిక్సర్ బాదాడు. దీంతో లంక కెప్టెన్ తమ స్టార్ స్పిన్నర్ హసరంగను దించితే అక్షర్ చుక్కలు చూపించాడు. స్వీప్, స్లాగ్‌స్వీప్, లాఫ్టెడ్ షాట్లతో 'హ్యాట్రిక్' సిక్సర్లు బాదాడు. తర్వాత పరుగు తీసివ్వగా, సూర్యకుమార్ ఐదో బంతిని ఎక్స్‌ట్రా కవర్ దిశగా సిక్స్ కొట్టాడు. దీంతో ఈ ఓవర్లో 26 పరుగులు వచ్చాయి. తర్వాత కరుణరత్నేకు ఇద్దరు సిక్సర్లతో తమ ధాటిని చూపెట్టారు. 20 బంతుల్లోనే అక్షర్ (2 ఫోర్లు, 6 సిక్సర్లు) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. సూర్యకుమార్ కూడా భారీ సిక్సర్‌తో (33 బంతుల్లో; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీని అధిగమించాడు. శివమ్ మావి (15 బంతుల్లో 26; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) కూడా కొంత పోరాడినా లాభం లేకపోయింది.



స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) త్రిపాఠి (బి) అక్షర్ 33; కుశాల్ (ఎల్బీ) (బి) చహల్ 52; రాజపక్స (బి) ఉమ్రాన్ 2; అసలంక (సి) శుబ్‌మన్ (బి) ఉమ్రాన్ 37; ధనంజయ (సి) హుడా (బి) అక్షర్ 3; షనక నాటౌట్ 56; హసరంగ (బి) ఉమ్రాన్ 0; కరుణరత్నే నాటౌట్ 11; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 206. వికెట్ల పతనం:** 1-80, 2-83, 3-96, 4-110, 5-138, 6-138.

బౌలింగ్: హార్దిక్ 2-0-13-0, అర్ష్‌దీప్ 2-0-37-0, శివమ్ మావి 4-0-53-0, అక్షర్ 4-0-24-2, చహల్ 4-0-30-1, ఉమ్రాన్ 4-0-48-3.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (బి) రజిత 2; గిల్ (సి) తీక్షణ (బి) రజిత 5; త్రిపాఠి (సి) మెండిస్ (బి) మదుషంక 5; సూర్యకుమార్ (సి) హసరంగ (బి) మదుషంక 51; పాండ్యా (సి) మెండిస్ (బి) కరుణరత్నే 12; హుడా (సి) ధనంజయ (బి) హసరంగ 9; అక్షర్ (సి) కరుణరత్నే (బి) షనక 65; మావి (సి) తీక్షణ (బి) షనక 26; ఉమ్రాన్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 190. వికెట్ల పతనం:** 1-12, 2-21, 3-21, 4-34, 5-57, 6-148, 7-189, 8-190.

బౌలింగ్: మదుషంక 4-0-45-2, రజిత 4-0-22-2, కరుణరత్నే 4-0-41-1, హసరంగ 3-0-41-1, తీక్షణ 4-0-33-0, షనక 1-0-4-2.

గెలిస్తే ఒక్కొక్కరికి రూ. 1 కోటి!



భువనేశ్వర్: భారత హాకీ జట్టుకు ఇప్పటికే ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న ఒడిషా ప్రభుత్వం ఆటగాళ్లను ఉత్సాహపరిచే మరో ప్రకటన చేసింది. స్వదేశంలో జరిగే ప్రపంచ కప్‌ను భారత్ గెలుచుకుంటే ఒక్కో ఆటగాడికి రూ. 1 కోటి చొప్పున కానుకగా అందజేస్తామని ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటించారు. ఈ నెల 13నుంచి 29 వరకు ఒడిషాలోని రెండు నగరాల్లో హాకీ ప్రపంచకప్ జరుగుతుంది. గురువారం రూర్కెలాలో జరిగిన కార్యక్రమంలో భారత్‌లోనే అతి పెద్దదైన బిర్సా ముండా ఇంటర్నేషనల్ హాకీ స్టేడియాన్ని పట్నాయక్ ప్రారంభించారు. దీంతో పాటు భువనేశ్వర్ (కళింగ స్టేడియం) కూడా వరల్డ్ కప్ మ్యాచ్‌లకు వేదిక కానుంది. ఈ నేపథ్యంలో 'ఒడిషా రే' పుస్తకాన్ని కూడా ఆవిష్కరించిన అనంతరం భారత ఆటగాళ్లతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. తమ రాష్ట్రానికి హాకీతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్న పట్నాయక్...ఆటగాళ్లకు 'బెస్ట్ విషెస్' చెప్పారు. ఈ మెగా టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయి.

ఫైనల్లో శివ థాపా

తుది పోరుకు హుసాముద్దీన్



హిస్సార్: జాతీయ సీనియర్ బాక్సింగ్ (ఎలైట్) చాంపియన్‌షిప్‌లో స్టార్ ఆటగాడు శివ థాపా ఫైనల్లోకి అడుగు పెట్టాడు. అస్సాంకు ప్రాతినిధ్యం వహిస్తున్న థాపా (63.5 కేజీల విభాగం) సెమీ ఫైనల్లో 5-0తో మనీశ్ కౌశిక్ (సర్వీసెస్)ను చిత్తు చేశాడు. ఫైనల్లో అంకిత్ నర్వాల్ (రైల్వేస్)తో థాపా తలపడతాడు.

తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ కూడా 57 కేజీల విభాగంలో ఫైనల్‌కు చేరాడు. సర్వీసెస్ తరఫున బరిలోకి దిగిన హుసాముద్దీన్ సెమీస్‌లో 5-0తో ఆశిష్ కుమార్ (హిమాచల్ ప్రదేశ్)పై ఘన విజయం సాధించాడు. ఇతర కేటగిరీల్లో సంజీత్, నరేందర్, సాగర్ కూడా తుది పోరుకు అర్హత సాధించారు.

విజయంపై ఆంధ్ర గురి!

- హైదరాబాద్ విజయలక్ష్యం 401
- ప్రస్తుతం 75/2





సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీలో ఆంధ్ర జట్టు కీలక విజయంపై గురి పెట్టింది. చిరకాల ప్రత్యర్థి హైదరాబాద్‌తో జరుగుతున్న గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఆ జట్టు మూడో రోజు గెలుపు అవకాశాలు మెరుగుపర్చుకుంది. 401 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ గురువారం ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (21), ప్రజ్ఞయ్ రెడ్డి (0) అవుట్ కాగా...రోహిత్ రాయుడు (46 నాటౌట్), అలంకృత్ అగర్వాల్ (7 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నారు. చివరి రోజు హైదరాబాద్ మరో 326 పరుగులు చేయాల్సి ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 230/3తో ఆట కొనసాగించిన ఆంధ్ర తమ రెండో ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు ఆలౌట్ అయింది. రికీ భుయ్ (150 బంతుల్లో 116; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకోగా, కేఎస్ భరత్ (70 బంతుల్లో 89; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆ అవకాశం చేజార్చుకున్నాడు. ఆపై కరణ్ షిండే (180 బంతుల్లో 105 నాటౌట్; 11 ఫోర్లు, 1 సిక్స్) కూడా శతకం బాదాడు. హైదరాబాద్ బౌలర్లలో రక్షణ్ రెడ్డి 3 వికెట్లు పడగొట్టాడు.

ఖాజా, స్మిత్ శతకాలు

ఆస్ట్రేలియా 475/4





సిడ్నీ: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న చివరి టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోరు నమోదు చేసింది. మ్యాచ్ రెండో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి ఆసీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 475 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖాజా (368 బంతుల్లో 195 నాటౌట్; 19 ఫోర్లు, 1 సిక్స్) డబుల్ సెంచరీకి చేరువ కాగా, స్టీవ్ స్మిత్ (192 బంతుల్లో 104; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకం సాధించాడు. ఖాజాకు ఇది 13వ సెంచరీ కాగా, స్మిత్‌కు 30వ శతకం. వీరిద్దరు మూడో వికెట్‌కు 209 పరుగులు జోడించగా, ట్రవిస్ హెడ్ (70) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. నోర్జేకు 2 వికెట్లు దక్కాయి. ప్రస్తుతం ఖాజాతో పాటు రెన్‌షా (5 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నాడు.

30 టెస్టుల్లో స్మిత్‌కు ఇది 30వ సెంచరీ. డాన్ బ్రాడ్‌మన్ (29)ను అధిగమించిన అతను... అత్యధిక సెంచరీలు చేసిన ఆసీస్ ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానానికి (హేడెన్‌తో సమంగా) చేరుకున్నాడు. పాంటింగ్ (41), స్టీవ్ వా (32) అంతకంటే ముందున్నారు. వేగంగా 30 సెంచరీలు చేసిన ఆటగాళ్లలో సచిన్ (159 ఇన్నింగ్స్) తర్వాత రెండో స్థానంలో స్మిత్ (162 ఇన్నింగ్స్) నిలిచాడు.

కివీస్ గెలుపు దిశగా...

రెండో ఇన్నింగ్స్‌లో పాకిస్తాన్ 0/2



కరాచీ: పాకిస్తాన్ గడ్డపై టెస్టు సిరీస్ విజయంపై న్యూజిలాండ్ గురి పెట్టింది. మూడున్నర రోజుల పాటు చప్పగా సాగిన రెండో టెస్టు గురువారం చివర్లో ఒక్కసారిగా ఆసక్తికరంగా మారింది. 319 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన పాక్ ఆట ముగిసే సమయానికి 2.5 ఓవర్లలో ఒక్క పరుగు కూడా చేయకుండా 2 వికెట్లు కోల్పోయింది. అబ్దుల్లా షఫీక్ (0), నైట్‌వాచ్‌మన్ మీర్ హమ్జా (0) బౌల్డ్ కాగా, ఇమామ్ ఉల్ హక్ (0 నాటౌట్) క్రీజ్‌లో ఉన్నాడు. బంతి ఇప్పటికే అనూహ్యంగా స్పందిస్తుండగా చివరి రోజు పాక్ విజయాన్ని అందుకోవడం అంత సులువు కాదు! అంతకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో 408 పరుగులకు ఆలౌటై పాక్ 41 పరుగుల ఆధిక్యం కోల్పోగా, రెండో ఇన్నింగ్స్‌ను న్యూజిలాండ్ 5 వికెట్లకు 277 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. బ్రేస్‌వెల్ (74 నాటౌట్), బ్లన్‌డెల్ (74), లాథమ్ (62) అర్ధ సెంచరీలు చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

#BeYourBestYou with HP Spectre x360

At an exchange effective price of ~~₹1 34 999.00~~ ₹99 999.00*

AI-powered 5MP IR Glamcam

AI-powered Auto frame technology

3K OLED Touch display



HP Spectre x360 Laptop 13-ef0053TU

SRP (Incl. of all taxes)	₹1 34 999.00
Deferred SBI Credit Card cashback	₹10 000.00
Exchange value of your old laptop	₹11 000.00
Top up bonus	₹10 000.00
Additional loyalty bonus if returning an HP PC	₹4 000.00
Effective price	₹99 999.00
Starting at ₹9 166.00** per month on No Cost EMI	

**The above calculation is an illustration derived by combining HP Exchange Offer and 12 Month No-cost EMI.



Office Home & Student 2021 included with this PC.

Word Excel PowerPoint

Microsoft

10% CASHBACK* SBI card

*T&C Apply

\+

Exchange benefits up to ₹25 000.00^

Scan QR code to locate nearest HP World

Call: 1800 108 4749 | Visit: www.hp.com/in-en/shop

Also available at Reliance Digital, Croma, Vijay Sales, Bajaj Electronics and all other leading retail stores

Terms and conditions apply. The above HP New year offers are valid from 16th December'2022 till 31st January'2023. ^Exchange offer benefit up to ₹25 000.00 is available on select HP laptop models in select HP World stores. ₹25 000.00 exchange value is basis old laptop exchange value of ₹11 000.00 (assuming an 8th Gen Intel® Core™ i5 processor laptop and above) and ₹14 000.00 Top up bonus (Assuming new purchase as Spectre, Envy or Omen Notebooks and old laptop model of HP Brand). *10% Cashback upto ₹10 000.00 offer on Spectre,Envy and Omen Notebooks with SBI Card or 5% Cashback upto ₹5 000.00 on rest models with SBI Card. Min.txn for 5% Cashback is ₹45 000.00 and for 10% Cashback is ₹80 000.00 **Valid on transactions via Pinelabs/Benow on end customer purchases from authorized HP partners, HP World stores and HP Online store. Cashback offer may differ for different banks/NBFC. Finance offers are valid on end customer purchases from authorized over the counter HP stores. To redeem the offers or know more about the offer and for offer T&Cs visit: www.redeemnow.in/hpnewyearoffer. Multi-core is designed to improve performance of certain software products. Not all customers or software applications will necessarily benefit from use of this technology. Performance and clock frequency will vary depending on application workload and your hardware and software configurations. Intel's numbering is not a measurement of higher performance. Not all features are available in all editions or versions of Windows. Systems may require ugraded and/or separately purchased hardware, drivers, software or BIOS update to take full advantage of Windows functionality. Windows 11 is automatically updated, which is always enabled. ISP fees may apply and additional requirements may apply over time for updates. See http://www.windows.com. Intel, the Intel logo, and Intel Core are trademarks of Intel Corporation or its subsidiaries.